ప్రతిపక్షం

www.prathipaksham.in

మంగళవారం 27.01.2026 | Published From Hyderabad | సంపుటి: 18 సంచిక: 307 పేజీలు:10 | ₹5

తిలక్ వర్మ వచ్చేస్తున్నాడు! 10

@prathipaksham | prathipaksham tv telugu

> హైదరాబాద్ ఇమేజ్‌ను పెంచేలా తెలంగాణ రైజింగ్ డాక్యుమెంట్ ఉంది. రాష్ట్రాన్ని మూడు ఎకానమీ జోన్లుగా విభజించారు. తెలంగాణ రాష్ట్రాన్ని గ్లోబల్ స్కిల్‌హబ్‌గా మార్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. యువతలో నైపుణ్యాలను పెంచేందుకు తెలంగాణ సర్కారు కృషి చేస్తున్నది. ధాన్యానికి బోనస్‌గా రైతులకు రూ.1,780 కోట్లు ప్రభుత్వం చెల్లించింది. సన్నవడ్లపై క్వింటాల్‌కు రూ.500 చొప్పన బోనస్‌ను చెల్లిస్తున్నాం. 26 లక్షల మంది రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేశాం.
>
> - గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ

గ్లోబల్ స్కిల్ హబ్‌గా
తెలంగాణ

మూడు ట్రిలియన్‌డాలర్ల ఎకానమీ లక్ష్యం
ప్రతి నియోజకవర్గానికి 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు

- రూ.1780 కోట్లు ధాన్యం భోనస్ చెల్లించాం
- రెండేళ్లలో 62వేల ఉద్యోగాల భర్తీ చేశాం
- భూ వివాదాల పరిష్కారానికి భూ భారతి
- 7,450 కిమీ పంచాయతీ రోడ్ల అభివృద్ధి
- గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ వెల్లడి
- సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్లో గణతంత్ర వేడుకలు
- వేడుకల్లో పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, జనవరి 26: తెలంగాణ రాష్ట్రాన్ని గ్లోబల్ స్కిల్‌హబ్‌గా మార్చాలని ప్రభుత్వం నిర్ణయించిందని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ తెలిపారు. మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్యంగా తెలంగాణ ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. రైజింగ్ తెలంగాణ 2047 సరికొత్త లక్ష్యాలను నిర్దేశించుకుందని తెలిపారు. 77వ గణతంత్ర దినోత్సవాల్లో భాగంగా సికింద్రాబాద్ లోని పరేడ్ మైదానంలో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకలకు గవర్నర్ ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం సైనికుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అమర జవాన్లకు గవర్నర్, సైనికాధికారులు నివాళులర్పించారు. ఈ వేడుకల్లో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి, శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి

...:: మిగతా 2లో

ఢిల్లీలో ఘనంగా గణతంత్ర వేడుకలు

కర్తవ్యపథ్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించిన రాష్ట్రపతి ముర్ము

- అమరవీరులకు ప్రధాని మోదీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ నివాళులు
- భారత్‌తో ప్రపంచం సుస్థిరం: ఉర్సులా
- ప్రత్యేక ఆకర్షణగా ఆపరేషన్ సిందూర్ శకట ప్రదర్శన

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో

న్యూఢిల్లీ, జనవరి 26: దేశ రాజధాని ఢిల్లీలోని కర్తవ్యపథ్‌లో రిపబ్లిక్ డే వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ముందుగా ప్రధాని నరేంద్ర మోదీ, రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ సైనిక అమరవీరులకు నివాళులు అర్పించారు. అనంతరం గుర్రపు బగ్గీలో విదేశీ అతిథులతో హాజరైన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు ప్రధాని ఆహ్వానం పలికారు. తర్వాత ముర్ము జాతీయ జెండాను ఆవిష్కరించి జాతీయ గీతాన్ని ఆలపించారు. అనంతరం వేడుకలపై నాలుగు

...:: మిగతా 2లో



దేశవ్యాప్తంగా గణతంత్ర వేడుకలు

77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. న్యూఢిల్లీలో నిర్వహించిన పరేడ్‌లో యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా, యూరోపియన్ కమిషన్ ఉర్సులా వాన్ డెర్ లేయెన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు

9

భారత్–ఈయూ ఒప్పందంపై అమెరికా ఆగ్రహం

భారత్, యురోపియన్ యూనియన్‌ల మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కొలిక్కి వచ్చిన వేళ.. అమెరికా ఆర్థికశాఖ మంత్రి స్కాట్ బెసెంట్ కీలక వ్యాఖ్యలు చేశారు.

9

పేలిన మావోయిస్టుల మందుపాతర

ఛత్తీస్‌గఢ్ లోని కర్రెగుట్ట అటవీ ప్రాంతంలో మావోయిస్టులు అమర్చిన మందుపాతర పేలడంతో 11 మంది జవాన్లు గాయపడ్డారు. భద్రతా బలగాలు కూంబింగ్ ఆపరేషన్ నిర్వహిస్తుండగా ఈ ప్రమాదం జరిగింది.

9

ప్రజాపాలన కాదు.. రాక్షస పాలన

- రాష్ట్రంలో అనుముల రాజ్యాంగం
- జర్నలిస్టులను ఉగ్రవాదుల్లాగా అరెస్టు చేస్తున్నారు
- కోదాడలో లాకప్ డెత్‌కు ప్రభుత్వమే బాధ్యత వహించాలి
- బీజేపీ, కాంగ్రెస్ రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తున్నాయి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, జనవరి 26 : రాష్ట్రంలో అంబేద్కర్ అనుముల రేవంత్ రెడ్డి రాజ్యాంగం అమలవుతుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్ పాలన ప్రజాపాలన కాదని, రాజ్యాంగాన్ని పరిహసిస్తున్న రాక్షస పాలనని దుయ్యబట్టారు. గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక నాటిక ప్రదర్శన ఏర్పాటు చేశారు. తెలంగాణలో ప్రస్తుతం కొనసాగుతున్న రాజ్యాంగ ఉల్లంఘనలను ఎండగడుతూ, ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటిచెప్పే విధంగా నిర్వహించిన ప్రదర్శన ఆద్యంతం ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు అద్భుతమైన ప్రదర్శన చేశారని అభినందించారు. రాజ్యాంగం గురించి మాట్లాడే కాంగ్రెస్, రాహుల్ గాంధీ ప్రతిసారీ రాజ్యాంగాన్ని తుంగలో తొక్కుతున్నారని విమర్శించారు. 'బోధించు, సమీకరించు, పోరాడు' అనే అంబేద్కర్ తత్వాన్ని

...:: మిగతా 2లో

బీసీల కులగణనపై కేంద్రం కొత్త మోసం

- ఈనెల 29న రౌండ్ టేబుల్ సమావేశం
- మోసం, అన్యాయాన్ని ప్రజలకు వివరిస్తాం
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, జనవరి 26: జనగణనలో బీసీల కుల గణనపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కొత్త మోసానికి తెరతీసిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా బంజారాహిల్స్ లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో జాతీయ జెండా ఎగురవేసిన అనంతరం ఆమె మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం విడుదల

...:: మిగతా 2లో

మంగళవారం హాజరుకండి

- మాజీ ఎంపీ సంతోష్‌కు సిట్ నోటీసులు
- వేగంగా ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, జనవరి 26: తెలంగాణ రాజకీయాల్లో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తు స్పీడ్ అందుకుంది. ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. బీఆర్ఎస్ నేత, మాజీ ఎంపీ సంతోష్‌రావుకు సిట్ నోటీసులు జారీ చేసింది. ఈ కేసులో ఇప్పటికే మాజీ మంత్రులు హరీశ్ రావు, కేటీఆర్‌లకూ నోటీసులిచ్చి విచారించిన సంగతి తెలిసిందే. ఆదివారం మాజీ ఎంపీ సంతోష్ రావుకు

...:: మిగతా 2లో

పీఆర్సీ అడిగితే ఏసీబీ దాడులు

- ప్రతిపక్షాలు ప్రశ్నిస్తే సిట్ నోటీసులు
- కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు
- మాజీ మంత్రి హరీష్ రావు ధ్వజం

...:: 8లో

జర్నలిస్టులకు ఫజుల్ రహమాన్ స్మారక అవార్డు

- అవసరమైన మొత్తాన్ని హుస్నాబాద్ ప్రెస్ క్లబ్ కు డిపాజిట్ చేస్తాం
- ఫజుల్ రహమాన్ మరణం హుస్నాబాద్‌కు తీరని లోటు
- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- ఫజుల్ రహమాన్ పేరిట కళాభవన్ నిర్మించాలి
- సానుకూలంగా స్పందించిన మంత్రి

ప్రతిపక్షం ప్రతినిధి, సిద్దిపేట/ హుస్నాబాద్

జనవరి 26: సీనియర్ జర్నలిస్టు, కవి, రచయిత, ప్రతిపక్షం వ్యవస్థాపక సంపాదకులు ఫజుల్ రహమాన్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు ఏర్పాటు చేయాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హుస్నాబాద్ ప్రెస్ క్లబ్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ అవార్డు కోసం అవసరమైన మొత్తాన్ని ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తామని ఆయన ప్రకటించారు. హుస్నాబాద్ ప్రెస్ క్లబ్ -స్ఫూర్తి అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ బాలికల పాఠశాలలో సోమవారం సీనియర్ జర్నలిస్ట్, కవి, రచయిత

...:: మిగతా 2లో

20 నిమిషాలకు ఓ భారతీయుడి అరెస్ట్

అమెరికాలోకి అక్రమంగా ప్రవేశిస్తూ అక్కడి సరిహద్దుల్లో ప్రతి 20 నిమిషాలకు ఓ భారతీయుడు అరెస్ట్ అవుతున్నట్టు అమెరికా కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ విభాగం వెల్లడించింది.

9

ఢిల్లీలో ఘనంగా గణతంత్ర వేడుకలు

మొదటిపేజీ తరువాయి

ఎంఐ17 హెలికాప్టర్లు పూలవర్షం కురిపించాయి. ఈ సంవత్సరం గణతంత్ర దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథులుగా హాజరైన యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లేయన్ , యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో లూయిస్ శాంటోస్ డా కోస్టా హాజరయ్యారు. కర్తవ్య పథంలో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ప్రారంభమైన సందర్భంగా , ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చారిత్రాత్మక ఇండియా గేట్ వద్ద ఉన్న జాతీయ యుద్ధ స్మారక చిహ్నం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. ప్రధానమంత్రి వెంట రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, రక్షణ సేవల చీఫ్ జనరల్ అనిల్ చౌహాన్, ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది, ఎయిర్ స్టాఫ్ చీఫ్ ఎయిర్ చీఫ్ మార్షల్ ఎపిఎస్ సింగ్, నావల్ స్టాఫ్ చీఫ్ అడ్మిరల్ దినేష్ త్రిపాఠి ఉన్నారు. న్యూఢిల్లీలో నిర్వహించిన గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో భారత్ తన సాంస్కృతిక వైభవాన్ని, ఆర్థిక ప్రగతిని, యుద్ధ విమానాలు, స్వదేశీ తయారీ క్షిపణులు, కొత్తగా స్థాపించిన రెజిమెంట్లు, ఆపరేషన్ సిందూర్‌లో ఉపయోగించిన అస్త్రశస్త్రాలతోసహా తన పూర్తి సైనిక పాటవాన్ని ప్రపంచానికి చాటిచూపింది. యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా, యూరోపియన్ కమిషన్ ఉర్సులా వాన్ డెర్ లేయెన్ ముఖ్య అతిథులుగా ఈ వేడుకలకు హాజరుకావడంతో ఈ సందర్భం సైనిక ప్రదర్శనతోపాటు కీలక దౌత్యపరమైన ఘటనగా కూడా మారింది. ఈ సైనిక కవాతు భారతదేశ వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని, రష్యా, అమెరికా నుంచి సమీకరించుకున్న ఆయుధ సంపత్తిని ప్రతిబింబించింది. వందేమాతరం గేయం 150 వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆ ఇతివృత్తంతో జరిగిన గణతంత్ర వేడుక ఆపరేషన్ సిందూర్‌కు కూడా కర్తవ్య పథ్‌లో ప్రాధాన్యత లభించింది. కోస్టా, లేయెన్‌తో కలసి సంప్రదాయ బగ్గీలో కర్తవ్య పథ్‌కు చేరుకున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సైనిక వందనం స్వీకరించిన వెంటనే కవాతు ప్రారంభమైంది. ప్రధాని నరేంద్ర మోదీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, పలువురు ఇతర కేంద్ర మంత్రులు, త్రివిధ దళాల ప్రధానాధికారులు, విదేశీ దౌత్యవేత్తలు, సీనియర్ అధికారులు తదితరులు గణతంత్ర కవాతును వీక్షించారు.

అబ్బురపరిచిన విన్యాసాలు

బ్రహ్మోస్, ఆకాశ్ క్షిపణులు, రాకెట్ లాంచర్ వ్యవస్థ సూర్యాస్త్ర, ప్రధాన యుద్ధ ట్యాంకు అర్జున్, కొత్తగా ఏర్పర్చిన శక్తిబన్ రెజిమెంట్‌తోసహా తన ఫ్రంట్‌లైన్ సైనిక సంపత్తిని భారత్ ప్రపంచానికి ప్రదర్శించింది. పాకిస్థాన్‌పై గత ఏడాది మే 710 మధ్య త్రివిధ దళాలు సంయుక్తంగా సమన్వయంతో నిర్వహించిన ఆపరేషన్ సిందూర్ విజయానికి సూచనగా బాణం గుర్తు, త్రివర్ణ పతాకంతో కూడిన త్రివిధ దళాల ప్రత్యేక శకట ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం వైమానిక దళం తన యుద్ధ విమానాలతో విన్యాసాలు నిర్వహించింది. 16 యుద్ధ విమానాలు, నాలుగు రవాణా విమానాలు, తొమ్మిది హెలికాప్టర్లతోసహా మొత్తం 29 విమానాలు ఇందులో పాల్గొన్నాయి. వీటిలో రాఫెల్, ఎస్‌యూ30, ఎంకేఐ, మిగ్29, జాగ్వార్ విమానాలు కూడా ఉన్నాయి. బ్రహ్మోస్, ఆకాశ్ ఆయుధ వ్యవస్థలు, అడ్వాన్స్డ్ టోవ్డ్ ఆర్టిలరీ గన్ సిస్టమ్, ధనుష్ ఆర్టిలరీ గన్, దివ్యాస్త్ర బ్యాటరీ, కొన్ని డ్రోన్లను కూడా పరేడ్‌లో ప్రదర్శించారు. భూమి నుంచి భూమిపైని లక్ష్యాలను 300 కిలోమీటర్ల వరకు ఛేదించగల రాకెట్ లాంచర్ సిస్టమ్ సూర్యాస్త్రను కూడా పరేడ్‌లో మొదటిసారి ప్రదర్శించినట్లు అధికారులు చెప్పారు.

భారత్‌తో ప్రపంచం సుస్థిరం: ఉర్సులా

భారతదేశం ప్రపంచాన్ని మరింత స్థిరంగా, సంపన్నంగా, సురక్షితంగా మార్చగలదని యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లేయన్ సోమవారం ప్రకటించారు. గణతంత్ర వేడుకలను వీక్షించిన అనంతరం ఆమె మాట్లాడారు. మంగళవారం భారత్‌యూరోపియన్ మధ్య శిఖరాగ్ర సమావేశం జరగనున్నది. గణతంత్ర వేడుకలకు ముఖ్య అతిథులుగా హాజరుకావడం జీవితకాల గౌరవంగా ఉర్సులా సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు.

తొలిసారిగా భైరవ్, శక్తిబన్

కొత్తగా స్థాపించిన భైరవ్ లైట్ కమాండో బెటాలియన్, శక్తిబన్ రెజిమెంట్ , రాకెట్ లాంచర్ వ్యవస్థ సూర్యాస్త్ర, స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన సైనిక సంపద, వాటి వెంబడి సైనిక సిబ్బంది వంటివి అనేకం ఈ ఏడాది భారత గణతంత్ర దినోత్సవ వేడుకల్లో మొట్టమొదటిసారి ప్రజల ముందుకు వచ్చి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రెండు మూపురాలు ఉన్న ఒంటెలు, హిమాలయాలకు చెందిన పొట్టి గుర్రాలు కూడా మొదటిసారి సంప్రదాయక కవాతులో భాగస్వామ్యం అయ్యాయి. అదే విధంగా మొదటిసారి 61 క్యావల్రీ కంటింజెంట్‌కు చెందిన సిబ్బంది సంప్రదాయ దుస్తులతో అశ్వాలపై కూర్చుని కవాతులో పాల్గొన్నారు. అలాగే మిశ్రమ స్కౌట్స్ కంటింజెంట్ కూడా తొలిసారి గణతంత్ర పరేడ్‌లో పాల్గొంది. భారీ ఉన్ని దుస్తులు, పోలరైజ్డ్ సన్‌గ్లాసెస్, ప్రత్యేక బూట్లు ధరించి ఎత్తయిన శీతల ప్రదేశాల్లోని వాతావరణాన్ని తట్టుకునే విధంగా రాటుతేలిన ఈ కంటింజెంట్ సిబ్బంది కవాతులో పాల్గొనగా వీక్షకులు హర్షధ్వానాలతో జేజేలు పలికారు. సైనికుల కాళ్ళుల సామర్థ్యాన్ని పెంచేందుకు ఆర్టిలరీలో కొత్తగా నెలకొల్పిన శక్తిబన్ రెజిమెంట్ కూడా మొదటిసారి ఈ ఏడాది గణతంత్ర కవాతులో పాల్గొంది. గత ఏడాది అక్టోబర్‌లో స్థాపించిన భైరవ్ లైట్ కమాండో బెటాలియన్ కూడా కవాతులో మొదటిసారి పాల్గొంది.

మంగళవారం హాజరుకండి

మొదటిపేజీ తరువాయి

సిట్ నోటీసులు జారీ చేసింది. నేటి ఉదయం 11 గంటలకు వ్యక్తిగతంగా విచారణకి హాజరుకావాలని నోటీసులో పేర్కొంది. ఈ కేసులో ఇతర నిందితులు ఇచ్చిన సమాచారం ఆధారంగా సంతోష్‌రావుకు సిట్ నోటీసులు పంపించింది. ఇటీవల ఫోన్ ట్యాపింగ్ కేసులో సుప్రీం కోర్టు సైతం కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న ప్రభాకర్ రావు విచారణపై దర్యాప్తు సంస్థను దేశ అత్యున్నత న్యాయస్థానం ప్రశ్నించింది. ఇప్పటికే రెండు వారాల కస్టడీకి అనుమతించామని, ఇంకెంత కాలం విచారణ కొనసాగిస్తారని ప్రశ్నించింది. ప్రభాకర్ రావు విచారణను త్వరగా పూర్తి చేయాలని సుప్రీం కోర్టు ఆదేశించింది. ఈ క్రమంలోనే ఫోన్ ట్యాపింగ్ కేసులో దర్యాప్తు స్పీడ్ అందుకుంది.

ఇందిరమ్మ రాజ్యంలో మాటంటే మాటే

- షాద్‌నగర్ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- లబ్ధిదారులకు సిమెంటు సంచులు అందజేత

ప్రతిపక్షం, షాద్‌నగర్, జనవరి 26 : ఇందిరమ్మరాజ్యంలో మాట్లాడితే మాటే.. ప్రజలకు ఏది చెప్తామో అదే చేస్తాం.. ఇప్పటిదాకా నిరుపేదలకు ఇల్లు ఇచ్చిన ఘనత ఒక్క కాంగ్రెస్ పార్టీకి మాత్రమే దక్కింది.. అని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. నందిగామ మండలం ఈదులపల్లి గ్రామంలో 22 మంది ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులకు ఒక్కొక్కరికి 20 చొప్పున సిమెంట్ బ్యాగులను ఆయన అందించారు. ఇందిరమ్మ గృహాలు పటిష్టంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో ఇందిరాగాంధీ హయాంలో నిరుపేదలకు ఇల్లు నిర్మించి ఇచ్చే కార్యక్రమం ప్రారంభమైందని, తరువాత రాష్ట్రంలో వైయస్ రాజశేఖర్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని గుర్తు చేశారు. ఇప్పుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కూడా ఈ కార్యక్రమం గ్రామ గ్రామాన విజయవంతంగా కొనసాగుతుందని ఈ సందర్భంగా ఆయన అన్నారు. భవిష్యత్తులోనూ లబ్ధిదారులందరికీ ఇందిరమ్మ ఇల్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పటిష్టత విషయంలో ఎటువంటి రాజీ ఉండదని ఆయన స్పష్టం చేశారు. నిరుపేదలను గృహప్రవేశం చేయించడం తనకు ఎంతో సంతోషంగా ఉందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

రాష్ట్ర మీడియా అక్రిడేషన్ కమిటీలో ప్రెస్ క్లబ్ కమిటీ

- సీఎం రేవంత్, మంత్రి పొంగులేటికీ ప్రెస్ క్లబ్ ధన్యవాదాలు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవరి, 26: హైదరాబాద్ ప్రెస్ క్లబ్ పాలకమండలి విజ్ఞప్తి మేరకు తెలంగాణ రాష్ట్ర మీడియా కమిటీ లో అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ని ప్రెస్ క్లబ్ పాలకమండలి అభ్యర్థించిన వెంటనే రాష్ట్రం మీడియా అక్రిడేషన్ లో అవకాశం కల్పించడం పట్ల ప్రెస్ క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్. విజయకుమార్ రెడ్డి, రమేష్‌వరికుప్పల, ఉపాధ్యక్షులు ఏ. రాజేష్, అరుణ అత్తలూరి, జాయింట్ సెక్రటరీలు చిలుకూరి హరిప్రసాద్ ,బాపురావు వర్దేల్లి, కోశాధికారి రమేష్ వైట్ల సహా కార్యవర్గం మొత్తం ధన్యవాదాలు తెలిపింది. అంతేకాకుండా మహిళా జర్నలిస్టులకు 33 శాతం అక్రిడేషన్లు ఇవ్వాలన్న అభ్యర్థన కు కూడా మంత్రి పొంగులేటి ఉత్తర్వులు జారీ చేయడం పట్ల ప్రెస్ క్లబ్ కమిటీ హర్షం వ్యక్తం చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి జర్నలిస్టుల పక్షపాతి అనడానికి ఇది ఒక నిదర్శనమని ప్రెస్ క్లబ్ పాలకమండలి అభివర్ణించింది.

రేవంత్ ప్రభుత్వం సిట్ నోటీసుల్ని పొలిటికల్ వెపన్‌లా వాడుతోంది. కోల్ స్కామ్‌పై ప్రశ్నించడంతో పబ్లిక్ అటెన్షన్‌ను డైవర్ట్ చేసేందుకు నాకు, కేటీఆర్‌కు నోటీసులు ఇచ్చారు. ఈ స్కామ్‌పై గవర్నర్‌కు ఫిర్యాదు చేయాలని బీఆర్ఎస్ నిర్ణయించిన కొన్ని గంటల్లోనే మాజీ ఎంపీ సంతోష్‌కు నోటీసులు వచ్చాయి.

- మాజీ మంత్రి హరీశ్ రావు

గ్లోబల్ స్కిల్ హబ్‌గా తెలంగాణ

మొదటిపేజీ తరువాయి

రామకృష్ణారావు, డీజీపీ శివధర్ రెడ్డి పాల్గొన్నారు. గణతంత్ర వేడుకల దృష్ట్యా పరేడ్ గ్రౌండ్ పరిసర ప్రాంతాల్లో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రసంగించిన గవర్నర్, ప్రజా ప్రభుత్వం ఇటీవలే తెలంగాణ డాక్యుమెంట్‌ను ఆవిష్కరించిందని పేర్కొన్నారు. హైదరాబాద్ ఇమేజ్‌ను పెంచేలా తెలంగాణ రైజింగ్ డాక్యుమెంట్ ఉందన్న ఆయన రాష్ట్రాన్ని మూడు ఎకానమీ జోన్లుగా విభజించారని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రాన్ని గ్లోబల్ స్కిల్ హబ్‌గా మార్చాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. యువతలో నైపుణ్యాలను పెంచేందుకు తెలంగాణ సర్కారు కృషి చేస్తుందన్నారు. ఐటీఐలను అడ్వాన్స్ టెక్నికల్ సెంటర్లుగా మార్చామని, ప్రజా ప్రభుత్వం ఇప్పటి వరకు 62 వేల ఉద్యోగాలను భర్తీ చేసిందని వివరించారు.

భూ వివాదాల పరిష్కారానికి భూ భారతి

భూ వివాదాలు పరిష్కరించే విధంగా భూభారతి చట్టం తెచ్చినట్లుగా గవర్నర్ వివరించారు. ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందన్నారు. ధాన్యానికి బోనస్‌గా రైతులకు రూ.1,780 కోట్లు ప్రభుత్వం చెల్లించిందన్నారు. సన్నవడ్లపై క్వింటాల్‌కు రూ.500 చొప్పున బోనస్‌ను చెల్లిస్తున్నామన్నారు. 26 లక్షల మంది రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేసినట్లు గుర్తు చేశారు. గతేడాది నిర్వహించిన బతుకమ్మ వేడుకలకు గిన్నిస్ బుక్‌లో చోటు దక్కిందని పేర్కొన్నారు. రైతులకు 24 గంటలు నాణ్యమైన ఉచిత విద్యుత్ అందిస్తున్నామన్న గవర్నర్, మేడారం అభివృద్ధి కోసం రూ.251 కోట్లు కేటాయించామన్నారు.

విద్య, వైద్యం ప్రాధాన్యతలుగా

ప్రతి నియోజకవర్గానికి 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసిందని జిష్ణుదేవ్ వర్మ తెలిపారు. పేదలకు సొంతింటి కల నెరవేర్చేందుకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్నట్లుగా పేర్కొన్నారు. రాష్ట్రంలో 1.30కోట్ల కుటుంబాలకు ఉచితంగా సన్నబియ్యం ఇస్తున్నారని చెప్పారు. రేషన్‌కార్డుదారులకు సన్నబియ్యం అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని పేర్కొన్నారు. 27 ఎకరాల్లో రూ.2 వేల కోట్లతో కొత్త ఉస్మానియా ఆస్పత్రి నిర్మిస్తున్నామన్న ఆయన, విద్య, వైద్యాన్ని తెలంగాణ ప్రభుత్వం ప్రాధాన్యతలుగా తీసుకుందని జిష్ణుదేవ్ వర్మ తెలిపారు. విద్యార్థులకు సమాన అవకాశాల కోసమే ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు నిర్మిస్తున్నామన్నారు. మహిళలు ఇప్పటికే రూ.200 కోట్ల ఉచిత బస్సు ప్రయాణాలు చేశారని గవర్నర్ తెలిపారు. మహిళలను పెట్రోల్‌బంకులు, ఆర్టీసీ అద్దె బస్సులకు యజమానులుగా చేశామన్నారు. బ్యాంక్ రుణాల ద్వారా మహిళలకు రూ.40 వేల కోట్లు సమకూర్చామన్నారు. మహిళలను వ్యాపారవేత్తలుగా మార్చేందుకు కార్యాచరణ చేపట్టామని వెల్లడించారు.

7,450 కి.మీ పంచాయతీ రోడ్ల అభివృద్ధి

7,450 కి.మీ పంచాయతీ రోడ్లను ప్రభుత్వం అభివృద్ధి చేయనుందని జిష్ణుదేవ్ వర్మ తెలిపారు. తొలిదశలో రోడ్ల కోసం రూ. కోసం రూ.11,399 కోట్లు కేటాయించామన్నారు. హ్యామ్ విధానంలో 12 వేల కి.మీ. రోడ్లను అభివృద్ధి చేయనున్నట్లుగా వెల్లడించారు. నగరంలో కాలుష్యాన్ని తగ్గించేందుకు చర్యలు చేపట్టినట్లుగా వివరించారు. హిల్ట్ పాలసీ ద్వారా కాలుష్య పరిశ్రమలను సిటీ వెలుపలకు తరలించనున్నట్లుగా తెలిపారు. చేనేత కార్మికులకు రూ.5లక్షల బీమా పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. 27 ఎకరాల్లో రూ.2 వేల కోట్లతో కొత్త ఉస్మానియా ఆస్పత్రి నిర్మిస్తున్నట్లుగా గవర్నర్ వివరించారు

బ్యాంకుల ద్వారా మహిళలకు రూ.40 వేల కోట్లు

మహిళలను వ్యాపారవేత్తలుగా మార్చేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టామని గవర్నర్ తెలిపారు. బ్యాంకుల ద్వారా మహిళలకు రూ.40 వేల కోట్లు సమకూర్చామని, మహిళలను పెట్రోల్ బంకులు, ఆర్టీసీ అద్దె బస్సులకు ఓనర్లుగా చేశామని చెప్పారు. ఆర్టీసీ బస్సుల్లో ఇప్పటికే 200 కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణాలు చేశారని వెల్లడించారు. విద్య, వైద్యానికి ప్రాధాన్యత ఇచ్చిన ప్రభుత్వం.. 27 ఎకరాల్లో రూ.2వేల కోట్లతో కొత్త ఉస్మానియా ఆస్పత్రి నిర్మాణం చేపట్టిందని గవర్నర్ తెలిపారు.

రాష్ట్రంలో 3.35 కోట్ల మందికి సన్నబియ్యం

తెలంగాణలో 1.30 కోట్ల కుటుంబాలకు ఉచితంగా సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని, రాష్ట్రంలో 3.35 కోట్ల మందికి సన్న బియ్యం అందిస్తున్నామని జిష్ణుదేవ్ వర్మ చెప్పుకొచ్చారు. ప్రతి నియోజకవర్గానికి 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తామని, చేనేత కార్మికులకు రూ.5లక్షల బీమా పథకం అమలు చేస్తున్నామని చెప్పారు. హైదరాబాద్‌లో కాలుష్య నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని, హిల్ట్ పాలసీతో కాలుష్య పరిశ్రమలను సిటీ బయటకు తరలిస్తామని గవర్నర్ వెల్లడించారు. అంతకుముందు, సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన 77వ రిపబ్లిక్ డే వేడుకల్లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. రిపబ్లిక్ డే వేడుకల్లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి, శ్రీధర్ బాబు తదితరులు హాజరయ్యారు. అమెరికా పర్యటనలో ఉండటంతో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రిపబ్లిక్ డే పరేడ్‌కు హాజరుకాలేదు. సీఎం రేవంత్ రెడ్డి రిపబ్లిక్ డే సందర్భంగా తెలంగాణ ప్రజలకు సోషల్ మీడియా ద్వారా సందేశమిచ్చారు. రాష్ట్ర ప్రజలందరికీ హృదయపూర్వక గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. భారత రాజ్యాంగం ఆమోదించబడిన ఈ రోజును భారతదేశ చరిత్రలో ముఖ్యమైన సందర్భంగా సీఎం అభివర్ణించారు.

ప్రజాపాలన కాదు.. రాక్షస పాలన

మొదటిపేజీ తరువాయి

కేసీఆర్ అద్భుతంగా ఆకళింపు చేసుకొని తెలంగాణను సాధించి అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారని కొనియాడారు. అంబేద్కర్ ఇచ్చిన ఆర్టికల్ 3, అంబేద్కర్ ఆలోచనా విధానం వల్లనే నేడు అల్పసంఖ్యాక వర్గాలకు న్యాయం జరుగుతున్నదని, ప్రత్యేక రాష్ట్రాలు ఏర్పడుతున్నాయని అన్నారు. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ పోటీపడి రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తున్నాయని పేర్కొన్నారు. రాజ్యాంగం ఎంత గొప్పదైనా దాన్ని అమలు చేసే వ్యక్తి సరైనోడు కాకుంటే ప్రయోజనం శూన్యమని ఆనాడే అంబేద్కర్ వెల్లడించారని తెలిపారు. సరిగ్గా అదే పరిస్థితి కేంద్రం, రాష్ట్రాల్లో కనిపిస్తున్నదని అన్నారు. రాహుల్ గాంధీ తుక్కుగూడలో ఇచ్చిన న్యాయ పత్రం అన్యాయ పత్రంగా మారిందని విమర్శించారు. పార్టీ ఫిరాయింపులకు వ్యతిరేకంగా చట్టం చేస్తామన్న రాహుల్ గాంధీ వెనకనే ఫిరాయింపుదారులు ఉన్నారని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రంలో జర్నలిస్టులను సైతం ఉగ్రవాదుల్లాగా అరెస్టు చేస్తున్నారని వెల్లడించారు. కోదాడలో కర్ర రాజేష్ లాకప్ డెత్‌కు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. రాజేష్ దళితుడు కావడమే కాంగ్రెస్ పాలనలో ఆయన చేసుకున్న పాపమైందని పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డి 'జెండా గద్దెలు కూల్చండి' అంటూ ప్రజల్ని రెచ్చగొడుతూ శాంతిభద్రతలను, రాజ్యాంగ విలువలను పాతిపెడుతున్నాడని దుయ్యబట్టారు. 400 ఎకరాల యూనివర్సిటీ భూమిని రేవంత్ రెడ్డి లాక్కొని దౌర్జన్యం చేస్తుంటే హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు దేశాన్ని కదిలించారని వెల్లడించారు, వారి పోరాటానికి సుప్రీంకోర్టు కూడా కదిలి వచ్చి ఎంపవర్డ్ కమిటీని వేసిందని, ఈ వ్యవహారంలో రూ. 10 వేల కోట్ల భూమి కుంభకోణం జరిగిందని చెప్పిందని వెల్లడించారు.

బీసీల కులగణనపై కేంద్రం కొత్త మోసం

మొదటిపేజీ తరువాయి

చేసిన సెన్సెస్ 2026 డాక్యుమెంట్ లో బీసీల క్లాసిఫికేషన్‌కు ఆప్షన్ పెట్టలేదని మండిపడ్డారు. ఎస్సీ, ఎస్టీ, అదర్స్ గా సెన్సెస్ నిర్వహిస్తే దేశంలో బీసీల సంఖ్య ఎంత ఉందనే విషయం ఎలా బయట పడుతుందని ప్రశ్నించారు. 2011లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం సెన్సెస్ విషయంలో చేసిన మోసాన్నే ఇప్పుడు కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం చేస్తోందని మండిపడ్డారు. జనగణన విషయంలో కేంద్రం చేసిన మోసంపై తెలంగాణ జాగృతి యుద్ధభేరి మోగించబోతుందని హెచ్చరించారు. తెలంగాణలోని అన్నివర్గాల ప్రజలను సమాయత్తం చేసి ఈనెల 29న రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తామన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన కుల గణనలో బీసీల సంఖ్య తక్కువ చేసి చూపించారని.. కేంద్రం చేయబోయే కుల గణనలోనైనా బీసీల లెక్క తేలుతుందని అందరం ఆశలు పెట్టుకున్నామని అన్నారు. కానీ కేంద్రం ఇచ్చిన డాక్యుమెంట్ లో బీసీల కాలమ్ లేకపోవడంతో పాటు సబ్ క్యాస్ట్ ను సూచించే కాలమ్ కూడా పెట్టలేదని తెలిపారు. తద్వారా బీసీలను కేంద్ర ప్రభుత్వం అవమాన పరిచిందని అన్నారు. బీసీలతో పాటు బీసీలలోని ఉప కులాలను, ఎస్సీ, ఎస్టీల్లోని ఉప కులాలు, ఇతర కులాల్లోని ఉప కులాలను సైతం వేర్వేరుగా లెక్కించాల్సిందేనని డిమాండ్ చేశారు. కేంద్రం చేసిన మోసంపై బీసీ మేధావులతో మాట్లాడుతున్నానని తెలిపారు. 29న నిర్వహించబోయే రౌండ్ టేబుల్ సమావేశానికి బీసీ, ఎస్సీ, ఎస్టీ, సంచార జాతులతో పాటు ఇతర కులాల్లోని అన్ని ఉప కులాల వారిని ఆహ్వానిస్తున్నామని తెలిపారు. ఒక్కో కులంలో ఎంత శాతం మంది ఉన్నారు.. ఉప కులాల్లో ఎందరు ఉన్నారు అనే డాక్యుమెంట్ తయారు చేసి తెలంగాణ జాగృతి తరపున కేంద్ర ప్రభుత్వానికి సమర్పిస్తామన్నారు. బీసీల గణన విషయంలో కేంద్రం చేస్తున్న కుట్రలను తిప్పికొట్టడానికి ప్రతి ఒక్కరూ తమతో కలిసి రావాలని పిలుపునిచ్చారు.

ఇన్నయ్య కుటుంబానికి కవిత పరామర్శ

తెలంగాణలో ప్రజల పక్షాన ఎప్పుడూ నిలబడ్డ ఉద్యమకారుడు ఇన్నయ్య అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. ఇన్నయ్య తల్లి ఇటీవల మృతి చెందగా వారి కుటుంబాన్ని కవిత పరామర్శించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ దగాపడ్డ తెలంగాణ పుస్తక ప్రచురణ, 1997లో నిర్వహించిన సభ ద్వారా తెలంగాణ సమస్యలను వెలుగులోకి తేవడంలో ఆయన పాత్రను ఉందన్నారు. తెలంగాణలో అన్యాయాలపై ఎప్పుడూ స్పష్టంగా అభిప్రాయాలు చెప్పేవారని కవిత అన్నారు. ఇన్నయ్య దగాపడ్డ తెలంగాణ అనే సభను నిర్వహించి, ప్రజల్లో తెలంగాణ సమస్యల గురించి అవగాహన పెంచి ఎంతోమందిని ఉద్యమంలోకి తేవడంలో కీలక పాత్ర పోషించారు. ఇన్నయ్య ఇటీవల జరిగిన ఆపరేషన్ కగార్‌లోని ఎన్‌కౌంటర్లపై తన అభిప్రాయాలు వ్యక్తం చేసినందుకు అరెస్ట్ అయ్యాడు. తెలంగాణ ఇలా ఎన్నో సందర్భాల్లో ఉద్యమకారులను అరెస్ట్ చేసిన ఘట్టాలను చూసింది. రాష్ట్ర సాధించిన తర్వాత కూడా ఇంత పెద్ద అన్యాయం జరగడం సరి కాదని కవిత పేర్కొన్నారు. ఇన్నయ్య "మా ఇల్లు" అనే సంస్థ ద్వారా అనాథ పిల్లలను పెంచి, వారిని మంచి పౌరులుగా తీర్చిదిద్దారు. జాగృతి, తెలంగాణ సమాజం ఎల్లప్పుడూ ఇన్నయ్య పక్షాన ఉంటుందని, ఉద్యమకారులను తెలంగాణ ఎప్పుడూ మరిచిపోకుండా చూస్తుందని కవిత తెలిపారు. ఇన్నయ్య యువతను ఉద్యమంలోకి తీసుకెళ్లడంలో, ప్రజల పక్షాన నిలబడడంలో చేసిన సేవలను తెలంగాణ సమాజం ఎప్పుడూ గుర్తు చేసుకుంటుందని, వారి స్వగ్రామానికి ఆయనకు మద్దతుగా రావడం స్ఫూర్తిదాయకం అని అన్నారు.

జర్నలిస్టులకు ఫజుల్ రహమాన్ స్మారక అవార్డు

మొదటిపేజీ తరువాయి

ఫజుల్ రహమాన్ సంతాప సభ జరిగింది. ఈ సభకు పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హుస్నాబాద్ ప్రాంతం ఒక నిబద్ధత కలిగిన సీనియర్ జర్నలిస్టు, సమాజహితం కోసం కలం పట్టిన ఓ నిజాయితీగల మేధావిని కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫజుల్ రహమాన్ జర్నలిజాన్ని వృత్తిగా కాకుండా ఒక బాధ్యతగా భావించారని పేర్కొన్నారు. సమాజంలోని సమస్యలను ప్రజల ముందుకు తీసుకువచ్చారని మంత్రి గుర్తు చేశారు. తాను విద్యార్థి నాయకుడిగా, ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడిగా ఉన్న రోజుల నుంచి ఫజుల్ రహమాన్ తో అనేక అంశాలపై చర్చలు జరిపేవాడినని గుర్తు చేసుకున్నారు. ఆయన ఆలోచనలు తనను ప్రభావితం చేసేవని చెప్పారు. ఆయన అనారోగ్యానికి గురైన సమయంలో నిమ్స్ ఆసుపత్రి వైద్యులతో మాట్లాడి నాణ్యమైన వైద్యం అందించాలని ప్రయత్నించామని అన్నారు. అయినప్పటికీ ఆయనను కాపాడుకోలేక పోయామని విచారం వ్యక్తం చేశారు. ఫజుల్ రహమాన్ కష్టతరమైన జర్నలిస్టు జీవితాన్ని అనుభవిస్తూనే విద్యకు ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. హుస్నాబాద్ పబ్లిక్ స్కూల్ స్థాపించి ఎందరో విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేశారని పేర్కొన్నారు. ఆయనతో తన అనుబంధం భావోద్వేగమైందని చెప్పారు. సామాజిక మార్పు కోసం ఆయన చూపిన మార్గం అనుసరణీయమని మంత్రి తెలిపారు. ఫజుల్ రహమాన్ లాంటి వారు క్యాన్సర్ బారిన పడకుండా ప్లాస్టిక్ వాడకం తగ్గించేందుకు స్ఫూర్తి అసోసియేషన్ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే హుస్నాబాద్ నియోజకవర్గంలో 280 మహిళా సంఘాలకు స్టీల్ బ్యాంకులు ఏర్పాటు చేశామని తెలిపారు. ఫజుల్ రహమాన్ ఆశయాలను కొనసాగిస్తూ సమాజ సేవ, విద్యా అభివృద్ధి, విలువైన జర్నలిజం కోసం ముందుకు సాగడమే ఆయనకు నిజమైన నివాళి అని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ ఫజుల్ రహమాన్ మరణం పత్రికా రంగానికి ముఖ్యంగా హుస్నాబాద్ ప్రాంతానికి తీరని లోటని పేర్కొన్నారు. నాటక, సాహిత్య రంగంలో కృషి చేసి జర్నలిస్టుగా పేరు పొందిన ఫజుల్ రహమాన్ స్మారక కళాభవన్ నిర్మించాలని సంతాప సభలో వక్తలు మంత్రిని కోరారు. ఇందు కోసం స్థలం కేటాయించాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించారు. హుస్నాబాద్ డివిజన్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు పిట్టల తిరుపతి, స్ఫూర్తి అసోసియేషన్‌అధ్యక్షులు పందిల్ల శంకర్, సభ్యులు విధుమౌళి, కవి, రచయిత, జర్నలిస్టు అన్నవరం దేవేందర్, కవి, రచయిత మక్కెర సంపత్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడెం లింగమూర్తి, సింగిల్ విండో మాజీ చైర్మన్‌బొలిశెట్టి శివయ్య, కాంగ్రెస్‌నాయకులు ఎండీ హసన్, జర్నలిస్టులు రాజు, నన్నె అజయ్‌కుమార్, కొత్తపల్లి రామకృష్ణ తదితరులు ఫజుల్ రహమాన్తో తమ అనుబంధాలను నెమరువేసుకున్నారు.

స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొనని వారు అధికారంలో వచ్చారు

- రాజ్యాంగాన్ని మార్చే ప్రయత్నాలు చేస్తున్నారు
- ఇందిర, పీవీ, మన్మోహన్ దేశానికి గట్టి పునాదులు వేశారు
- టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్
- ఘనంగా గాంధీభవన్‌లో గణతంత్ర దినోత్సవ వేడుకలు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవరి 26: స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొనని పెద్దలు 2014 నుంచి అధికారంలోకి వచ్చారని, వారు రాజ్యాంగాన్ని మార్చే ప్రయత్నాలు చేస్తున్నారని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ విమర్శించారు. హైదరాబాద్ గాంధీభవన్‌లో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. టీపీసీసీ అధ్యక్షుడు జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మహాత్మా గాంధీ పేరును తొలగించాలని మన్రేగా పథకాన్ని రద్దు చేస్తున్నారని.. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ చిత్రాలు కనిపిస్తాయని బీజేపీ ప్రభుత్వం కుట్రలు చేస్తోందని ఆరోపించారు. 2014 వరకు యూపీఏ ప్రభుత్వం తీసుకొచ్చిన సంక్షేమ పథకాలను తొలగిస్తున్నారని మండిపడ్డారు. ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కుతున్నారని, లౌకికవాదానికి తూట్లు పొడుస్తున్నారని, కులాలు మతాల మధ్య చిచ్చు పెడుతున్నారని మహేష్ గౌడ్ ఆరోపణలు గుప్పించారు. కేసీఆర్ హయాంలో తెలంగాణలో ఆర్థిక విధ్వంసం జరిగిందని... సీఎం రేవంత్ రెడ్డి ఆర్థిక విధ్వంసం నుంచి వికాసం వైపు నడిపిస్తున్నారని పేర్కొన్నారు. ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ సూచనలతో తెలంగాణను ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు. కుల సర్వేతో యావత్ రాష్ట్రాలు తెలంగాణ వైపు చూస్తున్నాయని తెలిపారు. బీసీలకు 40 శాతం రిజర్వేషన్లు ఇవ్వడానికి, నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వడానికి కట్టుబడి ఉన్నామని తెలిపారు. కులగణన బిల్లులను బీజేపీ అడ్డుకుంటోందని, బీజేపీ కుట్రలను ప్రజలు అర్థం చేసుకోవాలని టీపీసీసీ చీఫ్ కోరారు. మహాత్ముడి ఆధ్వర్యంలో స్వాతంత్ర్య పోరాటం విజయవంతమైందని, ప్రపంచం గర్వించదగ్గ రాజ్యాంగాన్ని అంబేద్కర్ రాశారన్నారు. మహాత్మా గాంధీ కలలు నెరవేర్చే దూరదృష్టి ఉన్న వ్యక్తి నెహ్రూ అని ప్రశంసించారు. ఐరన్ లేడీ ఇందిరా గాంధీ, పీవీ నరసింహారావు, మన్మోహన్ సింగ్ దేశానికి గట్టి పునాదులు వేశారని పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో మంత్రులు డాక్టర్ అజారుద్దీన్, షబ్బీర్ అలీ సహా వీహెచ్, దానం నాగేందర్, సంపత్, కోదండరాం, బెల్లయ్య నాయక్, చిన్నారెడ్డి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హార్వర్డ్ వర్సిటీలో సీఎం రేవంత్

ప్రతిపక్షం, హైదరాబాద్, జనవరి 26: అమెరికాలోని ప్రఖ్యాత హార్వర్డ్ యూనివర్సిటీకి చెందిన కెనెడీ స్కూల్‌లో (కేంబ్రిడ్జ్, మసాచుసెట్స్) ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ కార్యక్రమానికి ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదివారం మధ్యాహ్నం (స్థానిక కాలమానం ప్రకారం) హాజరయ్యారు. తొలి రోజు పరిచయ కార్యక్రమాలతో పాటు '21వ శతాబ్దంలో నాయకత్వం' కోర్సులో భాగంగా "అధికార విశ్లేషణ.. నాయకత్వం" అంశంపై తొలి సెషన్ ప్రారంభమైంది. సోమవారం ఉదయం 7 గంటల నుంచే తరగతులు ప్రారంభమయ్యాయి. ఇందులో కేస్ అనాలిసిస్, వివిధ అంశాలపై తరగతులు, కన్సల్టేటివ్ గ్రూప్ వర్క్ వంటి కార్యక్రమాల్లో సభ్యులు పాల్గొన్నారు. సోమవారం సాయంత్రం ఆరు గంటల వరకు తరగతులు కొనసాగనున్నాయి. మరోవైపు బోస్టన్ ప్రాంతమంతా తీవ్ర శీతాకాల అత్యవసర పరిస్థితులు నెలకొన్నాయి. భారీ మంచు తుఫాను (ఫెర్న్) కారణంగా రెండు అడుగులకుపైగా మంచు కురిసినట్లు సమాచారం. ఉష్ణోగ్రతలు మైనస్ 20 డిగ్రీల సెల్సియస్‌కి దిగువకు పడిపోయాయి.

మౌలిక హక్కులను ఇందిరాగాంధీ కాలరాశారు

- అంబేడ్కర్‌ను ఓడించిన చరిత్ర కాంగ్రెస్‌ది
- గ్రామీణ ఉపాధి పథకంలో కోట్ల రూపాయల కుంభకోణం
- పేదలకు మేలు చేయాలన్నదే ప్రధాని మోదీ లక్ష్యం
- కాంగ్రెస్‌పై రామచందర్ రావు విమర్శలు
- బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, జనవరి 26: తెలంగాణ బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు జాతీయ జెండాను ఎగరవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజలకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. చాలా మంది రాజ్యాంగాన్ని మార్చే ప్రయత్నాలు చేశారని, నెహ్రూ రాజ్యాంగాన్ని పక్కకు పెట్టారని విమర్శించారు. మొదటిసారి రాజ్యాంగాన్ని అవమానించింది నెహ్రూ అని, అంబేడ్కర్‌ను అవమానించారని ఆరోపించారు. అంబేడ్కర్‌ను ఓడించిన చరిత్ర కాంగ్రెస్‌ది అంటూ విరుచుకుపడ్డారు. రాజ్యాంగంలో కల్పించిన మౌలిక హక్కులను మాజీ ప్రధాని ఇందిరాగాంధీ కాలరాశారని, ఇందిరా, రాజీవ్ గాంధీల బాటలోనే రాహుల్ గాంధీ నడుస్తున్నారని విమర్శించారు. భారతీయులకు మాత్రమే ఓటు హక్కు ఉండాలని, ఇతర దేశాలకు చెందిన వారికి ఓటు హక్కు ఎలా కల్పిస్తారని ప్రశ్నించారు. సీఐఆర్ పై కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. గ్రామీణ ఉపాధి పథకంలో కోట్ల రూపాయల కుంభకోణం జరిగిందని ఆరోపించారు. పేదలకు మేలు చేయాలన్నదే ప్రధాని మోదీ లక్ష్యమని తెలంగాణ బీజేపీ చీఫ్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ 60 ఏళ్లపాటు దేశాన్ని దోచుకుందని.. పేదలకు మేలు చేసే పథకాలను కాంగ్రెస్ వ్యతిరేకిస్తోందని రాష్ట్ర బీజేపీ చీఫ్ విమర్శించారు. రేవంత్ రెడ్డిపై క్రిమినల్ కేసులు ఉన్నాయన్నారు. అంబేడ్కర్‌కు కాంగ్రెస్ ప్రభుత్వం భారతరత్న ఇవ్వలేదని గుర్తుచేశారు. అంబేడ్కర్‌ను, రాజ్యాంగాన్ని గౌరవించింది మోదీ ప్రభుత్వమని ఆయన వెల్లడించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు రైతులకు ఏమీ చేయలేదని, ప్రధాని కిసాన్ యోజన ద్వారా రైతులకు మోదీ మేలు చేస్తున్నారని పేర్కొన్నారు. మజ్లిస్‌తో కలిసి కాంగ్రెస్ పని చేస్తోందని... కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు అవినీతి పార్టీలంటూ వ్యాఖ్యలు చేశారు. రెండు పార్టీలను తరిమికొట్టి బీజేపీని ఆదరించాలని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు పిలుపునిచ్చారు. ఈ వేడుకల్లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు, ఎంపీ లక్ష్మణ్ పాల్గొన్నారు.

స్పీకర్‌ను అవమానించిన కేటీఆర్

- బహిరంగంగా క్షమాపణ చెప్పాలి
- రాజ్యాంగాన్ని గౌరవిస్తున్నట్లు నాటకాలా?
- ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవరి 26: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ పై కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర తీవ్ర విమర్శలు గుప్పించారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. గణతంత్ర దినోత్సవం రోజున రాజ్యాంగాన్ని, రాజ్యాంగబద్ధ హోదాలో ఉన్న స్పీకర్‌ను అవమానించినందుకు కేటీఆర్ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. 'సభాపతిని ధృతరాష్ట్రుడితో పోల్చడం ఏమిటి? సభ్యుడిగా మీకు సంస్కారముందా? ముఖ్యమంత్రిని అవమానించడం మీది ఏ రాజనీతి?' అని ఎమ్మెల్సీ విమర్శించారు. అద్దంకి ఇంకా మాట్లాడుతూ.. 'మీరు, పది మంది గురించి మాట్లాడుతున్నారు.. కానీ 39 మందిని మీ పార్టీలో చేర్చుకున్న మిమ్మల్ని ఏమనాలి? మీరు చేసిన రాజ్యాంగ ద్రోహాన్ని ప్రజలు మననం చేసుకుంటున్నారు. ఫ్రస్ట్రేషన్‌తో చేస్తున్న మీ నాటకాలను ప్రజలు తిరస్కరించారు. మీరు ప్రతిపక్ష నాయకులుగా ఉండటం దురదృష్టకరం. ఇప్పటికైనా మీరు చేసిన తప్పును గమనించి క్షమాపణ చెబితే మంచిది' అని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు.

నిజామాబాద్ ఘటన దురదృష్టకరం

- నిందితులకు చట్టప్రకారం శిక్ష తప్పదు
- ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ
- నిమ్స్ ఆస్పత్రిలో సౌమ్యను పరామర్శించిన మంత్రి
- ఆమె ఆరోగ్య పరిస్థితిపై ఆరా

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవరి 26: నిజామాబాద్‌లో గంజాయి స్మగ్లర్ల దాడిలో గాయపడి నిమ్స్‌లో చికిత్స పొందుతున్న ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్యను, ఆమె కుటుంబ సభ్యులను ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సోమవారం పరామర్శించారు. సౌమ్యపై దాడి దురదృష్టకరమని మంత్రి విచారం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగాన్ని పూర్తిగా అరికట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఎక్సైజ్, పోలీస్, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది ఈ లక్ష్యాన్ని చేరుకునేందుకు ఎంతగానో కృషి చేస్తున్నారని మంత్రి తెలిపారు. ఈ క్రమంలోనే నిజామాబాద్‌లో జరిగిన ఘటన అత్యంత దురదృష్టకరమని రాజనర్సింహ అన్నారు. ఇందులు కారకులైన ప్రతి ఒక్కరినీ చట్టప్రకారం కఠినంగా శిక్షిస్తామని స్పష్టం చేశారు. సౌమ్య ఆరోగ్య పరిస్థితి నిన్నటి కంటే మెరుగైనప్పటికీ.. ఇంకా ఆమె కండీషన్ క్రిటికల్‌గానే ఉందని తెలిపారు. నిమ్స్‌లో సుశిక్షితులైన సీనియర్ వైద్యుల బృందం, సౌమ్యకు అత్యాధునిక వసతులతో కూడిన మెరుగైన వైద్య సేవలు అందిస్తోందన్నారు. సౌమ్య సంపూర్ణంగా కోలుకుటుందని ఆశిస్తున్నామన్నారు. ఆమె కుటుంబాన్ని అన్నిరకాలుగా ఆదుకునే బాధ్యత తమ ప్రభుత్వానిదేనని హామీ ఇచ్చారు. విధి నిర్వాహణలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులపై దాడులను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని హెచ్చరించారు. నిందితులపై ఇప్పటికే హత్యాయత్నం కేసు నమోదు చేయించామని ఈ సందర్భంగా మంత్రి పేర్కొన్నారు. నిమ్స్‌లో సౌమ్యను పరామర్శించిన మంత్రికి ఆమె ఆరోగ్య పరిస్థితిని నిమ్స్ డైరెక్టర్ బీరప్ప, వైద్యులు వివరించారు.

ఆదివాసీ సంస్కృతికి సరిహద్దులు, భాషలు అడ్డుకావు

- మంత్రి సీతక్క
- మేడారాన్ని సందర్శించిన న్యూజిలాండ్ మావోరి తెగ ప్రతినిధులు
- గద్దల ప్రాంగణంలో హాకా నృత్య ప్రదర్శన
- కళాకారులతో కలిసి నృత్యం చేసిన మంత్రి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, జనవరి 26: ఆదివాసీ సంస్కృతికి దేశ సరిహద్దులు, భాషలు అడ్డుకావని, ప్రపంచంలోని ఎక్కడైనా ఆదివాసీలు అడవి, ప్రకృతి మీదే ఆధారపడి జీవనం సాగిస్తారని పంచాయతీ రాజ్, స్త్రీ-శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. సమ్మక్క-సారలమ్మ మహాజాతర సందర్భంగా సోమవారం న్యూజిలాండ్‌కు చెందిన మావోరి తెగకు చెందిన గిరిజన ప్రతినిధులు మేడారాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మేడారం గద్దల ప్రాంగణంలో మావోరి తెగ వారి సంప్రదాయ నృత్యమైన "హాకా" నృత్యాన్ని వారు ప్రదర్శించారు. హాకా నృత్యం అనేది మావోరి తెగలో యుద్ధానికి సిద్ధమయ్యే సమయంలో తమ సైనికుల్లో ఉత్సాహం నింపేందుకు, శత్రువుల్లో భయాన్ని కలిగించే విధంగా చేసే సంప్రదాయ నృత్యంగా ప్రసిద్ధి చెందింది. ఈ నృత్యంలో ముఖభావాలు, శరీర చలనలు అత్యంత ప్రభావవంతంగా ఉంటాయి. తెలంగాణ-న్యూజిలాండ్ సాంస్కృతిక మార్పిడి కార్యక్రమంలో భాగంగా పంచాయతీ రాజ్, స్త్రీ-శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ప్రత్యేక చొరవతో మావోరి తెగ ప్రతినిధులు మేడారం మహాజాతరను సందర్శించారు. హాకా నృత్య ప్రదర్శన సందర్భంగా మంత్రి సీతక్క స్వయంగా కళాకారులతో కలిసి నృత్యం చేసి వారి ఉత్సాహాన్ని పెంచారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ఆదివాసీ జీవన విధానం, విశ్వాసాలు ప్రపంచవ్యాప్తంగా ఒకే తత్వాన్ని ప్రతిబింబిస్తాయని ఆమె పేర్కొన్నారు. అనంతరం మావోరి తెగ ప్రతినిధులను గద్దల వద్దకు తీసుకెళ్లి వన దేవతల దర్శనం చేయించారు. సమ్మక్క-సారలమ్మ వన దేవతల వైభవం, చరిత్రను మంత్రి సీతక్క స్వయంగా వారికి వివరించారు. ఈ సందర్భంగా బంగారం, వన దేవతల ప్రసాదాన్ని అందజేసి మావోరి తెగ ప్రతినిధులను సన్మానించారు.

మున్సిపల్ ఎన్నికల్లో 56 శాతం టికెట్లు

బీసీలకు ఇవ్వాల్సిందే

- లేకపోతే రాహుల్ రాష్ట్ర పర్యటనను అడ్డుకుంటాం
- మాట ఇచ్చి విస్మరిస్తే కాంగ్రెస్ పార్టీకి పుట్టగతులు లేకుండా చేస్తాం
- సీఎం, పీసీసీ చీఫ్ బీసీలకు సమాధానం చెప్పాలి
- బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ వెల్లడి

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవరి 26: ప్రస్తుతం జరిగే మున్సిపల్ ఎన్నికల్లో బీసీలకు జనాభా దామాషా ప్రకారం 56% టికెట్లు ఇవ్వకుంటే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తెలంగాణ రాష్ట్ర పర్యటన అడ్డుకుంటామని బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు. సోమవారం హైదరాబాదులోని అభినంద్ గ్రాండ్ హోటల్ లో బీసీ జేఏసీ కో చైర్మన్ ఉప్పరి శేఖర్ సగర అధ్యక్షతన జరిగిన మీడియా సమావేశంలో జేఏసీ వర్కింగ్ చైర్మన్ గుజ్జ కృష్ణలతో కలిసి జాజుల శ్రీనివాస్ గౌడ్ మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీల ఓట్ల కోసం అధికారంలోకి రాకముందు కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు జరిగిన భారత్ జూడో యాత్రలో రాహుల్ గాంధీ దేశంలో కుల గణన జరగాలి, కులగరణ జరిగిన తర్వాత ఎవరి వాటా వారికి దక్కాలని ఊరూరా ప్రచారం చేశాడని, గత ఎన్నికల సందర్భంగా తెలంగాణ లోను రాహుల్ గాంధీ ఇదే విషయం పదేపదే చెప్పి బీసీల ఓట్లు వేయించుకున్నారని, అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీని విస్మరించి బీసీలకు అన్యాయం చేస్తూ గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని అలాగే ప్రస్తుతం మున్సిపల్ ఎన్నికలు నిర్వహించడం కోసం రేపో మాపో ఎన్నికల నోటిఫికేషన్ కూడా విడుదల చేయడం చాలా అన్యాయం అన్నారు. రాజ్యాంగబద్ధంగా రిజర్వేషన్లు ఇవ్వడం వీలుకాకపోతే పార్టీ తరపున బీసీలకు 42 శాతం టికెట్లు కేటాయిస్తామని గతంలో ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ అధిష్టానం తీరా ఎన్నికలు సమయం జరుగుతున్న సందర్భంలో ఆ ప్రస్తావనే తీసుకురావడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ పరంగా కాంగ్రెస్ ఇవ్వాలనుకుంటే 42 శాతం కాకుండా తెలంగాణలో జరిగిన కులగణన దామాషా ప్రకారం 56% పార్టీ పరంగా కేటాయించి కాంగ్రెస్ పార్టీ తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని ఇతర రాజకీయ పార్టీలకు కూడా ఆదర్శంగా నిలబడాలని ఆయన డిమాండ్ చేశారు. తక్షణమే సీఎం రేవంత్ రెడ్డి పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ మున్సిపల్ ఎన్నికలపై బీసీ సమాజానికి స్పష్టత నివ్వాలని, రిజర్వేషన్ల పరంగా ఇవ్వడం కుదరకపోతే తాము హామీ ఇచ్చినట్టుగా పార్టీ పరంగా జనాభా దామాషా ప్రకారం బీసీలకు 68 మున్సిపల్ చైర్మన్లు 1150 కౌన్సిలర్లు కార్పొరేటర్ పదవులు ఇవ్వాలని లేనిపక్షంలో భవిష్యత్తులో కాంగ్రెస్ పార్టీ రాజకీయంగా తీవ్ర నష్టాన్ని చెవి చూడవలసి వస్తుందని జాజుల శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు. బీసీ జేఏసీ కో చైర్మన్ ఉప్పరి శేఖర్ సగర అధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం కార్యనిర్వహక అధ్యక్షులు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు తాటికొండ విక్రమ్ గౌడ్, బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షులు కనకాల శ్యామ్ కురుమ, బీసీ జేఏసీ వైస్ చైర్మన్ పిట్ల శ్రీధర్, బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఈడిగ శ్రీనివాస్ గౌడ్, బీసీ జేఏసీ కన్వీనర్ కవుల జగన్నాథం, బీసీ కల్చరల్ పోరం అధ్యక్షులు శ్రీనివాస్ యాదవ్, బీసీ జేఏసీ కన్వీనర్లు గంగిరెడ్డుల నరసింహ, శివకుమార్ వడ్డెర, గూడూరు భాస్కర్ మేరు, మాదేశి రాజేందర్, సత్యరాజ్ గౌడ్, అర్ కే ప్రసాద్, లోక్నతం, సందీప్ ముదిరాజ్, రవి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ విపత్తులో 'ఆపద మిత్ర'ల భాగస్వామ్యం కీలకం

- కేంద్ర మంత్రి బండి సంజయ్ వ్యాఖ్యలు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవరి 26: విపత్తులు ఏర్పడే సమయంలో ప్రజల చురుకైన భాగస్వామ్యం, ముందస్తు సంసిద్ధత, సమన్వయం ఎంతో కీలకమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తెలిపారు. అందులో భాగంగా 'ఆపద మిత్ర' వలంటీర్లు అందిస్తున్న సేవలు ప్రసంశనీయమని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా బలమైన, ప్రజా కేంద్రిత విపత్తు ప్రతిస్పందన వ్యవస్థ నిర్మాణానికి కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ముఖ్యంగా విపత్తు ప్రమాద తగ్గింపు విషయంలోప్రధానమంత్రి ప్రతిపాదించిన పది అంశాల కార్యాచరణ ద్వారా అంతర్జాతీయ స్థాయిలో భారత్ కు ప్రత్యేక గుర్తింపు తెచ్చిందని తెలిపారు. గణతంత్ర దినోత్సవ వేడుకల నేపథ్యంలో సోమవారం న్యూఢిల్లీలోని సుష్మా స్వరాజ్ భవన్ లో ఎన్డీఎంఏ ఆధ్వర్యంలో నిర్వహించిన ''ఆపద మిత్ర'' వలంటీర్ల సంభాషణ కార్యక్రమంతోపాటు యువర్ ఫ్రెండ్ (మీ నేస్తం) కార్యక్రమంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. 'ఆపద మిత్ర ' స్వచ్ఛంద సేవకులు ఈ ఏడాది గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో దేశవ్యాప్తంగా నుండి హాజరైన 150 మంది ఆపదా మిత్ర్ స్వచ్ఛంద సేవకుల పాల్గొనడం, అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను రక్షించడంతోపాటు సమాజ ఆధారిత విపత్తు సంసిద్ధత ఎంత కీలకమో జాతీయ స్థాయిలో వెలుగులోకి తేవడం సంతోషంగా ఉందన్నారు. ఆపద మిత్ర స్వచ్ఛంద సేవకుల సేవలను గుర్తిస్తూ ఐదుగురు ఆపద మిత్ర వలంటీర్లతో రాష్ట్రపతి భేటీ కావడంతోపాటు గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో జాతీయ విపత్తు నిర్వహణ అథారిటీ ప్రత్యేక శకటం పాల్గొనడం ఆనందంగా ఉందని, శోధన-రక్షణ, ప్రథమ చికిత్స, తరలింపు, సహాయక చర్యల్లో అవసరమైన నైపుణ్యాలతో సిద్ధంగా ఉండి, విపత్తు అనంతర కీలక తొలి గంటల్లో అధికారిక బలగాలు చేరకముందే ఆపద మిత్రలు ఎంతో మంది ప్రాణాలను రక్షించగలుగుతున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా లక్షకు పైగా శిక్షణ పొందిన స్వచ్ఛంద సేవకులతో పాటు, ఎన్ఎస్ఎస్, ఎన్సీసీ, మై భారత్, భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ వంటి యువజన సంస్థల చురుకైన భాగస్వామ్యం ఉండటం ఆనందంగా ఉందన్నారు. జాతీయ ఫోరెన్సిక్ సైన్సెస్ యూనివర్సిటీ నేతృత్వంలో జాతీయ డిజిటల్ డేటా రిజిస్ట్రీ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే పటాకుల యూనిట్లు, ప్రధాన ప్రమాదకర పరిశ్రమలు, గనుల్లో పనిచేసే కార్మికుల డేటా సేకరణను సులభతరం చేసేలా మార్గదర్శకాలను రూపొందించి వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని అన్ని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. అంతకుముందు "మీ నేస్తం" వలంటీర్లతో పరస్పర సమావేశం కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర మంత్రి బండి సంజయ్ విపత్తు నిర్వహణకు సంబంధించిన ప్రదర్శనను వీక్షించారు. యువర్ ఫ్రెండ్ వాలంటీర్లకు డిజిటల్ సర్టిఫికెట్లు అందజేశారు. "డిజాస్టర్ విక్టిమ్ ఐడెంటిఫికేషన్ అండ్ మేనేజ్‌మెంట్" మార్గదర్శకాలను విడుదల చేయడంతో పాటు, సముదాయ ఆధారిత వాలంటీరిజం కోసం "యువర్ ఫ్రెండ్" మోడల్‌ను ఆవిష్కరించారు. వాలంటీర్లు తమ అనుభవాలను పంచుకోవడం ద్వారా క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సవాళ్లు, విజయాలను వివరించారు. విపత్తుల సమయంలో ప్రజల చురుకైన భాగస్వామ్యం, ముందస్తు సిద్ధత, సమన్వయం ఎంతో కీలకమని పేర్కొన్నారు.

“

సీఎం విదేశాల్లో ఉన్నప్పుడు పరిపాలనా అంశంలో నలుగురు మంత్రులు భేటీ అయితే తప్పేమీ లేదు. డిప్యూటీ సీఎం భట్టి ఈ విషయంగానే సమావేశం నిర్వహించినట్లు భావిస్తున్నాం. రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలపై సీఎం రేవంత్ విదేశాల నుంచి వచ్చాక హైకమాండ్‌తో చర్చిస్తాం.
- టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

ఓపెన్ వాయిస్

గవర్నర్ల తీరు రాజ్యాంగ విరుద్ధం

దక్షిణాది రాష్ట్రాల్లో ప్రస్తుతం గవర్నర్ల తీరుపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. కేంద్రరాష్ట్ర సంబంధాల మధ్య వారధిగా ఉండాల్సిన గవర్నర్లు, ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వాలతో ఢీ అంటే ఢీ అనే స్థాయికి వెళ్లడం ప్రజాస్వామ్య వ్యవస్థలో ఆందోళన కలిగిస్తోంది. భారత రాజ్యాంగం ప్రకారం రాష్ట్రానికి అధిపతి గవర్నర్. కానీ, అధికారం మాత్రం ప్రజలచే ఎన్నుకోబడిన ప్రభుత్వానిదే. అయితే ఇటీవల కాలంలో ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాలైన తమిళనాడు, కేరళ, కర్ణాటకలలో గవర్నర్లు అనుసరిస్తున్న తీరు రాజ్యాంగ సంప్రదాయాలను తుంగలో తొక్కేలా ఉందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రజాస్వామ్యంలో ప్రజల తీర్పుకు గౌరవం ఇవ్వాల్సిన స్థానంలో ఉన్న వ్యక్తులు, రాజకీయ ఏజెంట్లుగా మారుతున్నారా? అనే సందేహాలు కలగక మానవు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 176(1) ప్రకారం, ప్రతి ఏటా మొదటి అసెంబ్లీ సమావేశాల్లో గవర్నర్ ప్రసంగించడం ఒక తప్పనిసరి ప్రక్రియ. ఈ ప్రసంగం గవర్నర్ వ్యక్తిగత అభిప్రాయం కాదు అది ప్రభుత్వం రూపొందించిన విధాన పత్రం. కానీ, ప్రస్తుత గవర్నర్లు ఈ సంప్రదాయానికి తూట్లు పొడుస్తున్నారు. తమిళనాడు గవర్నర్ ఆర్. ఎన్. రవి జాతీయ గీతం అంశాన్ని తెరపైకి తెచ్చి అసెంబ్లీ నుంచి వాకౌట్ చేయడం చర్చనీయాంశమైంది. రాష్ట్ర సంస్కృతిని ప్రతిబింబించే 'తమిళ్ తాయి వాల్తు' విషయంలో ఆయన వ్యవహరించిన తీరు రాష్ట్ర ప్రభుత్వ హక్కులను ప్రశ్నించడమే అవుతుంది. తమిళనాడు అసెంబ్లీ సమావేశాలను ప్రారంభించి ప్రసంగించాల్సిన గవర్నర్ మధ్యలోనే వెళ్లిపోయారు. సభలో జాతీయ గీతం పాడాలని కోరినా సభాపతి వినిపించుకోలేదని లోక్‌భవన్ వెల్లడించింది. దేశంలోని అన్ని శాసన సభలలో గవర్నర్ ప్రసంగానికి ముందు జాతీయ గీతాలాపన చేయడం సంప్రదాయంగా కొనసాగుతోందని, స్టాలిన్ సర్కారు మాత్రం ఈ సంప్రదాయాన్ని బ్రేక్ చేస్తోందని పేర్కొంది. దీనికి నిరసనగా గవర్నర్ ఆర్.ఎన్.రవి అసెంబ్లీ నుంచి వాకౌట్ చేసినట్లు సమాచారం.కేరళ మాజీ గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్, ప్రస్తుత గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ ఇప్పుడు ప్రసంగంలోని కొన్ని భాగాలను కావాలనే వదిలేయడం గమనార్హం. కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించే అంశాలు ఉండకూడదనే నెపంతో ప్రభుత్వం పంపిన స్క్రిప్ట్‌ను ఎడిట్ చేయడం రాజ్యాంగ విరుద్ధం. తాజాగా కర్ణాటక గవర్నర్ తావర్ చంద్ గెహ్లాట్ కూడా ఇదే బాట పట్టారు. కేంద్రంపై విమర్శలు ఉన్న భాగాలను దాటవేస్తూ ఆయన ప్రసంగించడం, రాష్ట్ర ప్రభుత్వంపై తన ఆధిపత్యాన్ని ప్రదర్శించడమేనని విశ్లేషకులు భావిస్తున్నారు. రాజ్యాంగ పరిషత్ చర్చల్లో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గవర్నర్ల పాత్రను చాలా స్పష్టంగా వివరించారు. గవర్నర్‌కు సొంతంగా నిర్ణయాలు తీసుకునే అధికారం చాలా పరిమితమని, రాష్ట్ర మంత్రి మండలి సూచనల మేరకే ఆయన నడుచుకోవాలని స్పష్టం చేశారు. సాధారణంగా రాష్ట్ర క్యాబినెట్ ఆమోదించిన ప్రసంగ పాఠాన్ని గవర్నర్ చదవడం ఆనవాయితీ. అయితే, గురువారం సభకు వచ్చిన గవర్నర్ గహ్లోత్ ప్రభుత్వం సిద్ధం చేసిన ప్రతిని పక్కన పెట్టారు. "ఈ రాష్ట్రం ప్రగతి మార్గంలో నడుస్తోంది.. సమావేశాలు విజయవంతం కావాలని ఆకాంక్షిస్తున్నా" అని కేవలం రెండు లైన్లు మాత్రమే చదివి సభ నుండి వెళ్లిపోయారు. కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించే అంశాలు ప్రసంగంలో ఉండటం పట్ల ఆయన ముందుగానే అసహనం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది.గవర్నర్ తీరుపై ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తీవ్రంగా స్పందించారు. క్యాబినెట్ నిర్ణయాలను గౌరవించకుండా గవర్నర్ రాజ్యాంగ వ్యతిరేక చర్యకు పాల్పడ్డారని ఆయన ఆరోపించారు. ప్రభుత్వం తయారు చేసిన ప్రసంగాన్ని కాదని, ఆయన సొంతంగా సిద్ధం చేసుకున్న వ్యాఖ్యలు చేయడం చెల్లదని పేర్కొన్నారు. దీనిపై న్యాయ నిపుణులతో చర్చిస్తున్నామని, అవసరమైతే సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని సీఎం స్పష్టం చేశారు. గత రెండేళ్లుగా ప్రభుత్వం ఇచ్చిన ప్రసంగాలను యథావిధిగా చదివిన గవర్నర్, ఈసారి వ్యూహాత్మక మార్పు చేయడం వెనుక రాజకీయ కారణాలు ఉన్నాయని కాంగ్రెస్ నాయకులు ఆరోపిస్తున్నారు. కేంద్రరాష్ట్ర సంబంధాల విషయంలో గవర్నర్ కార్యాలయం రాజకీయ వేదికగా మారుతోందని వారు విమర్శిస్తున్నారు. ఈ పరిణామంతో కర్ణాటకలో పాలక పక్షం, గవర్నర్ మధ్య ఉన్న సంబంధాలు మరింత క్షీణించే అవకాశం కనిపిస్తోంది. బ్రిటిష్ పార్లమెంటరీ విధానంలోని "ది కింగ్ కెన్ డు నో రాంగ్" అనే సూత్రం ఇక్కడ వర్తిస్తుంది. అంటే ప్రభుత్వం రాసిచ్చిన ప్రసంగంలో తప్పులున్నా, ఒప్పిదాలున్నా దానికి బాధ్యత ప్రభుత్వానిదే తప్ప గవర్నర్‌ది కాదు. కాబట్టి, దానిని యథాతథంగా చదవడం గవర్నర్ బాధ్యత. గవర్నర్ వ్యవస్థ అనేది కేంద్రం, రాష్ట్రాల మధ్య సమన్వయం కోసం ఉండాలి కానీ, రాష్ట్ర ప్రభుత్వాల పనులకు ఆటంకం కలిగించే స్పీడ్ బ్రేకర్ లా మారకూడదు. గవర్నర్లు ఒక రాజకీయ పార్టీ ప్రతినిధులుగా కాకుండా, రాజ్యాంగ రక్షకులుగా వ్యవహరించాలి. సుప్రీంకోర్టు సైతం గతంలో పలు సందర్భాల్లో గవర్నర్ల పరిధిని గుర్తు చేసింది. రాజ్యాంగ బద్ధమైన పదవిలో ఉన్నవారు వ్యక్తిగత, రాజకీయ ఎజెండాలను పక్కన పెట్టి, ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ప్రతిపక్షం
హైదరాబాద్
మంగళవారం
27.01.2026

రోడ్డు ప్రయాణంలో పౌరుల అపశృతులు

ఎర్ర లైటు వెలుగుతున్నప్పుడు జంప్ చేయడం. సిగ్నల్ పడిపోయినా ఆగకుండా వెళ్లడం.సిగ్నల్ పసుపు రంగులో మారినప్పుడు వేగాన్ని పెంచి దాటడం. సిగ్నల్ వద్ద స్టాప్ లైన్ వెనుక ఆగకుండా వెళ్లడం.పసుపు నుంచి ఎరుపు లైటుకు మారుతున్నప్పుడు వేగంగా వెళ్లి సిగ్నల్ దాటడం వల్ల తరచూ వాహనాలు రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు.

పరాంకుశం రఘు నారాయణ
9949749987

ఈ సృష్టిలో సకల జీవరాశుల్లోకెల్లా మానవజన్మ అత్యంత మహోన్నతమైనది. ప్రాణం దేవుడిచ్చిన ఓ..గొప్ప వరం.ఆ ప్రాణాన్ని పది కాలాలపాటు ఆరోగ్యవంతంగా, సమాజోపయోగంగా తీర్చిదిద్దుకోవడం మన చేతిలోనే ఉందన్నది ఓ నగ్నసత్యం. నీ పుట్టుకకు ఓ సార్ధకత, సాఫల్యత సృష్టించుకునే పరిణామమంతా,అవగాహనతో కూడిన నీ ఆలోచనలోనే ఉందన్నది కూడా వాస్తవమే. ఇందుకు గాను నీ జీవితంలో ముడిపడి ఉన్న బంధాలు, అనుబంధాలపై అమితానురక్తి ఉండడంతో పాటుగా ఒకవేళ రోడ్డు ప్రమాదం వల్ల నీకేదైనా జరిగితే ఏర్పడే అగాధాన్ని ముందస్తుగా గ్రహించగలిగితే జాగ్రత్తగా మసలుకోగలుగుతావు.అలా ముందస్తుగా జాగరూకత వహిస్తే, రోడ్డు ప్రమాదాల బారి నుండి తప్పించుకునే అవకాశం ఎక్కువగా ఉంటుంది. నీ జీవితానికిదే పరమార్ధమవుతుంది.ప్రపంచవ్యాప్తంగా రోడ్డు భద్రతను అంచనా వేసే జుటోబి వార్షిక నివేదిక ప్రకారం భారతదేశం 49వ స్థానంలో ఉంది.సగటున రోజుకు 147 మంది రోడ్డు ప్రమాదంలో చనిపోతున్నారు.అంటే గంటకు సుమారు 6 మంది మరణిస్తున్నారు.ఇది మన స్వయంకృతాపరాదమే కదా! జాగరూకత వహిస్తే,ప్రమాదాల రేటును తగ్గించిన వారమవుతాం. ప్రతి పౌరుడు తన తోటి పౌరునితో రోడ్డు భద్రతా నియమాలపై తరచూ చర్చిస్తుండాలి.అప్రమత్తతపై దృష్టి కేంద్రీకరించాలి.

రహదారి భద్రత.. జీవితానికి రక్షణ:

భారత జాతీయ రహదారుల ప్రాధికారిక సంస్థ (ఎన్ హెచ్ ఎ ఐ) సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తరించి ప్రధానంగా జాతీయ రహదారులపై (ఎక్స్ప్రెస్ వే)జరుగుతున్న ప్రమాదాలపై దృష్టి సారించింది.వేగపరిమితి ఇతర నిబంధనలు అమలు కోసం అడ్వాన్స్ ట్రాఫిక్ మేనేజ్మెంట్ సిస్టంను (ఏటిఎంఎస్) అమలు చేయబోతోంది.దాదాపు జాతీయ రహదారులపై 3000 కిలోమీటర్లు మేర ఏ.టీ.ఎం.ఎస్ అమలు చేయబోతోంది.ప్రధానంగా హైవేలపై భద్రతా సమస్యలను గుర్తించడం కోసం డ్రోన్ వీడియోలు,మరియు నెట్వర్క్ సర్వే వెహికల్ డేటాను విశ్లేషించడానికి గాను జీఐఎస్ సాంకేతికను ఉపయోగించడానికి ఎన్ హెచ్ ఏటి యోచిస్తున్నది. సంస్థ తన ఇంజనీర్లకు 15 రోజుల పాటు రోడ్ సేఫ్టీ ఆడిట్ శిక్షణను కూడా అందిస్తోంది.ఐఐటీ ఢిల్లీ,సెంట్రల్ రోడ్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్,ఇండియన్ అకాడమీ ఆఫ్ హైవే ఇంజనీర్స్ సుమారు 240 మంది శిక్షణ కూడా పొందారు.

ట్రాఫిక్ సిగ్నల్ ఉల్లంఘన తోనే ప్రమాదాలు:

ఎర్ర లైటు వెలుగుతున్నప్పుడు జంప్ చేయడం.సిగ్నల్ పడిపోయినా ఆగకుండా వెళ్లడం.సిగ్నల్ పసుపు రంగులో మారినప్పుడు వేగాన్ని పెంచి దాటడం. సిగ్నల్ వద్ద స్టాప్ లైన్ వెనుక ఆగకుండా వెళ్లడం.పసుపు నుంచి ఎరుపు లైటుకు మారుతున్నప్పుడు వేగంగా వెళ్లి సిగ్నల్ దాటడం వల్ల తరచూ వాహనాలు రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు.

రోడ్డు భద్రతా సూచికలు:

రోడ్డు వినియోగదారులు సురక్షితంగా,సమర్థవంతంగా నడపటానికి ఈ సూచికలు బాగా ఉపకరిస్తాయి.

1. స్టాప్ సైన్: ఎరుపు అష్టభుజ ఆకారం తప్పనిసరిగా ఆగాలి.
2. గివ్ వే: వేగం తగ్గించి ఇతర ట్రాఫిక్ కు దారివ్వాలి.
3. నో ఎంట్రీ: లోపలికి అనుమతి లేదని గమనించాలి.

4. స్పీడ్ లిమిట్: వృత్తంలోని సంఖ్య సూచించిన వేగాన్ని మించరాదు.
5 హార్న్ ప్రొహిబిటెడ్: హార్న్ గుర్తుకు అడ్డంగా హార్న్ కొట్టరాదు.
6. వన్ వే: బాణం గుర్తుతో దీర్ఘ చతురస్రం. ఒకే దిశలో వెళ్లాలి.
7. స్లిప్పరీ రోడ్డు: ఇది జారే రోడ్డు గుర్తు అని గమనించాలి.
8. ఫాలింగ్ రోడ్డు: ఇక్కడ రాళ్లు పడే అవకాశం ఉన్న ప్రాంతంగా గమనంలోకి తీసుకోవాలి.
9. స్కూల్ అహెడ్: పాఠశాల అతి సమీపంలో ఉందని హెచ్చరిక బోర్డు అది.
10. వైల్డ్ యానిమల్స్: ఇక్కడ అడవి జంతువులు తిరిగే ప్రదేశంగా భావించాలి.
11.పెడస్ట్రియల్ క్రాసింగ్: ఇక్కడ నుండి పాదచారులు దాటే ప్రదేశం.

అలాగే హాస్పిటల్, గ్యాస్ స్టేషన్, డెడ్ అండ్ స్ట్రీట్, టీ రోడ్ కూడలి తదితర సూచికలు రోడ్డు వెంట అక్కడక్కడ ఉంటాయి.వాటిని గమనంల్లోకి తీసుకొని డ్రైవింగ్ చేస్తే ,అందరూ క్షేమంగా తమ గమ్యాలకు చేరుకుంటారు. ఇట్లాంటి బోర్డులన్నీ భాషతో సంబంధం లేకుండా అర్థమయ్యే రీతిలోనే గుర్తులతో ఉంటాయి.

రోడ్డు ప్రమాదాలు.. నివారణోపాయాలు:

ప్రతి వాహనదారుడు మొదటగా తన వాహనం యొక్క కండీషన్,అలాగే రోడ్డుపై ప్రయాణించేటప్పుడు డ్రైవింగ్ లైసెన్సు,ఇన్సూరెన్స్, రిజిస్ట్రేషన్ పేపర్స్ వెంట ఉంచుకోవడం పాటు,సీట్ బెల్ట్ ఉపయోగించటం,మనం చేరుకునే గమ్యానికి అడ్వాన్స్ ప్లాన్ చేసుకోవడం.అంటే ముందస్తుగా బయలుదేరటం పరిమిత వేగంతో వెళ్లడం తదితరాల విషయాలలో జాగ్రత్త వహించాలి.ట్రాఫిక్ సిగ్నల్స్,సూచికలు పాటించాలి.సెల్ ఫోను చూడటం,నిద్రలేమితనం,నీ ముందు కదిలే వాహనానికి సురక్షిత దూరం పాటించటం,రోడ్డుపై వృద్ధులు, పిల్లలు కనుక ఎదురైనప్పుడు జాగ్రత్తగా ఉండటం మొదలగు విషయాల పట్ల మొదటగా వాహనదారే జాగ్రత్త వహించాలి. గతంలో జరిమానాలు రూ.లు 100 లేదా రూ.లు 200 ఉండేది.కానీ మోటార్ వాహనాల సవరణ చట్టం 2019 ప్రకారం రోడ్డు నిబంధనను మొదటగా ఉల్లంఘిస్తే రూ.లు ఐదు వేలు, రెండోసారి ఉల్లంఘిస్తే పదివేలు జరిమానా కూడా విధిస్తున్నారు.

ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించటం:

నీ ఎదురుగా ట్రాఫిక్ సిగ్నల్ లో ఎరుపురంగు వస్తే, తప్పనిసరిగా ఆగిపోండి. పసుపు రంగు సిగ్నల్ వస్తే వేగం తగ్గించండి.ఆకుపచ్చ రంగు సిగ్నల్ వస్తే ముందుకు వెళ్ళండి. త్రిభుజాలు అనేవి ఓ హెచ్చరికల బోర్డులు.చతురస్రాలు సమాచారం లేదా సూచనలకు చిహ్నాలు.వృత్తాలు నిషేధానికి చిహ్నం. రోడ్డు ప్రమాదాలను నివారించడానికి గాను ,ప్రజల్లో యువకుల్లో ఇటీవల కాలంలో రోడ్డు భద్రతపై అవగాహనా కార్యక్రమాలు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. ఈ సందర్భంగా కళాశాలలో సైతం విద్యార్థినీ విద్యార్థులకు రోడ్డు నిబంధనలపై అవగాహనా సదస్సులు కూడా నిరంతరాయంగా నిర్వహించబడుతున్నాయి. అలాగే రోడ్డుపై ప్రయాణించేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలపై మరీ ముఖ్యంగా, మద్యపానాన్ని సేవించి వాహనాలు నడపడం ద్వారా ప్రమాదాలకు హేతువవుతున్నది.ఈ విషయంలో మరింత లోతుగా అవగాహన కార్యక్రమాల్ని పెంచాలి. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీని ఎక్కువ మంది సంఖ్యాబలంతో నిరంతరాయంగా చెక్ చేయాలి.మానవులుగా మన తప్పిదాలను సవరించుకుంటే రోడ్డు ప్రమాదాల వారి నుండి రక్షింపబడతాము.

(వ్యాసకర్త జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, తొర్రూరు, మహబూబాబాద్ జిల్లా)

తెలంగాణ వైతాళికుడు జాదవ్ కేశవరావు

సుధాకర్.ఏ.వి
9000674747

నిస్వార్థ ఉద్యమకారుడు,తెలంగాణ వైతాళికుడు,తెలంగాణ ఉద్యమం తొలితరం నేత,తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం,ముల్కీ ఉద్యమం,జై తెలంగాణ పోరాటంతో పాటూ తెలంగాణ మలి దశ ఉద్యమంలోనూ చురుగ్గా పాల్గొన్న వ్యక్తి జాదవ్ కేశవరావు.ఈయన 1933 జనవరి 27న శంకర్‌రావు,అమృత దంపతులకు హైదరాబాదు పాతబస్తీలోని హుస్సేనీఆలంలో జన్మించాడు. ఉస్మానియా విశ్వవిద్యాలయములో ఆంగ్ల అధ్యాపకునిగా పనిచేశారు. తెలంగాణ తొలి దశ ఉద్యమంలో ప్రొఫెసర్ కేశవ రావు జాదవ్ జైలు జీవితం గడిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తెలంగాణ యునైటెడ్ ఫ్రంట్ ను స్థాపించారు. ఉద్యోగ రీత్యా అన్ని అర్హతలు కలిగినప్పటికీ ఉన్నత స్థాయి ప్రమోషన్ కోసం ఎప్పుడూ ఆరాటపడలేదు. యూనివర్సిటీలో పొందగలిగే పదవులను కూడా ఏనాడు ఆశించలేదు.తన జీవితాన్ని వృత్తికి,ఉద్యమాలకే అంకితం చేశారు. ఏ ప్రయోజనాలు ఆశించకుండానే అనేక ఉద్యమాల్లో క్రియాశీలక పాత్ర పోషించిన నిరాడంబర,నిస్వార్థ, ఆదర్శవంతమైన మేధావి ఆయన. జాతీయ నాయకుడు,రైల్వే మాజీ మంత్రి, సోషలిస్ట్ అయిన జార్జ్ ఫెర్నాండస్‌తో సన్నిహిత సంబంధాలు ఉండేవి. సమాజంలో మహిళల పట్ల గౌరవాన్ని పెంపొందించే దిశలో అనేక సభల్లో మాట్లాడేవారు, వాదించేవారు. షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డు తెగల ప్రజల పట్ల వివక్షతను అనేక సందర్భాల్లో ఎదిరించారు. బలహీన వర్గాల సామాజిక, ఆర్థిక అభివృద్ధి కోసం ఆరాటపడేవారు. ప్రజా ఉద్యమాల్లో, రాష్ట్ర సాధన పోరాటంలో గాంధేయ విధానాన్ని పాటించాలని యువతకు ఉద్బోధించేవారు. తెలంగాణ ప్రాంతానికి జరుగుతున్న అనేక అన్యాయాలపై ప్రశ్నిస్తూ, ఉద్యమానికి స్ఫూర్తినిచ్చిన మేధావి కేశవరావు జాదవ్. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తదుపరి జయంతి వేడుకలను నిర్వహించడం ముదావహం. 1952 నాన్ ముల్కీ గో బ్యాక్ ఉద్యమాన్ని నిర్వహించిన వారిలో ప్రముఖుడైన కేశవరావు 1956 ప్రత్యేక హైదరాబాద్ రాష్ట్ర ఉద్యమంలో పాల్గొనడమేకాకుండా, 1975 ఎమర్జెన్సీ సమయంలో 18 నెలలపాటు జైలు జీవితాన్ని అనుభవించాడు.1969 ఉద్యమంలో క్రియాశీలకంగా పనిచేశాడు.మెదక్ లో ఇందిరా గాంధీపైనా, కరీంనగర్ ఉప ఎన్నికలో కేసీఆర్‌పైనా పోటీ చేశారు.తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ పెట్టే సమయంలో కల్వకుంట్ల చంద్రశేఖరరావుకు సూచనలు,సలహాలు అందించిన ఈయన 2006లో తెలంగాణ జన ఐక్య కార్యాచరణ సమితి, 2008లో తెలంగాణ జన పరిషత్‌లో కీలకపాత్ర పోషించాడు. టు వర్డ్స్ మ్యాన్ కైండ్ (ఇంగ్లీషు), ముస్లింలు ఉండే ప్రాంతానికి మారి అక్కడ సామరస్యత ఏర్పడడానికి కృషి చేశారు. సిటీలో మత కల్లోలాల నివారణ కోసం 'హైదరాబాద్ ఏక్తా' అనే సంస్థ ఏర్పాటుకు కృషిచేశారు. ఆ సంస్థ ఆధ్వర్యంలో 'కమ్యూనల్ రాయిట్స్ ఇన్ హైదరాబాద్: వాట్సాపుల్ సే' అనే నివేదికను రూపొందించారు. మత కల్లోలాలకు రాజకీయ, ఆర్థిక ప్రయోజనాలే కారణమని, ప్రజల్లో విద్వేషాలు లేవని, వాళ్లు నిత్య జీవన సమరంలో సతమతమవుతున్నారని నివేదికలో తేల్చారు. ఈయన అనేక పదవులను అలంకరించాడు. పీయూసీఎల్ జాతీయ కార్యవర్గ సభ్యులుగా తెలంగాణ యునైటెడ్ ఫ్రంట్ కన్వీనర్ గా,పౌరహక్కుల సంఘం



యువ పోరాటం (హిందీ) పత్రికలను నడిపాడు. భాషా సమస్య (సురమౌళితోకలిసి), మార్క్సగాంధీ సోషలిజం (ఇంగ్లిష్),లోహియా ఇన్ పార్లమెంట్ పుస్తకాలను ఆయన వెలువరించాడు. నక్సల్స్ కు, ప్రభుత్వానికి మధ్య జరిగిన చర్చలలో కీలక భూమిక పోషించాడు. పాత నగరంలో మత కల్లోలాలు చెలరేగినపుడు తల్లడిల్లిపోయిన ఎందరో మేధావుల్లో జాదవ్ ఒకరు. ఆయన కేవలం భావోద్వేగాలకే పరిమితం కాకుండా పాత నగరంలోనే ఉండే ఆయన.. అధ్యక్షుడుగా తెలంగాణ జనపరిషత్ కన్వీనర్ సోషలిస్టు నాయకుడు లోహియా అనుచరుడిగా గుర్తింపుపొందినాడు. కేశవరావు జాదవ్ వృద్ధాప్య సమస్యలతో బాధపడుతూ ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ 2018, జూన్ 16న మరణించాడు.

(జనవరి 27 జాదవ్ కేశవరావు జయంతి)

(వ్యాస రచయిత రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ)

"ఒక తరం' 'ఒక జీవన పాఠం

డాక్టర్ వడ్డేపల్లి హనుమంతు
94400 20912

చేతిలో ఫోన్ లేదు జేబులో డబ్బు మోతాదు కాదు.. ఇంట్లో ఏసీలు, కూలర్లు లేవు. అయినా సరే ఆతరం ముఖాల్లో ఒక ప్రశాంతత ఉండేది. మనకంటే వందేళ్లు ఎక్కువ ఆనందంగా, వందేళ్లు ఎక్కువ ఆరోగ్యంగా వాళ్లు జీవించారు. ఇది కేవలం జ్ఞాపకాల దాగిన నాస్టాల్జియా కాదు. ఇది మనం ఒప్పుకోవాల్సిన ఒక నిజం. ప్రశ్న ఒక్కటే... అసలు వాళ్ల జీవితాన్ని అంత బలంగా నిలబెట్టిన రహస్యం ఏమిటి? ఈ తరం వెళ్లిపోతే మనకు ప్రేమను పంచే చేతులు ఉండవు. మన మాటలను మధ్యలో ఆపకుండా వినే చెవులు ఉండవు. మన చిన్న విజయాలను చూసి కన్నీరు పెట్టే కళ్ళు ఉండవు. మన కళ్ల ముందే ఒక శకం నిశ్శబ్దంగా ముగిసిపోతోంది. మనకు జన్మనిచ్చిన, జీవితం ఎలా జీవించాలో నేర్పిన ఒక గొప్ప తరం నెమ్మదిగా శాశ్వత వీడ్కోలు చెబుతోంది. వాళ్లతో పాటు వాళ్ల విలువలు, వాళ్ల ఆప్యాయతలు, వాళ్ల జీవనశైలి కూడా మసకబారిపోతోంది. మనము నిజంగా ఏం కోల్పోతున్నామో మనకు పూర్తిగా అర్థమవుతోందా? ఒక్కసారి వెనక్కి తిరిగి చూద్దాం.

ఆ తరం గొప్పతనం ఏమిటి?

అది అన్నం తినే ముందు పక్క వారి ఆకలిని గుర్తించిన తరం. ఇళ్లు చిన్నవే. కానీ మనుషుల మధ్య ప్రేమ విశాలమైనది.వాళ్లు ఎప్పుడూ "నేను" అనలేదు. "మనము" అని జీవించారు. ఉమ్మడి కుటుంబాల్లో కష్టాలు పంచుకున్నారు. సుఖాలు పంచుకున్నారు. కన్నీళ్లను దాచుకోలేదు. ఆనందాన్ని దాచుకోలేదు. ఆస్తుల కంటే ఆప్యాయతలకు విలువ ఇచ్చిన తరం అది. డబ్బు కన్నా బంధాలే జీవితమని నమ్మిన తరం. సమయాన్ని గౌరవించిన జీవితం. ఆ తరం సమయాన్ని జయించలేదు, సమయంతో కలిసి నడిచింది. పని సమయానికి పని. మనుషుల సమయానికి మనుషులు. ఎవరికి ఎంత సమయం ఇవ్వాలో వాళ్లకు సహజంగానే తెలుసు. ఇప్పుడు మన దగ్గర టైమ్ మేనేజ్మెంట్ యాప్స్ ఉన్నాయి. కానీ సమయానికి మనిషిగా ఉండే గుణం నెమ్మదిగా మాయమవుతోంది. విద్య, జ్ఞానం, జీవన బుద్ధి వాళ్లకు పెద్ద పెద్ద డిగ్రీలు ఉండకపోవచ్చు. కానీ జీవితం అనే పుస్తకాన్ని పూర్తిగా చదివిన తరం వాళ్లు. గడియారం లేకున్నా సూర్యుణ్ని చూసి సమయం చెప్పగలిగారు. క్యాలిక్యులేటర్ లేకున్నా నోటి లెక్కలతో జీవితం నడిపారు. ఇంటర్నెట్ లేకున్నా అపారమైన జ్ఞానాన్ని మనసులో భద్రపరచుకున్నారు.జీపీఎస్ లేకున్నా గమ్యాన్ని తప్పకుండా చేరగలిగారు. తెలివి అంటే మార్కులు కాదని వాళ్లు మనకు నేర్పారు. జ్ఞానం అంటే సమాచారం కాదు, అనుభవం అని చూపించారు. ప్రకృతితో ఉన్న బంధం వాళ్లు ప్రకృతిని వాడుకోలేదు, దోపిడీ చేయలేదు గౌరవించారు. చెట్టు అంటే నీడ.నది అంటే తల్లి.మట్టి అంటే దేవుడు. ఇప్పుడు ప్రకృతిని ఫోటోల్లో చూస్తున్నాం.అప్పుడు వాళ్లు ప్రకృతిలోనే జీవించారు. అందుకే వాళ్ల జీవితం సహజంగా ఉండేది ఆరోగ్యంగా ఉండేది. సంబంధాలు, సంభాషణలు చేతిలో మొబైల్ ఫోన్ లేదు. కానీ మనసు విప్పి మాట్లాడుకునే మనుషులు ఉన్నారు. పోస్ట్ కార్డు మీద రాసిన నాలుగు వాక్యాలు ఈరోజు గంటల కొద్దీ మాట్లాడే ఫోన్లకంటే ఎక్కువ ప్రేమను పంచేవి. ఎదురుగా కూర్చుని మాట్లాడేవారు. కళ్ళల్లోకి చూసి నవ్వేవారు. బాధను దాచుకోకుండా చెప్పేవారు. ఇప్పుడు మన దగ్గర ఫోన్లు ఉన్నాయి. మనుషుల మధ్య దూరం కానీ పెరిగింది. అదే వాళ్లకు మనం ఇవ్వగలిగిన అతిపెద్ద గౌరవం.

(రచయిత జాతీయ బీసీ సంక్షేమ సంఘం స్టేట్ సెక్రటరీ)

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula@gmail.com
9010223917

ADRESS
Editor,
Prathipaksham,
Telugu Daily
8-1-284/
OU/521/7/9,
OU Colony,
Shaikpet,
Hyderabad,
Telangana
500008

ప్రాంతీయం

సంక్షేమ పథకాలతో జీవన ప్రమాణాలు మెరుగు

- జిల్లా కలెక్టర్ హైమావతి

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట, జనవరి 26: జిల్లాలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్నాయని జిల్లా కలెక్టర్ కె. హైమవతి ఐఏఎస్ అన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా సమీకృత కలెక్టరేట్ ఆవరణంలో కలెక్టర్ హైమావతి జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ హైమావతి మాట్లాడుతూ .. స్వాతంత్ర్య సమరయోధులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు, జిల్లా ప్రజలకు ఆమె శుభాకాంక్షలు తెలియజేశారు. భారత రాజ్యాంగం అందించిన న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం విలువలే ప్రజాస్వామ్యానికి పునాది అని పేర్కొన్నారు. హక్కులతో పాటు కర్తవ్యాల పట్ల కూడా ప్రతి పౌరుడు బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం ప్రజాపాలనలో పారదర్శకత, సామాజిక న్యాయం, సమాన అవకాశాల లక్ష్యంగా అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ద్వారా కోట్లాది మంది లబ్ధి పొందగా, గ్యాస్ సిలిండర్లు రూ.500కే అందిస్తూ భారీగా సబ్సిడీ నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తున్నట్లు చెప్పారు. గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల లోపు వినియోగదారులకు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తూ లక్షలాది కుటుంబాలకు ఉపశమనం కలిగిందన్నారు. మహిళా సంఘాలకు భారీగా బ్యాంకు రుణాలు, వడ్డీ రహిత రుణాలు అందించడంతో పాటు చేయూత పింఛన్ల ద్వారా వృద్ధులు, వికలాంగులు, ఇతర వర్గాలకు నెలవారీ భరోసా కల్పిస్తున్నామని తెలిపారు. విద్య, వైద్యం, పట్టణాభివృద్ధి, రహదారులు, పార్కులు, నీటి సరఫరా వంటి రంగాల్లో జిల్లావ్యాప్తంగా అనేక అభివృద్ధి పనులు ప్రగతిలో ఉన్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. పరిశ్రమల స్థాపనతో వేలాది మందికి ఉపాధి లభించిందని, యువతకు క్రీడల ద్వారా ప్రోత్సాహం అందిస్తున్నామని తెలిపారు. మాదకద్రవ్యాల నివారణ, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసు యంత్రాంగం ప్రజలతో కలిసి పనిచేస్తోందన్నారు. జిల్లా అభివృద్ధికి సహకరిస్తున్న ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, పోలీసులు, వైద్యులు, పారిశుద్య కార్మికులు, మీడియా ప్రతినిధులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు అందరి సహకారం అవసరమని పిలుపునిస్తూ తన ప్రసంగాన్ని ముగించారు.

మెదక్ పట్టణానికి 6 ఫ్రీజర్లు అందజేత

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మ దేవేందర్ రెడ్డి

ప్రతిపక్షం ప్రతినిధి మెదక్ జనవరి 26:-

మెదక్ పట్టణ ప్రజల సౌకర్యార్థం కోసం మాజీమంత్రి , సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు గారి సహకారంతో ,బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఏం పద్మ దేవేందర్ రెడ్డి ,మాజీ ఎమ్మెల్సీ ఫరూక్ హుస్సేన్ లు 6 ఫ్రీజర్ లను అందజేశారు.ఇందులో ముస్లిం మైనార్టీలకు 2, క్రిస్టియన్ లకు 1, పట్టణంలోని ఇతర కులస్తులందరికీ 3 ఫ్రీజర్లను అందచేస్తున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా పద్మ దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ. గతంలో ఎమ్మెల్యే ఉన్నప్పుడు మెదక్ మున్సిపల్ కు ఒక వైకుంఠ రథం,రెండు ఫ్రీజర్లు అందజేశానని గుర్తు చేశారు. ఫ్రీజర్ లు చెడిపోవడంతో మరమ్మతుకు నోచుకోక మూలన పడ్డాయి అన్నారు. ఫలితంగా మెదక్ పట్టణంలో ఎవరైనా చనిపోతే ఫ్రీజర్ దొరకని పరిస్థితి నెలకొందనీ చెప్పారు.పట్టణంలో ఫ్రీజర్లు దొరికాక ప్రజల ఇబ్బందులను మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే, తన్నీరు హరీష్ రావు గారి దృష్టికి తీసుక వెళ్లినట్లు చెప్పారు. వెంటనే స్పందించిన ఆయన మెదక్ పట్టణానికి 6 ఫ్రీజర్లు మంజూరు చేశారని పేర్కొన్నారు. పట్టణ ప్రజలు ఎవరైనా సరే అవసరం ఉన్నవాళ్లు ఫ్రీజర్లు తీసుకువెళ్లి వినియోగించుకోవాలని కోరారు. మాజీ ఎమ్మెల్సీ ఫారుక్ హుస్సేన్ మాట్లాడుతూ.. ఈ పంపిణి ఎన్నికల ప్రయోజనం కోసం కాదు. ప్రజల ఇబ్బందులను గుర్తించి పంపిణి చేస్తున్నట్లు చెప్పారు. భవిష్యత్తులో మండలాల వారిగా కూడా పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీష్ రావు గారికి మాజీ ఎమ్మెల్సీ వారు హుస్సేన్ గారికి పద్మ దేవేందర్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ ఆరేళ్ల. మల్లికార్జున్ గౌడ్,మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి,పట్టణ పార్టీ కన్వీనర్ మామిళ్ళ ఆంజనేయులు,మాజీ కౌన్సిలర్లు వంజరి. జయరాజ్ , సోహెల్,ఆర్కె శ్రీనివాస్,జ్యోతి కృష్ణ,నాయకులు సురేందర్ గౌడ్,జుబెర్ అహ్మద్, ఫాజిల్, షాకీర్,సాదిక్,సునీల్, సంతోష్,ఇమాదాద్, ఇస్మాయిల్, శ్రీనివాస్,ఓమర్ ఫరూక్,మధు, అమీర్,కిరణ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పదిలో సిద్దిపేట ఫస్ట్‌గా నిలవాలి

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట, జనవరి 26: పదవ తరగతి విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు పునాది అని, ఈ ఏడాది పదిలో సిద్ది పేట జిల్లాను రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలపాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని సిద్దిపేట ప్రభుత్వ ఉన్నత బాలుర పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు అల్పాహారం, డిజిటల్ కంటెంట్ బుక్స్‌ను ఆయన పంపిణీ చేశారు.ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ... పదవ తరగతి విద్యార్థి జీవితంలో కీలకమైన దశ అని పేర్కొన్నారు. గత ఐదు సంవత్సరాలుగా సిద్దిపేట జిల్లాలో పదవ తరగతి ఫలితాల్లో అగ్రస్థానం సాధించేందుకు తన వంతుగా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందుకోసం తన స్వంత ఖర్చులతో రూ.5 లక్షల విలువైన స్నాక్స్‌తో పాటు మరో రూ.5 లక్షలతో డిజిటల్ కంటెంట్ బుక్స్‌ను విద్యార్థులకు అందిస్తున్నట్లు చెప్పారు.రంగం ఏదైనా సిద్దిపేట నుంచి మొదటి స్థానంలో ఉండాలనే తపన తనకుందని, గతంలో బాసర ట్రిపుల్ ఐటీలో సిద్దిపేటకు చెందిన 169 మంది విద్యార్థులకు సీట్లు వచ్చాయని గుర్తు చేశారు. ఈసారి కూడా మరింత మెరుగైన ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.ఈ ఏడాది సిద్దిపేట నియోజకవర్గం 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని ఉపాధ్యాయులను కోరారు.

వెంకట్రావుపేట్ లో ఘనతంత్ర వేడుకలు

- పాఠశాలల అభివృద్ధి కోసం సహకారం
- వెంకట్రావుపేట సర్పంచ్ బండారు కవిత స్వామి గౌడ్

ప్రతిపక్షం, తొగుట,జనవరి 26 :

తొగుట మండల కేంద్రంలోని వెంకట్రావుపేట్ గ్రామంలో ఘనతంత్ర వేడుకలను గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద తివర్ణ పథకాన్ని ఘనంగా ఆవిష్కరించారు...ఈ సందర్భంగా సర్పంచ్ కవిత స్వామి గౌడ్ మాట్లాడుతూ గ్రామభివృద్ధితో పాటు పాఠశాలల అభివృద్ధి పై ప్రత్యేక దృష్టి సారిస్తాము అని గ్రామంలోని ప్రాథమిక, జిల్లాపరిషత్ పాఠశాలల్లో జరిగిన కార్యక్రమం లో పాల్గొని మాట్లాడారు. పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన డెస్క్ లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. డెస్క్ ల ఏర్పాటు కోసం ప్రతి ఒక్కరు సహకరించాలని,ముందుకు వొచ్చిన పంచాయతీ కార్యదర్శి రవీందర్ ను ఆమె అభినందించారు. పాఠశాల నుండి పలు పోటీలలో జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనపరుస్తున్న విద్యార్థులకు బహుమతులు అందించారు. ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమం లో హెచ్ఎంలు నహిమా కౌసర్, వెంకటయ్యలు, సీనియర్ నాయకులు పిట్ల వెంకటయ్య, శివయ్య, బాలేష్ ప్రముఖ కవి బండకాడి అంజయ్య గౌడ్, ఉప సర్పంచ్ లచోళ్ల లింగం, వార్డు సభ్యులు పాల్గొన్నారు..

జాతీయ జెండాను ఆవిష్కరించిన పోలీస్ కమిషనర్

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట, జనవరి 26:

77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ఉదయం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ ఎస్. రష్మీ పెరుమాళ్ జాతీయ జెండాను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో కమిషనర్ మాట్లాడుతూ, దేశ సార్వభౌమాధికారాన్ని, రాజ్యాంగ విలువలను పరిరక్షించడంలో ప్రతి పోలీస్ అధికారి అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యంగా శాంతిభద్రతల పరిరక్షణలో సాంకేతికతను సమర్థవంతంగా వినియోగిస్తూ ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు, బాధ్యతలను స్మరించుకుంటూ విధి నిర్వహణలో నిష్పక్షపాతంగా వ్యవహరించాలని అధికారులకు సూచించారు.జెండా ఆవిష్కరణ అనంతరం, పోలీస్ కమిషనరేట్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన ప్రధాన గణతంత్ర దినోత్సవ వేడుకలకు కమిషనర్ హాజరై, పోలీస్ దళాల నుండి గౌరవ వందనాన్ని స్వీకరించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ హైమవతి, ఐఏఎస్ పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన పలువురు అధికారులు, సిబ్బందికి జిల్లా కలెక్టర్ హైమావతి, కమిషనర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ వేడుకల్లో అదనపు డీసీపీ (ఏఆర్) సుభాష్ చంద్రబోస్, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు మరియు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

క్యాన్సర్ సేవలు మరింత మెరుగు పడాలి

- సిద్దిపేట ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రి ని ఆకస్మికంగా సందర్శించిన హరీష్ రావు

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట జనవరి 26: సిద్దిపేట ప్రభుత్వ వైద్య కళాశాల ను మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కాన్సర్ ఆసుపత్రి ని ఐసియు లో అందుతున్న సేవలను అడిగి తెల్సుకున్నారు.ఆసుపత్రి లోనేను అన్నం పెట్టిస్తున్న రోజు పెడుతున్నారా, సౌలత్ లు మంచిగున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. మందులు బయటకు రాయొద్దని, మందులు ఆసుపత్రి లో అందుబాటులో ఉంచాలన్నారు. ఐసియు లో గత ప్రభుత్వం లోనే ఒక్కో మిషన్ కి 12 లక్షలు విలువైన పరికరాలు ఏర్పాటు చేశామని అవి ఉపయోగం లో ఉన్నాయా లెవా అని, ఒక్కో పెషేంట్ కు రోజుకి 50వేలు ఖర్చు లేకుండా ఏర్పాటు చేశామని గుర్తు చేసారు. క్యాన్సర్ ఆసుపత్రి లో మెరుగైన సేవలు అందించాలని, అందులో పని చేసే వారి మూడు నెలలు గా జీతాలు రావడం లేదన్నారు. జిల్లా వైద్య అధికారితో మాట్లాడి వేంటనే వారి జీతాలు చెల్లించాలని చెప్పారు. ఆసుపత్రి లో రోగులతో ఆత్మీయంగా మాట్లాడారు. వైద్య సేవలపై అరా తీశారు.

ప్రతి బాధితునికి ఎస్సీ ఎస్టీ కమిషన్ అండగా ఉంటుంది

ప్రతిపక్షం,మిడిదొడ్డి, జనవరి 26

రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కివెంకటయ్య ప్రతి ఎస్సీ ఎస్టీ అత్యాచార బాధితుడికి కమిషన్ అండగా వుంటుందని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కివెంకటయ్య హామి ఇచ్చారు.డిబిఎఫ్, ఎన్ ఎపియం అధ్వర్యంలో అదివారం నాడు జరిగిన ఎస్సీ ఎస్టీ అత్యాచారాల చట్టం అమలు పై నిర్వహించిన ప్రజా బహిరంగ విచారణ నివేదిక ను సోమవారం నాడు డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ బృందం చైర్మన్ కు భూంపల్లి అక్బర్ పేట లో అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ బక్కివెంకటయ్య మాట్లాడుతూ ప్రజా విచారణ లో తమ గోడు వెళ్ళబోసిన బాధితులకు న్యాయం జరిగే వరకు కమిషన్ కస్టోడియన్ గా పని చెస్తుందన్నారు.ఎస్సీ ఎస్టిలకు రక్షణ గా వుంటుందని చెప్పారు.ప్రజా బహిరంగ విచారణకు అనివార్య కారణాల వల్ల హజరు కాలేకపాయానని డిబిఎఫ్ రూపొందించిన నివేదిక ను పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

బీఆర్ఎస్‌పై బురద చల్లడం సరైనది కాదు

- కవిత విమర్శలను తిప్పి కొట్టిన బీఆర్ఎస్ మహిళా నేతలు తుల ఉమ, సుశీలా రెడ్డి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, జనవరి 26: కవిత విమర్శలకు మాజీ జడ్పీ చైర్మన్ తుల ఉమ, బీఆఆర్ఎస్‌పార్టీ సీనియర్ నేత ముక్తవరం సుశీలా రెడ్డి ఘాటుగా స్పందించారు. సోమవారం తెలంగాణ భవన్లో జరిగిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ కవిత నిరాధారమైన ఆరోపణలు చేస్తూ బీఆర్ఎస్ పార్టీ మీద నమ్మకాన్ని తగ్గించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. "బీఆర్ఎస్ పార్టీ పేదల కోసం కష్టపడి పని చేస్తున్న పార్టీ అని అన్నారు. బీఆర్ఎస్ పార్టీపై బురద చల్లడం సరైనది కాదు. తెలంగాణ ప్రజలు కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ ప్రజలు గుర్తు పెట్టుకున్నారన్నారు. బీఆర్ఎస్ పార్టీ కోసం కృషి చేస్తూ, పేదల కోసం యుద్ధం చేస్తున్నట్టు స్పష్టం చేశారు.

రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిది

- సిద్ధిపేట కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో గణతంత్ర దినోత్సవం వేడుకలు
- జాతీయ జెండా ఆవిష్కరించిన సిద్ధిపేట కాంగ్రెస్ పార్టీ పట్టణం అధ్యక్షుడు అత్తు ఇమామ్

ప్రతిపక్షం బ్యూరో సిద్ధిపేట జనవరి 26:

డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది అని సిద్ధిపేట కాంగ్రెస్ పార్టీ పట్టణం అధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు. సిద్ధిపేట లోని కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో సిద్ధిపేట కాంగ్రెసు పార్టీ నియోజవర్గ ఇన్చార్జ్ పూజల హరికృష్ణ సూచన మేరకు 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా సిద్ధిపేట కాంగ్రెస్ పార్టీ పట్టణం అధ్యక్షుడు అత్తు ఇమామ్ జాతీయ జెండాను ఆవిష్కరించి జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా సిద్ధిపేట కాంగ్రెస్ పార్టీ పట్టణం అధ్యక్షుడు అత్తు ఇమామ్ మాట్లాడుతూ అధికారం ఉంది అని మహోన్నతుడు డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగాన్ని మోడీ ప్రభుత్వం ఖూనీ చేస్తున్నది అని అన్నారు. రాజ్యాంగాన్ని కాపాడాలని ఏఐసీసీ నాయకుడు రాహుల్ గాంధీ దేశంలో పాదయాత్ర చేస్తూ పోరాడుతున్నారు అని అన్నారు. దేశం కోసం ధర్మం కోసం అంటూ దేశ ప్రజలను రెచ్చగొడుతూ రాజకీయంగా లబ్ధి పొందుతున్నారు అని అన్నారు. రాబోయే ఎన్నికల్లో మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ప్రతి నాయకుడు కార్యక్రమం పనిచేయాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో బొమ్మల యాదగిరి. ముద్దం లక్ష్మి. పూజల గోపికృష్ణ దాస్ అంజయ్య బాలయ్య కలీముద్దీన్ రాజ్బదూర్ రెడ్డి చాంద్ మియా.సతీష్ గ్యాదారి మధు అర్షద్ విజయ్ డానియల్ వహబ్ జానర్దన్. రషద్. బాబా అంజి రెడ్డి. సనా స్రవంతి రజనీ సంతోషి కరీం. కాజపాష. అతీఫ్ అశోక్. అంజన. మహిపాల్ రెడ్డి పద్మ. తదితరులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

'ప్రతిపక్షం' ప్రజల పక్షం

- జర్నలిస్టు సంఘం జిల్లా అధ్యక్షుడు కె. రంగాచారి
- ప్రతిపక్షం దిన పత్రిక క్యాలండర్ ఆవిష్కరణ

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట జనవరి 26:

సిద్దిపేట ప్రెస్ క్లబ్‌లో ప్రతిపక్షం దినపత్రిక నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కల్వకుంట్ల రంగాచారి ముఖ్య అతిథిగా హాజరై క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజాస్వామ్యంలో స్వేచ్ఛాయుతమైన మీడియా పాత్ర అత్యంత కీలకమని, ప్రజల సమస్యలను నిష్పక్షపాతంగా వెలుగులోకి తీసుకురావడంలో ప్రతిపక్షం దినపత్రిక ముందుండటం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రతిపక్షం దినపత్రిక ప్రజా సమస్యలు, సామాజిక అంశాలు, అవినీతి వంటి విషయాలను ధైర్యంగా ప్రచురిస్తూ ప్రజల విశ్వాసాన్ని సంపాదించుకుందని అన్నారు. భవిష్యత్తులోనూ ఇదే తత్వంతో పనిచేస్తూ పాఠకులకు నాణ్యమైన వార్తలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మీడియా అకాడమీ మాజీ సభ్యులు కే అంజయ్య, ప్రతిపక్షం ప్రతిపక్షం నెట్ వర్క్ ఇన్చార్జి చిటుకుల మైసారెడ్డి, జర్నలిస్టు సంఘం నాయకులు, ప్రెస్ క్లబ్ సభ్యులు ఫయాజ్, నాయిని సంజీవరెడ్డి, స్టేట్ బ్యూరో నక్కల రాంరెడ్డి, జిల్లా ప్రతినిధి సంతోష్, జర్నలిస్టులు సాజిద్, యూసుఫ్, జానీ, రాజబాబు, యాదగిరి గౌడ్, మల్లారెడ్డి, పెద్ద నరేష్, కాసర్ల మురళి, అన్వర్, శ్రీనాథ్, శ్రీకాంత్, వాజీద్, మహేష్, మురళి, రహమాన్, అమీర్, క్రిష్ణ, ఎల్లోహర్, చిన్న నరేష్, బాబురావు, ప్రవీణ్, రజినీకాంత్, దర్శన్, వేణు, జహీర్, తదితరులు పాల్గొన్నారు.

నిత్య శుద్ధిపేటకు విద్యార్థుల భాగస్వామ్యం అవసరం

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట, జనవరి 26: సిద్దిపేట పట్టణం నిత్యం శుద్ధిపేటగా పేరుగాంచాలంటే విద్యార్థుల భాగస్వామ్యం ఎంతో అవసరమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. సిద్దిపేట పట్టణంలోని క్రాంతి స్కూల్‌లో నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ... బాబా సాహెబ్ డా.బి.ఆర్. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం అమలులోకి వచ్చిన రోజే గణతంత్ర దినోత్సవమని గుర్తు చేశారు. రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన హక్కులు కల్పించిందన్నారు. చదువు అనేది కేవలం మార్కులు, ర్యాంకుల కోసమే కాకుండా సామాజిక స్పృహ, శారీరక దృఢత్వం, ఆరోగ్యం వంటి అంశాలపైనా దృష్టి సారించాలని సూచించారు.విద్యార్థులు అందరూ డాక్టర్లు, ఇంజినీర్లు కావాలనే ఆలోచనకే పరిమితం కాకుండా అన్ని రంగాల్లో ఉన్న అవకాశాలను గుర్తించి, తమ ఆసక్తికి అనుగుణంగా లక్ష్యాలు ఎంచుకోవాలని చెప్పారు. కలలు కని, వాటిని నిజం చేసుకునే దిశగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.చదువుతో పాటు ఆరోగ్యం, సామాజిక బాధ్యతపై అవగాహన కల్పిస్తున్న క్రాంతి స్కూల్ అభినందనీయమని పేర్కొన్నారు. సిద్దిపేట పరిశుభ్రతలో రాష్ట్రానికి ఆదర్శంగా నిలిచిందని, భవిష్యత్తులో కూడా నిత్యం శుద్ధిపేటగా వెలుగొందాలని ఆకాంక్షించారు. ఇందుకోసం విద్యార్థులు తమ మిత్రులకు, తల్లిదండ్రులకు పరిశుభ్రత ప్రాముఖ్యతను తెలియజేయాలని కోరారు.సిద్దిపేటను ఆరోగ్యం, ఆకుపచ్చదనం, అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్తున్నామని హరీష్ రావు తెలిపారు.

ప్రస్తుతం టీ20ల్లో టీమ్ ఇండియా ఫామ్‌ను చూసి ఆడటానికి ఏ జట్టైనా భయపడుతుంది. న్యూజిలాండ్ సిరీస్‌లో ఇండియన్ ప్లేయర్స్ విధ్వంసకర బ్యాటింగ్ తానెప్పుడూ చూడలేదు. పాక్ టీ20 వరల్డ్‌కప్‌కు రాకపోవడమే మంచిది. లేదంటే ఉతికి ఆరేస్తారు. కొలంబోలో సిక్స్ కొడితే మద్రాస్‌లో పడుతుంది.

- మాజీ క్రికెటర్ క్రిష్ణమాచారి శ్రీకాంత్

ఘనంగా 77వ గణతంత్ర దినోత్సవం

ప్రతిపక్షం మిడిదొడ్డి జనవరి 26 :

77వ గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని మిడిదొడ్డి మండల కేంద్రంలో సోమవారం ఘనంగా నిర్వహించారు, ఈ సందర్భంగా, తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ శ్రీనివాస్ రెడ్డిమండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఓ గణేష్ రెడ్డి పోలీస్ స్టేషన్ లో ఏఎస్ఐ , మండల విద్య వనరుల కేంద్రంలో మండల విద్యాధికారి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ముందు డాక్టర్ సమీనా వెలుగు కార్యాలయం వద్ద లక్ష్మీ నరసమ్మ గ్రామపంచాయతీ కార్యాలయం ముందు సర్పంచ మహేశ్వరి దేవరాజువివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల లో ప్రధానోపాధ్యాయులు,జాతీయ జెండాను ఎగురవేశారు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు ,వివిధ కుల సంఘాల నాయకులు, ఆటో డ్రైవర్ల యూనియన్ నాయకులు, మూడు రంగుల జెండాలు ఎగురవేసి జెండా వందనముగీతాన్ని ఆలపించారు. అనంతరం పలువురు అధికారులు, నాయకులు,మాట్లాడుతూ దేశంకోసం పోరాడిన సమరయోధులను గుర్తుచేశారు. ఇటీవల స్థానిక ఎన్నికల్లో గెలుపొందిన సర్పంచ్ లు ఆయా గ్రామ పంచాయతీ లల్లో జెండాను ఆవిష్కరించి జెండా వందనం స్వీకరించారు పాఠశాల లో విద్యార్థులకు 77వ గణతంత్ర దినోత్సవ సందర్భంగా ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థుల

ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు

- జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన కలెక్టర్

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, జనవరి 26 :

భారత గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో రిపబ్లిక్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా పాలనాధికారి ఇలా త్రిపాఠి ముఖ్య అతిథిగా విచ్చేసి త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పోలీసుల నుండి గౌరవ వందనం స్వీకరించారు. వివిధ శాఖల ద్వారా జిల్లాలో అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, సాధించిన ప్రగతి గురించి తన ప్రసంగం ద్వారా తెలియజేశారు. అర్బన్ శాసన సభ్యులు ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా, పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, అదనపు డీసీపీ బస్వారెడ్డి, ఆయా శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా అధికారులు, పుర ప్రముఖులకు కలెక్టర్ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు బహూకరించారు. వ్యవసాయ, ఉద్యానవన, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, అటవీ, డెయిరీ, పశువైద్య, విద్య, వైద్యం, మహిళా శిశు సంక్షేమం, నీటి పారుదల, మిషన్ భగీరథ, ఫిషరీస్ తదితర శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్ ను తిలకించారు.

ఉత్సాహభరితంగా చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు

రిపబ్లిక్ డే వేడుక సందర్భంగా చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను అలరింపజేశాయి. ఎదనిండా దేశభక్తి భావాన్ని నింపుకుని తమ ప్రదర్శనలతో గణతంత్ర దినోత్సవ వేడుకలకు వన్నెలద్దారు. విస్డమ్ హైస్కూల్ విద్యార్థులు తల్లీ భారతి వందనం గేయంపై, వసుధ హైస్కూల్ చిన్నారులు శంభాజీ మహారాజ్ శౌర్య పరాక్రమం గురించి, విజయ్ హైస్కూల్ పాఠశాలకు చెందిన బాలబాలికలు రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాల్సిన ప్రాముఖ్యత గురించి చూడచక్కని నృత్య రీతులను అలవోకగా ప్రదర్శిస్తూ ఔరా అనిపించారు. డిచ్ పల్లి మానవతా సదన్ విద్యార్థిని విద్యార్థులు ఒకే శృతిలో డప్పు వాయిస్తూ తమ కళా నైపుణ్యాన్ని చాటారు. బాలబాలికలు అందరూ ఏకరూప దుస్తులు ధరించి తమ అభినయంతో అలరింపజేశారు. జాతీయ సమైక్యతా భావం పెంపొందేలా దేశభక్తి గేయాలు ఆలపిస్తూ నృత్య ప్రదర్శనలతో అందరి దృష్టిని ఆకర్షించారు. ఈ సందర్భంగా చిన్నారులను కలెక్టర్, సీ.పీ తో పాటు ఇతర అతిథులు, జిల్లా ఉన్నతాధికారులు వారి వద్దకు వెళ్లి మెమోంటోలు, ప్రశంసా పత్రాలను బహూకరించి ప్రత్యేకంగా అభినందించారు. స్వయం సహాయక సంఘాలకు స్త్రీనిధి రుణాల చెక్కులు పంపిణీ చేశారు. ఈ వేడుకల్లో డీఆర్డీఓ సాయాగౌడ్, డీపీఓ శ్రీనివాస్ రావు, డీఎస్ఓ అరవింద్ రెడ్డి, అన్ని శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది, స్వాతంత్ర్య సమరయోధులు, ప్రజలు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు. అంతకుముందు క్యాంపు ఆఫీసులో, జిల్లా పరిషత్ కార్యాలయంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి మువ్వన్నెల జెండా ఆవిష్కరించారు.

సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో...

సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. కలెక్టరేట్ ఏ.ఓ ప్రశాంత్, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు

- విద్యార్థి విజేతలకు బహుమతులు ప్రధానం

ప్రతిపక్షం, చేగుంట, జనవరి 26: గణతంత్ర దినోత్సవ సందర్భంగా చేగుంట, నార్సింగి, మాసాయిపేట, తూప్రాన్, మనోహరాబాద్ మం డలాల్లో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు . చేగుంటలో ప్రభుత్వ ప్రైవేటు సంస్థల వద్ద జాతీయ జెండాలను ఎగురవేశారు. జిల్లా పరిషత్ పాఠశాలలతో పాటు ప్రాథమికోన్నత ఉన్నత పాఠశాలలో ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలైన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చిన్నారెడ్డి తాసిల్దార్ శివప్రసాద్ ఎస్సై చైతన్య కుమార్ రెడ్డి ఎంఈఓ నీరజ మోడల్ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రకళ కస్తూరిబా గాంధీ పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీవాణి వ్యవసాయ మార్కెట్ కమిటీ వద్ద చైర్మన్ వెంగళరావు జాతీయ జెండా ఎగురవేశారు. చేగుంట గ్రామపంచాయతీ వద్ద సర్పంచ్ సంద్రు స్రవంతి పొలంపల్లి లో సర్పంచ్ కొండి రాజ్యలక్ష్మి రాంపూర్ లో సర్పంచ్ నాగమణి కరీంనగర్ లో కర్రే శంకర్ నార్సింగి మండల కేంద్రంలో సర్పంచ్ ఆకుల సుజాత పాల్గొని జెండాలు ఎగురవేశారు. అలాగే మండలంలోని వివిధ గ్రామాల్లో వివిధ మండలాల్లో జాతీయ జెండాలు ఎగరవేశారు.

మెదక్ జిల్లాలో ఘనంగా 77 వ గణతంత్ర వేడుకలు

- జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన కలెక్టర్
- వివిధ ప్రభుత్వ పథకాల. శకటాలు ప్రదర్శన

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్ జనవరి 26 : భారత గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో 77 రిపబ్లిక్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా పాలనాధికారి కలెక్టరేట్ రాహుల్ రాజ్ ముఖ్య అతిథిగా విచ్చేసి త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పోలీసుల నుండి గౌరవ వందనం స్వీకరించారు. వివిధ శాఖల ద్వారా జిల్లాలో అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, సాధించిన ప్రగతి గురించి తన ప్రసంగం ద్వారా తెలియజేశారు. మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు, ఎస్పీ డి. వి శ్రీనివాసరావు, అదనపు కలెక్టర్ నగేష్, అదనపు ఎస్పీ మహేందర్, ఆయా శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.అంతకుముందు కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో, జిల్లా పాలనాధికారి కలెక్టర్ మువ్వన్నెల జెండా ఆవిష్కరించారు.

మన రాజ్యాంగం ఉన్నతమైనది: అదనపు కలెక్టర్ నగేష్

77 వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ మెదక్ కార్యాలయంలో అడిషనల్ కలెక్టర్ నగేష్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా పాఠకులను, విద్యార్థిని, విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యంత గొప్ప రాజ్యాంగం మన భారత రాజ్యాంగం అని ,ప్రతి ఒక్కరు రాజ్యాంగ విలువలకు కట్టుబడి, స్వేచ్ఛ, సమానత్వం, సోదర భావంతో జీవిస్తూ, ఉత్తమ పౌరులుగా ఎదగాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో డి. ర్ .ఓ భుజంగ రావు, జిల్లా అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో..

77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా క్యాంపు కార్యాలయంలో జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు ఐపీఎస్ గారు పోలీసుల గౌరవ వందనం స్వీకరించి జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం అధికారులు, సిబ్బందితో కలిసి జాతీయ గీతాలాపన చేశారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ మహేందర్, డియస్పి లు ప్రసన్న కుమార్, నరేందర్ గౌడ్, సుభాష్ చంద్ర బోస్, రంగా నాయక్, సీఐలు, సందీప్ రెడ్డి, కృష్ణ మూర్తి, మహేష్, జర్జ్, శైలందర్, రాజశేఖర్ రెడ్డి ఎసై లు సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో:

జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ జాతీయ జెండాను ఆవిష్కరించారు.

బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో :

మెదక్ జిల్లా కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయ ప్రాంగణంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా మాజీ డిప్యూటీ స్పీకర్ బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు యం. పద్మ దేవేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఫారుక్ హుస్సేన్,మెదక్ పట్టణ నాయకులతో కలిసి గాంధీ, బి.ఆర్.అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి అనంతరం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

మెదక్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో

జిల్లా కేంద్రంలోని మెదక్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు నరేష్ గౌడ్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో. ప్రెస్ క్లబ్ బాధ్యులు. ఎలక్ట్రిక్ మీడియా జిల్లా అధ్యక్షులు నాగరాజ్ రియాజ్ సంగమేశ్వర్ కామాటి కృష్ణ ఇంతియాజ్ ఫణి రాజు కార్తీక్ శ్రీహరి గౌడ్ రాహుల్ కృష్ణమూర్తి అల్లాడి శేఖర్ వసీం నాగరాజు శర్మ తదితరులు పాల్గొన్నారు.

రామాయంపేట కాంగ్రెస్‌కి బిగ్ షాక్

- కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జొన్నల బాలకృష్ణ (బాలు) బిఆర్ఎస్ పార్టీలో చేరిక.
- కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన మాజీ మంత్రి హరీష్.
- రామాయంపేటలో మరోసారి గులాబీ జెండా ఎగరాలి.
- పార్టీ నాయకత్వం కృషి చేయాలని పిలుపునిచ్చిన మాజీ మంత్రి హరీష్ రావు.

ప్రతిపక్షం,మెదక్ టౌన్, జనవరి 26

మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు గారి సమక్షంలో మెదక్ బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు యం.పద్మ దేవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో రామాయంపేట మున్సిపాలిటీ చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు జొన్నల బాలు గత కొంత కాలంగా కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్నరు. రామాయంపేట అభివృధి కోసం జొన్నల బాలు కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి సిద్దిపేటలోని క్యాంపు కార్యాలయంలో మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు సమక్షంలో పార్టీలో చేరారు.ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ...రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలో బీఆర్ఎస్ పార్టీ జెండా ఎగర వేస్తుంది అని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ గెలుపు కోసం ప్రతి కార్యకర్త కష్టపడి పని చేయాలని దిశా నిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు కంఠరెడ్డి. తిరుపతిరెడ్డి,మాజీ మున్సిపల్ పల్లె జితేందర్ గౌడ్,మాజీ పిఏసిఎస్ చైర్మన్ బాదే. చంద్రం, నాయకులు పుట్టి.యాదగిరి, కన్నాపురం.కృష్ణ గౌడ్, ఉమా మహేశ్వర్,అస్మద్దీన్,బాసం శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

గజ్వేల్ కాంగ్రెస్‌లో ఒకే బైక్‌పై వైరి వర్గాలు

ప్రతిపక్షం, గజ్వేల్, జనవరి 26:

పచ్చ గడ్డి వేస్తే భగ్గుమనే విధంగా ఉన్న గజ్వేల్ కాంగ్రెస్ గ్రూపు తగాదాలు నేడు ఒకే గూటి పైకి వచ్చినట్లుగా వారు ఇరువురి బైక్ సవారి అందరిని ఆశ్చర్యపరిచింది. వివరాలలోకి వెళితే గజ్వేల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ రెండు గ్రూపులుగా విడిపోయి ఎవరికి వారే పార్టీ కార్యాలయాలు ప్రారంభించి నామినేటెడ్ పదవుల్లో ఇరు వర్గాల నాయకులు తమ తమ పలుకుబడితో పదవులు తీసుకుని వారి పట్టును సడలిపోకుండా దూరం దూరంగా ఉంటూ వచ్చారు. కానీ త్వరలో జరగబోయే మున్సిపల్ ఎన్నికల్లో గజ్వేల్ చైర్మన్ కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకునేందుకు అధిష్టాన వర్గం ఆదేశాలతో ఒకతాటిపైకి వచ్చినట్లు తెలుస్తోంది. సిద్దిపేట డిసిసి అధ్యక్షురాలుగా అంక్షరెడ్డి ఎన్నికైన తర్వాత కాంగ్రెస్ పార్టీ, గజ్వేల్ లో గ్రూపులుగా ఉన్న కాంగ్రెస్ కాగా 26 రిపబ్లిక్ డే రోజున ద్విచక్ర వాహనంపై గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, టిపిసిసి అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్ రావు లు పలు వార్డులు తిరిగి, ప్రజలతో మమేకమవుతూ పార్టీని బలోపేతం చేయడం కోసం గజ్వేల్ ప్రజ్ఞాపూర్, మున్సిపల్ పీఠం పై కన్ను వేసినట్లుగా ఉందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. తిరువర్గాలు ఒకే చోటికి చేరడంతో కాంగ్రెస్ మరింత బలం అవుతుందని, పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

నిజామాబాద్ పోలీస్ శాఖలో గణతంత్ర వేడుకలు

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, జనవరి 26 :

నిజామాబాద్ పోలీస్ శాఖలో 77వ గణతంత్ర దినోత్సవాన్ని పోలీసు అధికారులు, సిబ్బంది ఘనంగా నిర్వహించారు. పోలీస్ కార్యాలయంలో నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య, జాతీయ జెండాను ఎగురవేశారు. ఎ.ఆర్ హెడ్ క్వార్టర్స్ లో నిజామాబాద్ అదనపు డీ.సీ.పీ (అడ్మిన్) జి బస్వారెడ్డి జాతీయ జెండాను ఎగురవేశారు. డి.ఐ.జి జోన్ 2 క్యాంప్ కార్యాలయంలో నిజామాబాద్ ఎ.సి.పి రాజా వెంకట్ రెడ్డి జాతీయ జెండాను ఎగురవేశారు. మీఅనంతరం స్కూల్ విద్యార్థులకు పోలీస్ సిబ్బందికి పోలీస్ కమిషనర్ నోట్బుక్స్, పెన్నులు, స్వీట్స్ ప్రధానం చేయడం జరిగింది.

ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు

ప్రతిపక్షం ప్రతినిధి, కామారెడ్డి, జనవరి 26:

77 వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అదనపు కలెక్టర్ ముఖ్య అతిథిగా విచ్చేసి త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. వైద్య ఆరోగ్య శాఖ, అగ్నిమాపక శాఖల శకటాలను తిలకించిన అనంతరం వివిధ శాఖల ద్వారా జిల్లాలో అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, సాధించిన ప్రగతి గురించి తన ప్రసంగం ద్వారా తెలియజేశారు. వివిధ పాఠశాలల విద్యార్థిని విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించి , వివిధ శాఖల లో ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు ప్రశంస పత్రాలను అందజేశారు. అనంతరం శాఖల ప్రగతిపై ఏర్పాటుచేసిన స్టాళ్లను సందర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర, అదనపు కలెక్టర్ మధుమోహన్, ఆర్డీవోలు పార్థ నరసింహా రెడ్డి, వీణ, ఆయా శాఖల జిల్లా అధికారులు , తదితరులు పాల్గొన్నారు.అంతకు ముందు కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో, సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో అదనపు కలెక్టర్ త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు.

రాజ్యాంగ విలువలను కాపాడాలి

- ప్రొఫెసర్ హుస్సేన్

ప్రతిపక్షం ప్రతినిధి మెదక్ జనవరి 26 :

77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వేడుకలు ఘనంగా నిర్వహించారని కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ హుస్సేన్ తెలిపారు. జాతీయ పతాక ఆవిష్కరణ తరువాత సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం అందించిన ప్రాథమిక హక్కుల తో పాటు బాధ్యతలను కూడా సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. కళాశాల ఎన్సిసి విద్యార్థుల యొక్క గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు విద్యార్థులు ఎన్. సి. సి. క్యాడేట్స్ పాల్గొన్నారు

నేడు మంబోజిపల్లి, మాచవరంల్లో

విద్యుత్తు సరఫరాలో అంతరాయం

- మెదక్ విద్యుత్తు శాఖ ఏడీఈ మోహన్ బాబు

ప్రతిపక్షం ప్రతినిధి మెదక్ జనవరి 26 :

మెదక్ మండలంలోని ఎన్ఎస్ఎఫ్ విద్యుత్తు సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు, స్తంభాలు వేయడం, ఇతర కరెంట్ పనులు చేయనున్న నేపథ్యంలో ఈ సబ్‌స్టేషన్ పరిధిలోని మంబోజిపల్లి, మాచవరం గ్రామాల్లో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని మెదక్ ట్రాన్స్‌కో ఏడీఈ మోహన్ బాబు, మెదక్ రూరల్ ఏఈ రాజ్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ రెండు గ్రామాలకు కరెంట్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఏడీఈ, ఏఈలు పేర్కొన్నారు. ఈ విషయంలో ఆయా గ్రామాల ప్రజలు తమకు సహకరించాలని ఏడీఈ మోహన్ బాబు, ఏఈ రాజ్ కుమార్ కోరారు.



పాలనలో టెక్నాలజీని వినియోగించి ఉద్యోగులపై పని భారం తగ్గించాలి. 2026ను టెక్నాలజీ డ్రివెన్ డిసిషన్ మేకింగ్ ఇయర్‌గా మార్చాలి. ప్రభుత్వ సేవల్లోనూ ఏఐ పాత్ర పెరగాలి. వాట్సాప్ గవర్నెన్స్‌తో 878 సేవలు అందుతున్నాయి. ఇప్పటివరకు 1.43 కోట్ల మంది వినియోగించుకున్నారు.

- అధికారులతో ఏపీ సీఎం చంద్రబాబు

ప్రాంతీయం

అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో గణతంత్రదినోత్సవ వేడుకలు

ప్రతిపక్షం ప్రతినిధి, నారాయణపేట్ జిల్లా జనవరి 26

నారాయణ పేట జిల్లా నర్వ మండలం రాయికోడ్ గ్రామం లో సోమవారము అంబేద్కర్ యువజన సంఘం గ్రామ అధ్యక్షులు మల్లన్ కోటి శంకర్ ఆధ్వర్యంలో ఘనంగా 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి అధ్యక్షులు మాట్లాడుతూ జనవరి 26 రోజున డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగం అమలులోకి వచ్చిన రోజు కావున జాతీయ జెండా ఎగురవేస్తూ గణతంత్ర దినోత్సవ వేడుకలు జరుపుకుంటున్నామన్నారు. భారత రాజ్యాంగాన్ని గౌరవిస్తూ చట్టాలను గౌరవిస్తూ ఆ మహనీయుని బాటలో ప్రతి ఒక్క భారతదేశ పౌరుడు ముందుకు సాగాలని తెలిపారు అంతకు ముందు గ్రామ పంచాయతీ దగ్గర నూతన సర్పంచ్, ఉప సర్పంచ్, మరియు పాలకవర్గం ఆమక్షంలో జాతీయ జెండా ను ఎగురవేశారు. అనంతరం ప్రాథమిక పాఠశాలలో జాతీయ జెండా ఎగురవేసి నూతనంగా ఎన్నికల్లో గెలిచినా సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు నంబర్స్ కి స్కూల్ ఎహెచ్ యం సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పి శశికళ రవి, ఉపసర్పంచ్ మ్యాతరి గోపాల్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాయల్ హెన్నా, ఉపాధ్యాయులు రాధారాణి, పంచాయతి కార్యదర్శి రమేష్, గ్రామస్తులు కే ఎన్ స్వామి, యం. నారాయణ రెడ్డి, ఆంజనేయులు గౌడ్, ఖాజమైనోద్దీన్, యన్ వెంకటేష్, తాయప్ప గౌడ్, పింజరి మౌలాలి, గడ్డమీద శ్రీను, పి ఆనంద్, బి రవి కుమార్, నాగేష్, గడ్డమీద ఆనంద్, కే అంజి, హోటల్ ఖాజా, రామాంజనేయులు గౌడ్, మెబు, జి బాలప్ప, ఫయ్యాజ్, పి రమేష్, కమిటి సభ్యులు నౌసూవెంకటయ్య, యోసేపు, మ్యాతరి రాము, మ్యాతరి చెన్నప్ప, నరసింహా, రుక్మోద్దీన్, వడ్ల రాములు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

భారత్ స్వాభిమాన్(న్యాస్)ఇందూరు ఆధ్వర్యంలో
77 వ గణతంత్ర వేడుకలు

ప్రతిపక్షం, బ్యూరో, నిజామాబాద్, జనవరి 26 :

ఇందూరు జిల్లా భారత్ స్వాభిమాన్ (న్యాస్) జిల్లా ప్రభారీ గంజి సాయన్న ఆధ్వర్యంలో 77 వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక జిల్లా కార్యాలయం శ్రీనగర్ కాలనీలో భారత్ స్వాభిమాన్ జిల్లా అధ్యక్షుడు గంజి సాయన్న పతాక ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్య వర్గ సభ్యులు ఇంజనీర్ గంగాధర్, పతంజలి యోగ సమితి ప్రభారీ తొర్తి బుచ్చన్న, ప్రధాన కార్యదర్శి మంకాళ విజయ్ కుమార్ ఆర్య యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎక్కొండ ప్రభాకర్, యువ భారత్ జిల్లా ప్రభారీగుండు రంజిత్, బీఎస్టి సంరక్షకులు మురళీధర్ ఆర్య, కార్యవర్గ సభ్యులు బంటు సంతోష్, సత్యనారాయణ, జయప్రకాశ్, చిన్న భూమేశ్వర్, మేఘన, యోగా సాధకులు పాల్గొన్నారు.

బహుజనులకు రాజ్యాధికారమే
టీఆర్పీ లక్ష్యం

- రానున్న మున్సిపల్ ఎన్నికల బరిలో
- ..జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు బిక్షపతి, నర్సింగ్

ప్రతిపక్షం, గజ్వేల్, జనవరి 26:

తెలంగాణ రాజ్యాధికార పార్టీ వ్యవస్థాపకులు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఆదేశాల మేరకు తెలంగాణ రాజ్యాధికార పార్టీ ప్రధాన కార్యదర్శి జ్యోతి పండల్, సిద్దిపేట జిల్లా అధ్యక్షులు తుప్పతి బిక్షపతి, సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షులు పి నర్సింగ్ ల ఆధ్వర్యంలో గజ్వేల్ పట్టణ కేంద్రంలో నియోజకవర్గ తెలంగాణ రాజ్యాధికార పార్టీ కార్యాలయాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బహుజనులకు రాజ్యాధికారం కల్పించాలని ముఖ్య ఉద్దేశంతో ఏర్పాటైన తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు ఏకమై బహుజనులకు అధికారం దిశగా ముందుకు సాగాలని అన్నారు. రానున్న స్థానిక సంస్థ ఎన్నికల్లో తెలంగాణ రాజ్యాధికార పార్టీ పోటీకి సిద్ధంగా ఉంది అని తెలియజేస్తూ, ఇప్పటివరకు వేరే పార్టీలో బీఫాంలో కోసం ఎదురుచూసే పరిస్థితి లేదని, రానున్న గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ ఎన్నికల్లో తెలంగాణ రాజ్యాధికార పార్టీ పోటీ చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా మైనారిటీ అధ్యక్షులు సయ్యద్ బాబా, జిల్లా యూత్ ప్రెసిడెంట్ కిషన్, జిల్లా సహాయ కార్యదర్శి గాలింక స్వామి, మహిళా అధ్యక్షురాలు తుప్పతీ శ్వేత, ఉపాధ్యక్షురాలు మౌనిక, వర్కింగ్ ప్రెసిడెంట్ గడ్డం వెంకటేష్, సిద్దిపేట జిల్లా రైతు సమితి అధ్యక్షులు రమేష్, సోషల్ మీడియా సిద్దిపేట జిల్లా ఇన్చార్జ్ శ్రీకాంత్, రాయపోల్ మండల అధ్యక్షులు తుప్పతీ కనకయ్య, మర్కుక్ మండల అధ్యక్షులు అనిల్, జగదేవ్ పూర్ మండల అధ్యక్షులు గడ్డం సురేందర్, తూప్రాన్ మండల అధ్యక్షులు గణేష్, ములుగు మండల అధ్యక్షులు ప్రకాష్, మండల ప్రధాన కార్యదర్శి ప్రకాష్, రాజు, భాస్కర్, బిక్కు నరేష్, శ్రీకాంత్, నాగరాజు, శ్రీనివాస్, జగదేవ్ పూర్ మండల్ ప్రధాన కార్యదర్శి హరీష్, తదితరులు పాల్గొన్నారు.

యువ స్విమ్మర్లకు ఘన సత్కారం

- అబ్దుర్ రెహమాన్, అబ్దుల్ నజీర్లకు గణతంత్ర దినోత్సవ వేడుకల్లో అవార్డులు

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, జనవరి 26 :

స్విమ్మింగ్ పోటీల్లో విశేష ప్రతిభ కనబరిచిన యువ స్విమ్మర్లు ముహమ్మద్ అబ్దుర్ రెహమాన్ సిద్ధిఖ్, అబ్దుల్ నజీర్లు సంగారెడ్డి పోలీస్ పరేడ్ గ్రౌండ్లో నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, జిల్లా కలెక్టర్ పి.ప్రావిణ్య, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ విజేతలకు అవార్డులు అందజేశారు. జిల్లా కలెక్టర్ సహకారంతో స్విమ్మింగ్ పూల్ అభివృద్ధి జరగడంతో పాటు, జిల్లా అధికారి డివైఎస్ఓ అఖిలేష్ రెడ్డి ప్రోత్సాహం వల్లే ఇలాంటి విజయాలు సాధ్యమవుతున్నాయని స్విమ్మింగ్ ఇన్చార్జ్ శేషు కుమార్ తెలిపారు. ప్రతిభ కనబరిచిన స్విమ్మర్స్ కు సంగారెడ్డి జిల్లా స్కూల్ గేమ్స్ ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనివాస్ అభినందనలు తెలియజేశారు. అదేవిధంగా అని విధాల సహకరిస్తున్న జిల్లా యంత్రాంగానికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. డి వై ఎస్ ఓ అఖిలేష్ రెడ్డి విజేతలకు అభినందనలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డి ఎస్ ఏ సిబ్బంది దీపిక, స్నేహలత, పవన్ కళ్యాణ్, స్విమ్మింగ్ పూల్ సిబ్బంది పవన్, కృష్ణ, కుమార్ పాల్గొని అభినందనలు తెలియజేశారు.

పేద ప్రజలకు సరైన వైద్యం అందించాలి

- ప్రజలు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, జనవరి 26 :

జిల్లా అధికారులు నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి పై ప్రత్యేక శ్రద్ధ వహించి పేద ప్రజలకు సరైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్య నారాయణ అన్నారు. ప్రజలు కూడా ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. సోమవారం నగరంలోని 34 వ డివిజన్ పరిధిలోని మిర్చి కంపౌండ్ లో గణతంత్ర దినోత్సవం సందర్భంగా బిజెపి యువ నాయకుడు బంటు ప్రవీణ్ కుమార్ (పండు) ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య శిబిరాన్ని అర్బన్ ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవం రోజున తమ బిజెపి నాయకుడు పేద ప్రజల ఆరోగ్యం కోసం ఇలాంటి హెల్త్ క్యాంప్ కార్యక్రమాన్ని నిర్వహించడం ఎంతో అభినందనీయమని అన్నారు. ఇలాంటి యువకులను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని కొనియాడారు. పేద, మధ్య తరగతి వారికి ప్రధానంగా కావాల్సింది విద్య, వైద్యమేనని, తర్వాత (ఆవాస్) ఒక గృహాన్ని నిర్మించుకోవడం చిరకాల స్వప్నమని, వీటిని నిర్వర్తించి పేదలకు సమకూర్చాల్సిన కనీస బాధ్యత ప్రభుత్వాలపై ఉందని అన్నారు. తాను ఎమ్మెల్యేగా విజయం సాధించాక జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించడం జరిగిందని, అక్కడ చాలా దారుణమైన పరిస్థితులు చూశానని ఎమ్మెల్యే తెలిపారు. తెలంగాణలో గాంధీ, ఉస్మానియా, ఆస్పత్రుల తర్వాత అత్యధిక ఓపి పేషెంట్లు నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి వస్తారని, కేవలం జిల్లా వాసులే కాకుండా చుట్టుపక్కల జిల్లాల నుండి కూడా వైద్యం కోసం పెద్ద ఎత్తున పేషెంట్లు వస్తారని ఎమ్మెల్యే అన్నారు. కానీ, ఇంత పెద్ద ప్రభుత్వ ఆసుపత్రిలో సరిపడా ఆరోగ్యపరమైన మిషిన్లు లేకపోవడం, అన్ని రకాల వైద్యులు అందుబాటులో ఉండకపోవడం పేదవారు చేసుకున్న దౌర్భాగ్యమని ఎమ్మెల్యే దుయ్యబట్టారు. ముఖ్యంగా గుండెకు సంబంధించిన మిషన్ జిల్లా ఆస్పత్రిలో అందుబాటులో ఉన్నప్పటికీ అది ఇప్పటికీ ప్రారంభానికి నోచుకోకపోవడం దురదృష్టకరమైన విషయం అన్నారు. ప్రభుత్వం ఈ హెల్త్ క్యాంప్ లో ఎంఆర్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు జనరల్ మెడిసిన్ డాక్టర్ దొరబాబు, జనరల్ సర్జన్ డాక్టర్ వెంకట రమణ, న్యూరో సర్జన్ డాక్టర్ సర్వరాజ్ లు పాల్గొన్నారు.

ఆరేపల్లి పాఠశాలలో గణతంత్ర దినోత్సవ వేడుకలు

ప్రతిపక్షం మిడిదొడ్డి జనవరి 26

ఆరేపల్లి ప్రాథమిక పాఠశాలలో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులచే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు ఆద్యంతం ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ స్వప్న మాట్లాడుతూ విద్యార్థుల్లో దేశభక్తినీ, నైతిక విలువలు పెంపొందించే విధంగా ఉపాధ్యాయులు కృషిచేయాలని, విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు, ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు విష్ణు, ఉపాధ్యాయులు సతీష్, నగేష్, రామచంద్రం, పావని, లావణ్య, లత మరియు వార్డు మెంబర్లు, విద్యార్థుల తల్లితండ్రులు తదితరులు పాల్గొన్నారు.

మక్తల్ నియోజకవర్గంలో ఘనంగా గణతంత్ర వేడుకలు

- పాల్గొన్న మంత్రి వాకిటి శ్రీహరి

ప్రతిపక్షం ప్రతినిధి, నారాయణపేట్ జిల్లా జనవరి 26

మండల పరిధిలోని 39 గ్రామపంచాయతీలలో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. గణతంత్ర వేడుకల్లో భాగంగా ఆయా పాఠశాలల విద్యార్థులు ప్రముఖుల వేషధారణలో నిర్వహించిన ప్రభాత్ బేరి ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. పట్టణ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంత్రి వాకిటి శ్రీహరి, పోలీస్ స్టేషన్ వద్ద సీఐ, తహసిల్దార్ కార్యాలయం వద్ద తహసిల్దార్ సతీష్ కుమార్, ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీడీవో రమేష్, వ్యవసాయ కార్యాలయం వద్ద వ్యవసాయ అధికారి మిథున్ చక్రవర్తి జండా ఎగరవేశారు. ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల వద్ద ప్రధానోపాధ్యాయులు జెండాలు ఆవిష్కరించారు. ఆయా కార్యక్రమాల్లో ఆయా పార్టీల నాయకులు, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

ఓయు జెఏసి నేతను
పరామర్శించిన డిబిఎఫ్ నేత

ప్రతిపక్షం, గజ్వేల్, జనవరి 26:

ఉస్మానియా విశ్వవిద్యాలయ జెఏసి నేత శ్రీకాంత్ ను డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ సోమవారం నాడు కొల్గూర్ లో పరామర్శించారు. ఇటీవల శ్రీకాంత్ తల్లి ఐలమ్మ అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న శంకర్ ఐలమ్మ చిత్ర పటానికి పువ్వులు వేసి నివాళులు అర్పించారు. మనోధైర్యం తో వుండాలని కుటుంబ సభ్యులను కోరారు. ఈ కార్యక్రమం లో డిబిఎఫ్ నాయకులు మైసయ్య, తాడెం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రిపబ్లిక్ డే వేడుకలు..

- భగత్ సింగ్ వేషధారణలో చిన్నారి విద్యార్థి..

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట, జనవరి 26 :

సిద్దిపేట అర్బన్ మండల వ్యాప్తంగా ఆయా కుల సంఘాలు గ్రామపంచాయతీ కార్యాలయాల వద్ద మండల వ్యాప్తంగా ఉన్న పాఠశాలల వద్ద గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని సోమవారం జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలలో చిన్నారులు స్వాతంత్ర సమరయోధుల వేషాధారణలను ధరించి ర్యాలీ నిర్వహించి నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలి

- ఎమ్మెల్సీ డా. చిన్నమైల్ అంజిరెడ్డి

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, జనవరి 26 :

ప్రతి ఒక్కరి జీవితంలో ఆత్మవిశ్వాసాన్ని, క్రమశిక్షణను అందించడంలో క్రీడా పోటీలు కీలక పాత్ర పోషిస్తాయని ఎమ్మెల్సీ డా. చిన్న మైల్ అంజిరెడ్డి అన్నారు. సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు మైత్రి గ్రౌండ్ లో మైత్రి క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో ఎస్ ఆర్ గ్రూప్ అఫ్ కంపెనీ సహకారం తో నిర్వహించిన క్రికెట్ పోటీ ముగింపు కార్యక్రమం లో ఆయన పాల్గొని మాట్లాడారు యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడానికి ఈ క్రీడా పోటీలు ఎంతగానో ఉపయోగం పడుతాయన్నారు. అంతేకాకుండా గ్రామీణ స్థాయి క్రీడాకారుల ప్రతిభను వెలికితీస్తే అవకాశం ఉంటుంది. ఈ పోటీలతో గ్రామీణ, పట్టణ యువతలో క్రీడలపై ఆసక్తి పెరుగుతుంది. అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులు తయారవుతారు..క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలి. గెలుపు ఓటములను సమానంగా తీసుకుని భవిష్యత్తుకు బాటలు వేయాలి. ప్రతి ఒక్కరు రోజులో కొంత టైం స్పోర్ట్స్ కు కేటాయించాలి. గత 36 యేండ్ల గా ఎస్ ఆర్ గ్రూప్ అఫ్ కంపెనీ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నాం. వచ్చే సారి పోటీలో పాల్గొనే క్రీడాకారులకు రూ. 5 లక్షలు ఇన్సూరెన్స్ కలిపిస్తాం.' అని అంజిరెడ్డి అన్నారు. ఈ పోటీలో విజేతలు ఎస్ ఆర్ గ్రూప్ టీమ్ కు రూ. లక్ష 50 వేలు, వన్ ఛాంపియన్ షిప్ టీమ్ కు రూ. లక్ష నగదు ను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మైత్రి క్రికెట్ క్లబ్ అధ్యక్షులు హనుమంత్ రెడ్డి తదితరులు ఉన్నారు.

చిన్నారుల ప్రాణాలకు భరోసా.. సత్యసాయి సంజీవని

- ఉచితంగా ఆపన్నహస్తం అందిస్తున్న సంజీవని ట్రస్ట్ సేవలు అభినందనీయం
- సమాజానికి సేవ చేయాలనే లక్ష్యం ఉండాలి
- మెదక్ ఎంపీ రఘునందన్ రావు
- మా దగ్గర బిల్లులు ఉండావు.. ప్రేమ మాత్రమే ఉంటుంది: ట్రస్ట్ చైర్మన్ శ్రీనివాస్

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, జనవరి 26:

చిన్నారుల ప్రాణాలకు సత్యసాయి సంజీవని భరోసా అని మెదక్ ఎంపీ రఘునందన్ రావు తెలిపారు. సోమవారం కొండపాక సత్య సాయి సంజీవని చైల్డ్ హార్ట్ కేర్ రీసెర్చ్ సెంటర్ ఆస్పత్రిలో గుండె ఆపరేషన్ పొందిన చిన్నారులకు గిఫ్ట్ ఆఫ్ లైఫ్ సర్టిఫికెట్ల ప్రదానోత్సవం ఆసుపత్రిలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొని, గుండె ఆపరేషన్ చేయించుకున్న చిన్నారులతో ముచ్చటించారు. ఆసుపత్రి ఆవరణలో గణతంత్ర దినోత్సవం పురస్కరించుకుని ఏర్పాటు చేసినా జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసినా సమావేశం లో రఘునందన్ రావు మాట్లాడుతూ.. సమాజానికి సేవ చేయాలనే లక్ష్యం ఉండాలని పేర్కొన్నాడు. కొండపాకలో ఏర్పడిన సంజీవని ఆసుపత్రిలో గుండెకు చిత్రం పడిన ఎంతోమంది చిన్నారులకు ఆపరేషన్లు చేస్తూ వారిలో వెలుగులు నింపుతున్న సత్యసాయి సంజీవని ఆసుపత్రి నిర్వాహకులను అభినందించారు. వారి సేవలను కొనియాడారు. సత్యసాయి సంస్థ వారు ఒక విజన్ తో ఏదైనా ఒక కార్యక్రమాన్ని ప్రారంభిస్తే సంవత్సర కాలంలో పూర్తిచేసి ప్రజలకు సేవలు అందించేలా పనిచేస్తారని కొనియాడారు. సత్యసాయి బాలికల పాఠశాలలో ఎంతో మంది అనాథలు, పేదవారు ఉచితంగా విద్యనిభ్యసిస్తూ మళ్ళీ అదే పాఠశాలలో ఆసుపత్రుల్లో ఉచిత సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. ఇలాంటి సేవా సంస్థలను సైతం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రోత్సహిస్తున్నాడని అన్నారు. అవసరమైన వారికి ఆపన్న హస్తం అందించేలా నిలబడే తత్వం ప్రతి ఒక్కరిలో ఉండాలన్నారు. అదేవిధంగా ప్రజలకు నాణ్యమైన విద్య వైద్యం అందితే ఏది అవసరం ఉండదని ఆ దిశగా ప్రతి రాజకీయ నాయకుడు పార్టీలు మార్పు చెందాల్సిన అవసరం ఉందన్నారు. అందుకోసమే తాను రాజకీయాల్లోకి వచ్చానని పేర్కొన్నాడు. మానవసేవే మాధవసేవ లాగా భావించి ప్రతి ఒక్కరు మంచి చేయాలని ఆలోచన సేవా దృక్పథం పెంపొందించుకోవాలన్నారు. సమాజానికి సేవ చేయాలనే లక్ష్యం ఉండాలని పేర్కొన్నాడు. అలాగే ట్రస్ట్ చైర్మన్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. దూర ప్రాంతాల నుంచి పేద పిల్లలు, మా సత్యసాయి దేవాలయంకు వస్తున్నవారికి అభినందనలు. మా సత్యసాయి ట్రస్ట్ దేశ సేవకే ప్రాతినిధ్యం ఇస్తామని తెలిపారు. మా దగ్గర బిల్లులు ఉండావు.. ప్రేమ మాత్రమే ఉంటుందని చెప్పారు. 18 రాష్ట్రాలలో 18 ఇలాంటి కేర్ సెంటర్ ట్రస్టులు ఉన్న సిద్దిపేట కేర్ సెంటర్ చాల తృప్తినిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్, చింత సంతోష్ కొండపాక సర్పంచ్, బాసంగారి వెంకట్, తొడుపునూరి వెంకటేషం, తదితరులు పాల్గొన్నారు.

తమిళనాడుపై హిందీని రుద్దే ప్రయత్నాలను ఒప్పుకునేది లేదు. ఉత్తరాదిలో హిందీని ప్రవేశపెట్టడం వల్ల హర్యాన్వీ, భోజ్‌పురి, బిహారీ, ఛత్తీస్‌గఢీ వంటి మాతృభాషలు కనుమరుగయ్యాయి. ప్రాంతీయ గుర్తింపు, సాంస్కృతిక వారసత్వాన్ని హిందీ నాశనం చేస్తుందనడానికి ఇదే నిదర్శనం.
- తమిళనాడు డిప్యూటీ సీఎం ఉదయనిధి

ఉత్తమ అవార్డు అందుకున్న ప్రిన్సిపాల్

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట జనవరి 26:

సిద్దిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల (కో ఎడ్యుకేషన్) ప్రిన్సిపల్ సత్యనారాయణరెడ్డి ఉత్తమ ప్రిన్సిపల్ గా అవార్డును అందుకున్నారు. కళాశాల విద్యకు ఆయన చేసిన సేవలకు గానూ ప్రభుత్వం గుర్తించి అవార్డుకు ఎంపిక చేసింది. గణతంత్ర దినోత్సవం సందర్భంగా సోమవారం జిల్లా కలెక్టర్ హైమావతి చేతుల మీదుగా ఈ అవార్డును ఆయన అందుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ అవార్డును అందుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. తన ఉద్యోగ జీవితం సంతృప్తిని ఇస్తుందని, ఇప్పటివరకు వీలైనంత వరకు నిబద్ధతతో పనిచేస్తూ విద్యార్థులకు, కళాశాలకు మేలు చేసేందుకు ప్రయత్నించినట్లు చెప్పారు. భవిష్యత్తులో తన విధులను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తాను అన్నారు. జిల్లా ఇంటర్ విద్యాధికారి రవీందర్ రెడ్డి, కళాశాల అధ్యాపకులు దేవయ్య, సుధాకర్ రెడ్డి, కనక చంద్రం, శ్రీనివాస్ రెడ్డి, అశోకు, నగేష్, రాజ్యలక్ష్మి, రఘురాజు, వెంకటరమణ, గంగాధర్, నరేందర్ రెడ్డి, శ్రీకాంత్, రాజశేఖర్ రెడ్డి, నిఖిల్ తదితరులు ప్రిన్సిపల్ కు శుభాకాంక్షలు తెలిపారు.

ఫోటో, వీడియోగ్రఫీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్

ప్రతిపక్షం ప్రతినిధి మెదక్ జనవరి 26 :

మెదక్ జిల్లా ఫోటో మరియు వీడియో గ్రఫీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మెదక్ జిల్లా ఫోటో. వీడియో గ్రఫీ అధ్యక్షుడు కంచి ఆనంద్, ప్రధాన కార్యదర్శి బంద చంద్రశేఖర్, కోశాధికారి కూచన శ్రీధర్ మరియు క్రికెట్ టోర్నమెంట్ 2026 ను మెదక్ పట్టణంలో ని సి యస్ ఐ కాంపౌండ్ లోని కేసీఆర్ గ్రౌండ్ లో ఆదివారం మరియు స్పోర్ట్స్ కమిటీ సభ్యులు దాసరి శ్రీధర్, బొద్దుల విగ్నేష్, వంశీకృష్ణ, ఎం లక్ష్మణ్, నరేందర్ గౌడ్, డి శ్రీకాంత్, అవారి సుమన్, జి రవి, బోయిన శ్రీకాంత్, సమక్షంలో సోమవారం మరియు ఆదివారం రెండు రోజుల పాటు ఉత్కంఠ భరితంగా, హోరా హోరిగా జరిగింది. ఈ టోర్నమెంట్ కు జిల్లాలోని మెదక్ మండల్, చిన్న శంకరంపేట్, చేగుంట, తూప్రాన్, రామాయంపేట్, అల్లదుర్గ్, వెల్దుర్తి, వివిధ మండలాలు పాల్గొన్నాయి. ఈ టోర్నమెంట్ మెదక్ మున్సిపాలిటీ మాజీ చైర్మన్ తొడుపునూరి చంద్రపాల్ మరియు మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రశాంత్ రెడ్డి లు టాస్ వేసి టోర్నమెంట్ ను ప్రారంభిచారు. హోరాహోరీ గా జరిగిన టోర్నమెంట్లో ఫైనల్ కు అల్లాదుర్గం మరియు శంకరం పేట్ లు తలపడగా అల్లాదుర్గం టీం మొదటి విజేతగా నిలిచింది. రన్నర్ అప్ గా చిన్న శంకరంపేట్ లు నిలిచాయి. ఈ టోర్నమెంట్ లో గెలుపొందిన టీం కు మొదటి బహుమతి గా 12వేల రూపాయలను, విన్నర్ కప్ ను రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు వెంకటరెడ్డి ద్వారా అందించారు. రెండవ బహుమతి కి 6 వేల రూపాయలును రన్నర్ అప్ కప్ ను ద్వారా అందించారు. ఈ కార్యక్రమం కు ముఖ్య అతిధిలుగా రాష్ట్ర కమిటీ వ్యవస్థాపక అధ్యక్షులు వెంకట్ రెడ్డి, రాష్ట్ర కోశాధికారి మాధవరెడ్డి, ప్రధాన సలహాదారుడు శ్రీధర్ బాబు, జాయింట్ సెక్రటరీ జంగారెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి దాసరి శ్రీధర్, మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ చంద్రపాల్, మాజీ కౌన్సిలర్ గౌదల సాయిలు, జీ ఆర్ మెమోరియల్ చైర్మన్ నరేష్ బాబు, సి యస్ ఐ కాంపౌండ్ కోశాధికారి సంపత్, మెదక్ మండల అధ్యక్షులు సురేందర్ కార్యదర్శి హరీష్ కోశాధికారి ఈగ శ్రీకాంత్, సీనియర్ ఫోటో గ్రాఫర్స్ మరియు వివిధ మండల ఫోటోగ్రాఫర్ లు తదితరులు పాల్గొన్నారు.

సూర్యవంశం ఆరెకటిక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు

ప్రతిపక్షం, సిద్దిపేట టౌన్, జనవరి 26:

సూర్యవంశం ఆరెకటిక సంఘం భవన్‌లో హౌసింగ్ బోర్డు కమాన్ సమీపంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు గజబిన్ కార్ శ్రీనివాస్, రామోజీతో పాటు సంఘ సభ్యులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు గజబిన్ కార్ శ్రీనివాస్ మాట్లాడుతూ రాబోయే మున్సిపల్, ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లో ఆరెకటిక కులస్తులు రాజకీయంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

ధోబీ గల్లిలో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు

ప్రతిపక్షం, సిద్దిపేట టౌన్, జనవరి 26:

సిద్దిపేట పట్టణంలోని ధోబీ గల్లి రజక సంఘ భవనంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు భూంపల్లి కనకరాజు మాట్లాడుతూ, రాబోయే రోజుల్లో అన్ని కులస్తుల మాదిరిగానే రజక కులస్తులు కూడా రాజకీయంగా మరింత చురుకుగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రాబోయే మున్సిపల్ ఎన్నికలలో రజక సంఘ సభ్యులు పాల్గొని విజయకేతనం ఎగరవేసి, భవిష్యత్తులో రజక కులం తరపున అత్యున్నత స్థానాల్లో నిలవాలని ఆకాంక్షించారు.

సీపీని కలిసిన త్రీటౌన్ సీఐ లక్ష్మీబాబు

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట జనవరి 26:

సిద్దిపేట త్రీ టౌన్ పోలీసు స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన లక్ష్మీబాబు పోలీసు కమిషనర్ కార్యాలయంలో సీపీ ఎస్ రష్మీ పెరుమాళ్‌ను సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయాలని సీపీ సూచించారు. సీఐ లక్ష్మీబాబుకు గతంలో సిద్దిపేటలో పని చేసిన అనుభవం ఉంది. 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని, ప్రతి ఒక్క వాహనదారుడు ట్రాఫిక్, రోడ్డు నిబంధనలు పాటించాలని సీఐ లక్ష్మీబాబు తెలిపారు.

చారిత్రక వ్యక్తుల వేషధారణతో ఆకట్టుకున్న చిన్నారులు

ప్రతిపక్షం, నంగునూరు, జనవరి 26:

సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం గట్లమల్యాల ప్రాథమిక పాఠశాల విద్యార్థులు చారిత్రక, జాతీయ నాయకుల వేషధారణతో ఆకట్టుకున్నారు. గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా ప్రాథమిక పాఠశాల విద్యార్థులు సోమవారం చారిత్రక, జాతీయ నాయకుల వేషధారణతో జెండా వందనానికి హాజరై అబ్బురపరిచారు. చిన్నారుల వేషధారణకు గ్రామస్తులు ముగ్ధులయ్యారు.

సీపీఐ కార్యాలయంలో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు..

- మంద పవన్, సీపీఐ జిల్లా జిల్లా కార్యదర్శి, సిద్దిపేట

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట జనవరి 26:

గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని సిద్దిపేట పట్టణంలోని సీపీఐ కార్యాలయం వద్ద సోమవారం సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఆవిష్కరించి ఎగరవేసి జాతీయ గీతాలాపన చేశారు. ఈ సందర్భంగా మంద పవన్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రపంచంలోనే అత్యంత విశాలమైన, ప్రజాస్వామ్యాత్మక రాజ్యాంగమని తెలిపారు. దేశ పౌరులందరికీ సమాన హక్కులు, స్వేచ్ఛలు, న్యాయం కల్పించడమే రాజ్యాంగ ప్రధాన ఉద్దేశమన్నారు. మాట స్వేచ్ఛ, భావ వ్యక్తీకరణ, విద్య, జీవన హక్కు వంటి మౌలిక హక్కులను రాజ్యాంగం ప్రజలకు అందించిందని గుర్తుచేశారు. స్వాతంత్ర్య సమరయోధులు, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. సామాజిక అసమానతలు తొలగించి, సమానత్వం, సోదరభావం, లౌకికతను పరిరక్షించడమే గణతంత్ర దినోత్సవ అసలైన ఆత్మ అని అన్నారు. రాజ్యాంగ విలువలను కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యతగా పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి, కార్మికులు, రైతులు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం సీపీఐ నిరంతరం పోరాటం చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కిష్టపురం లక్ష్మణ్, జేరిపోతుల జనార్ధన్, పట్టణ కార్యదర్శి గజాభీమకర్ బన్సీలాల్, సహాయ కార్యదర్శి ఎస్కె హారిఫ్ తదితరులు పాల్గొన్నారు..

ప్రశ్నించే గొంతులపై దాడి..

- రాష్ట్రంలో ప్రజాస్వామ్యంపై కాంగ్రెస్ ప్రభుత్వం దాడి చేస్తోంది
- ఉద్యోగుల పీఆర్సీ అడిగితే ఏసీబీ దాడులు, ప్రతిపక్షాలు ప్రశ్నిస్తే సిట్ నోటీసులు
- మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, జనవరి 26:

ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే గొంతులను అణిచివేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ పాలనగా మారిందని మాజీ మంత్రి హరీష్‌రావు తీవ్రంగా విమర్శించారు. ఉద్యోగులు పీఆర్సీ అడిగితే ఏసీబీ దాడులు, విద్యార్థులు ఫీజు రీఎంబర్స్‌మెంట్ బకాయిలు అడిగితే కాలేజీలపై విజిలెన్స్ దాడులు, ప్రతిపక్షాలు ప్రశ్నిస్తే సిట్ నోటీసులు జారీ చేస్తూ రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని అన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా సిద్దిపేటలోని టీఎన్జీవో భవన్‌లో నిర్వహించిన ఉత్తమ ఉద్యోగుల సన్మాన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సిద్దిపేటకు ప్రత్యేకతగా స్వంత ఎన్జీవో భవన్ ఉండటం గర్వకారణమని, గత 22 ఏళ్లుగా గణతంత్ర దినోత్సవం, ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉద్యోగులు, పదో తరగతిలో అత్యుత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులను సన్మానించే సంప్రదాయం కొనసాగుతుండటం ఆనందంగా ఉందన్నారు. మంచి ఉద్యోగులను, ఉపాధ్యాయులను గౌరవించడమే సమాజాన్ని గౌరవించినట్టని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు రెండు నెలలు దాటిందని, ఇప్పుడు ప్రజలకు నిజమైన పాలన అంటే ఏమిటో అర్థమైందన్నారు. కేసీఆర్ గారే బాగుండేవారని ప్రజలే నేడు గుర్తు చేసుకుంటున్నారని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వం ఒకసారి 42 శాతం, మరోసారి 30 శాతం మొత్తం 72 శాతం పీఆర్సీ ఇచ్చి ఉద్యోగులను గౌరవించిందని గుర్తుచేశారు. కానీ నేడు ఉద్యోగ సంఘాల నాయకులు పీఆర్సీ గురించి కనీసం అడిగే పరిస్థితి లేదని, అడిగితే ప్రభుత్వం భయపెడుతోందన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం రెండేళ్లలో 95 వేల కోట్ల రూపాయల కాంట్రాక్టులకు టెండర్లు పిలిచి అవార్డు చేసి, సుమారు 30 వేల కోట్ల రూపాయల కమీషన్ల కోసం బడా కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించిందని ఆరోపించారు. ఉద్యోగులకు బకాయిలు ఇవ్వకపోవడం డబ్బులు లేనందువల్ల కాదు, ఇవ్వాలనే మనసు లేకపోవడమే కారణమన్నారు. మూసీ సుందరీకరణకు లక్ష కోట్లు, ఫ్యూచర్ సిటీకి లక్ష కోట్లు, హ్యామ్ రోడ్లకు 15 వేల కోట్లు, గోదావరి నీళ్ల మళ్లింపుకు 8 వేల కోట్లు, ఇంటిగ్రేటెడ్ స్కూళ్లకు 20 వేల కోట్లు ఖర్చు చేస్తున్న ప్రభుత్వం— ఉద్యోగుల విషయానికి వచ్చేసరికి డబ్బులు లేవని చెప్పడం హాస్యాస్పదమన్నారు. ఐదు డీఏలు, పీఆర్సీ, జీపీఎఫ్ పైసలు పెండింగ్‌లో ఉన్నాయని, ఏడాది గడిచినా రిటైర్డ్ ఉద్యోగులకు బకాయిలు ఇవ్వడం లేదన్నారు. బీఆర్ఎస్ హయాంలో 18 వేల మంది ఉద్యోగులు రిటైర్ అయితే నెల, రెండు నెలల్లోనే అన్ని బెనిఫిట్లు ఇచ్చామని గుర్తు చేశారు. రేవంత్ రెడ్డి పాలనలో రాష్ట్ర రియల్ ఎస్టేట్ మార్కెట్ పూర్తిగా కుదేలైందని, అవసరానికి ప్లాట్లు అమ్మాలన్నా కొనేవాళ్లు లేని పరిస్థితి ఏర్పడిందన్నారు. కేసీఆర్ రాష్ట్ర ప్రతిష్టను, ఆదాయాన్ని పెంచితే, రేవంత్ రెడ్డి ప్రభుత్వం అద్భుతమైన రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టేస్తోందని విమర్శించారు. సిద్దిపేటపై రాజకీయ ఈర్ష్యతో వెటర్నరీ కాలేజీ, వెయ్యి పడకల ఆసుపత్రి, నర్సింగ్ కాలేజీ పనులను అడ్డుకుంటూ అభివృద్ధిని వెనక్కి నెట్టేస్తున్నారని ఆరోపించారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ పార్టీ తరపున ప్రభుత్వాన్ని నిలదీస్తామని, ప్రశ్నిస్తామని, అవసరమైతే పోరాటం చేస్తామని హరీష్‌రావు స్పష్టం చేశారు.

అబ్బుర పరిచిన చిన్నారుల గెటప్

- కాకతీయలో ఘనంగా 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట, జనవరి 26:

సిద్దిపేట జిల్లా కేంద్రంలోని కాకతీయ హైస్కూల్లో 77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని, విద్యార్థిని, విద్యార్థులు వివిధ రకాల దేశ నాయకుల గెటప్ వేసి అబ్బురపరిచారు. సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. గణతంత్ర దినోత్సవ వేడుకలు వీనుల విందుగా, కన్నుల పండువగా కాకతీయ హైస్కూల్ నిర్వహించడం జరిగింది

ఊరూర ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు

ప్రతిపక్షం, మొయినాబాద్, జనవరి 26 :

మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. అంతకుముందు మహనీయుల ఫోటోలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాలపై నూతన సర్పంచులు జాతీయ జెండా ఎగురవేసి జాతీయ గీతం ఆలపించారు. ఈ సందర్భంగా నూతన సర్పంచులు మాట్లాడుతూ.... దేశస్వాతంత్రం కోసం పూజ్య మహాత్మ గాంధీ నేతఅత్వంలో అహింసా మార్గంలో పయనించి ఈ దేశానికి స్వాతంత్రం తీసుకొని రావడం జరిగిందని కొనియాడారు. ఈ స్వాతంత్రం ఉద్యమంలో మహనీయులతోపాటు అనేక లక్షల మంది ప్రజల త్యాగం ఉన్నదన్నారు. ఈ సందర్భంగా వారంతా ప్రతిజ్ఞ చేశారు. అనంతరం మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, ప్రజలు పాల్గొన్నారు.

అభివృద్ధి నా లక్ష్యం

ప్రతి పక్షం, మొయినాబాద్: జనవరి 26

గ్రామ ప్రజలకు కష్టమొస్తే ముందుంటా గ్రామాభివృద్ధికి తోడుంటానని, ప్రజల ఆశీర్వాదంతో కౌన్సిలర్ అభ్యర్థిగా బరిలో ఉన్నానని కౌన్సిలర్ అభ్యర్థి డప్పు ఆనంద్ తెలిపారు. సోమవారం ఉదయం స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా 11వ వార్డు సభ్యులందరికీ స్వతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు, ఈ సందర్భంగా డప్పు ఆనంద్ మాట్లాడుతూ... ప్రతీ కుటుంబం లక్ష్యంగా పనిచేస్తానని తెలిపారు. తాగునీరు, నాణ్యమైన వీధిలైట్లు, సిమెంట్ రోడ్లు, స్వచ్ఛ గ్రామ పథకం అమలు, కాలువల మరమ్మత్తులు, చెత్త సేకరణ నిరంతర సేవలు, వృద్ధులు వికలాంగులకు సులభమైన ఫించన్ సేవలు, మహిళా సంఘాల బలోపేతం వంటివి తన ప్రాధాన్యతల జాబితాలో ఉన్నాయని తెలిపారు.

“



దేశవ్యాప్తంగా జనగణన ఆరు నెలల్లోనే పూర్తవుతుంది. ఆ తర్వాత నియోజకవర్గాల పునర్విభజన జరుగుతుంది. మహిళల రిజర్వేషన్‌తోపాటు ఇతర ప్రక్రియ అంతా ఎన్నికలలోపే పూర్తవుతాయి. తెలంగాణలో కూడా అసెంబ్లీ, పార్లమెంట్‌కు ఒకేసారి ఎన్నికలు వచ్చే అవకాశం ఉంది.

- బీజేపీ ఎంపీ లక్ష్మణ్

పేలిన మావోయిస్టుల మందుపాతర..

ఛత్తీస్‌గఢ్ లోని కర్రెగుట్ట అటవీ ప్రాంతంలో మావోయిస్టులు అమర్చిన మందుపాతర పేలడంతో 11 మంది జవాన్లు గాయపడ్డారు. భద్రతా బలగాలు కూంబింగ్ ఆపరేషన్ నిర్వహిస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఛత్తీస్ గఢ్‌తెలంగాణ సరిహద్దుల్లోని కీలకమైన కర్రెగుట్టల అడవుల్లో ఒకపుడు మావోయిస్టులు తమ స్థావరంగా వినియోగించుకున్నారు. ఆ సమయంలో వారు అక్కడ తమ రక్షణ కోసం మందుపాతరలు అమర్చారు. అయితే ప్రస్తుతం వాటిని సీఆర్పీఎఫ్ దళాలు స్వాధీనం చేసుకున్నాయి. ఈ క్రమంలో కూంబింగ్ చేస్తున్న క్రమంలో మందుపాతరలు పేలి 11 మంది భద్రతా సిబ్బందికి తీవ్ర గాయాలయ్యాయి. కర్రెగుట్టల అడవులు సుమారు 200 చదరపు కిలోమీటర్లలో విస్తరించిన దట్టమైన అడవులు. ఈ అడవులు దశాబ్దాలుగా మావోయిస్టులకు పెట్టని కోటలుగా ఉండేవి. ఇలాంటి కోటలోకి ఆపరేషన్ కగార్ పేరుతో భద్రతాదళాలు చొచ్చుకునిపోతున్నాయి. రెగ్యులర్ గా మావోయిస్టు(Maoist Party) లకోసం భద్రతాదళాలు అడవులను గాలిస్తునే ఉన్నాయి. ఈనేపథ్యంలోనే సోమవారం తెల్లవారుజామున ఇంప్రువైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైజ్ (IEDs)లు పేలటంతో కూంబింగ్ చేస్తున్న భద్రతాదళాల్లోని పదకొండుమందికి తీవ్రమైన గాయాలయ్యాయి.అడవుల్లో తమకోసం గాలింపు చర్యలు చేస్తున్న భద్రతాదళాలను లక్ష్యంగా చేసుకుని గతంలోనే మావోయిస్టులు ఈ ప్రాంతంలో పెద్ద ఎత్తున మందుపాతరలు అమర్చినట్లు తెలుస్తోంది.ఈ క్రమంలో రిపబ్లిక్ డే అయిన నేడు భద్రతాదళాలు గాలింపు చర్యలు చేస్తున్న ప్రాంతాల్లో అప్పటికే తమ రక్షణకోసం ఏర్పాటు చేసుకున్న ఐఈడీల్లో ఒకదాని తర్వాత మరోకటి పేలడంతో పదిమంది డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్స్, ఒక కోబ్రా బెటాలియన్ అధికారికి తీవ్రమైన గాయాలయ్యాయి. విషయం తెలియగానే గాయపడిన వారికి అత్యవసర వైద్యం అందించేందుకు ఉన్నతాధికారులు వారిని హెలికాప్టర్లో రాయపూర్ ఆసుపత్రికి తరలించారు.గాలింపు చర్యల్లో భాగంగా భద్రతాదళాలు అడవుల్లో చాలా ఐఈడీలను స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. పోయిన ఏడాది ఏప్రిల్‌మే నెలలో జరిగిన భారీ ఎన్ కౌంటర్లలో అనేకమంది మావోయిస్టులు చనిపోగా 35 ఆయుధాలు, 450 ఐఈడీలు, పెద్దసంఖ్యలో డిటోనేటర్లు, వైద్య పరికరాలు, విద్యుత్ పరికరాలను స్వాధీనం చేసుకున్నారు.

విశ్వ వీక్షణం

పాత ఆలయం

బ్రహ్మోత్సవాలకు సిద్ధమైన సెంటిమెంట్ దేవుడు

- తెలంగాణ మలిదశ ఉద్యమంలో జాతీయస్థాయి ప్రాచుర్యం పొందిన ఆలయం
- ఈనెల 30 నుంచి మూడు రోజులపాటు కోనాయిపల్లి వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

నూతన ఆలయం

సెంటిమెంట్ దేవునిగా ప్రసిద్ధి చెందిన కోనాయిపల్లి వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు సిద్ధం అయ్యాడు. సుమారు ఎనిమిది దశాబ్దాల కిందట సిద్ధిపేట జిల్లా నంగునూరు మండలం కోనాయిపల్లిలో వెలిసి భక్తుల పాలిట కొంగు బంగారంగా వెలుగొందుతున్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 30వ తేదీ నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఏర్పాట్లు చేస్తోంది. కోనాయిపల్లి వెంకటేశ్వర స్వామి తెలంగాణ ఉద్యమ నాయకుడు, రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ సెంటిమెంట్ దేవునిగా తెలంగాణ ఉద్యమ సమయంలో జాతీయ స్థాయిలో విశేష ప్రాచుర్యం పొందారు. ఉద్యమ సమయంలో తీసుకున్న నిర్ణయాలన్నీ ఈ దేవాలయంలో మొదట పూజ చేసిన తర్వాత కావడం విశేషం. తెలంగాణ మలిదశ ఉద్యమం 2001లో టీఆర్ఎస్ ఏర్పాటుతో ప్రారంభమై ప్రత్యేక రాష్ట్రం ఏర్పడింది. కేసీఆర్ 2001 ఏప్రిల్ 27 వ తేదీన కోనాయిపల్లి వెంకటేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేసిన తరువాతనే హైదరాబాద్ వెళ్ళి తెలంగాణ రాష్ట్రసమితి(టీఆర్ఎస్)ని స్థాపించారు.

పసరు మందుతో...

ఎనిమిది దశాబ్దాల కిందట నిర్మితమైన ఆలయంలో విశేష ప్రాచుర్యం పొందిన వెంకటేశ్వర స్వామి మొదట్లో పసరు మందు వెంకటేశ్వరుడిగా పేరు పొందారు. కోనాయిపల్లి గ్రామానికి చెందిన గూడెపు ఎల్లారెడ్డి అనే వ్యక్తికి వెంకటేశ్వరుడు కలలో కనిపించి వివిధ రోగాల నివారణకు చెట్ల పసరు మందు గురించి చెప్పి అంతర్ధానం అయ్యాడట. వెంటనే మెలకువ వచ్చిన ఎల్లారెడ్డి తనకు కలలో చెప్పిన ఆనవాళ్ళ ప్రకారం అడవికి వెళ్ళి చెట్ల ఆకులు, బెరడు సేకరించి ప్రజలకు అందివ్వడం ప్రారంభించారు. ఈ మందును స్వీకరించిన వారి రోగాలు నయమవడంతో మందుకు గిరాకీ పెరిగింది. మొదట్లో పసరు మందును ఉచితంగా అందించారు. దూర ప్రాంతాల నుంచి రోగులు రావడంతో రద్దీ పెరిగింది. దీంతో కోనాయిపల్లి పసరు మందు కోనాయిపల్లిగా ప్రసిద్ధి చెందింది. రద్దీని క్రమబద్ధీకరించేందుకు గ్రామస్తులు సమావేశమై పసరు మందుకు రుసుము వసూలు చేశారు. అలా వసూలైన సొమ్ముతో కోనాయిపల్లిలో ఎనిమిది దశాబ్దాల కిందట వెంకటేశ్వర స్వామి ఆలయం నిర్మించారు. అప్పటి నుంచి మాఘమాసం శుద్ధ ద్వాదశి నుంచి మూడు రోజులు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు.

కేసీఆర్ సెంటిమెంట్ ఆలయంగా జాతీయ స్థాయిలో ప్రాచుర్యం

ఎనిమిది దశాబ్దాలుగా భక్తులు కోరికలు తీర్చే కోనాయిపల్లి వెంకటేశ్వర స్వామి బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కు సెంటిమెంట్ దేవునిగా విశేష ప్రాచుర్యం పొందారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఈ ఆలయం జాతీయ స్థాయిలో ప్రఖ్యాతి చెందింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 1985 సంవత్సరంలో రాష్ట్ర శాసన సభకు జరిగిన మధ్యంతర ఎన్నికల్లో కేసీఆర్ కోనాయిపల్లి వెంకటేశ్వరాలయంలో నామ పత్రాలను స్వామి వారి పాదాల వద్ద పెట్టి, పూజలు చేసి వెళ్ళి సిద్ధిపేట స్థానం నుంచి తెలుగుదేశం అభ్యర్థిగా నామినేషన్ వేసి మొదటి సారి ఎమ్మెల్యేగా గెలిచారు. అప్పటి నుంచి కేసీఆర్ ఏ పని అయినా ఈ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన తరువాతనే ప్రారంభించడం అనవాయితీగా మారింది. ప్రతి ఎన్నికల్లో ఈ ఆలయంలో పూజలు చేసిన తరువాతనే నామినేషన్ వేశారు. ఉమ్మడి రాష్ట్రంలో కరవు మంత్రిగా, రవాణా శాఖ మంత్రిగా, శాసన సభ ఉపసభాపతిగా పని చేశారు. ఈ పదవుల్లో బాధ్యతలను తీసుకునే ముందు ఈ ఆలయంలోనే పూజలు చేశారు. 2001 ఏప్రిల్ 27 వ తేదీన ఈ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసిన తరువాతనే శాసన సభ ఉపసభాపతి పదవికి, శాసన సభ్యత్వానికి, తెలుగుదేశం పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసి ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు కోసం ఉద్యమించేందుకు తెలంగాణ రాష్ట్ర సమితి (టీ ఆర్ ఎస్) ని స్థాపించారు. హైదరాబాద్ లోని జల దృశ్యం కేంద్రంగా కే సీ ఆర్ నాయకత్వంలోని టీఆర్ఎస్ ఆధ్వర్యంలో 13 ఏళ్ల పాటు ఉద్యమం కొనసాగి 2014లో తెలంగాణ ఉద్యమం కొనసాగింది. ఉద్యమ సమయంలో తీసుకున్న కీలక నిర్ణయాలన్నీ ఈ ఆలయంలో పూజలు చేసిన తరువాతనే తీసుకోవడంతో సెంటిమెంట్ దేవాలయంగా జాతీయ,అంతర్జాతీయ స్థాయిలో ఈ ఆలయం ప్రసిద్ధి చెందింది. తెలంగాణ ఉద్యమ సమయంలో శాసన సభకు జరిగిన ప్రతి ఉప ఎన్నికల్లో టీఆర్ఎస్ తరపున పోటీ చేసిన అభ్యర్థులు అందరూ ఈ దేవాలయంలో పూజలు చేసిన తరువాతనే నామినేషన్ వేశారు. 2001 లో సిద్ధిపేట స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో ప్రచారానికి వచ్చిన అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కూడా ఈ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు కూడా ఈ ఆలయంలో ప్రత్యేక పూజలు చేయడం అన్వాయితీగా వస్తోంది.

ప్రత్యేక రాష్ట్రంలో పునర్నిర్మితమై..

తెలంగాణ ఉద్యమానికి సెంటిమెంట్ దేవాలయంగా ప్రఖ్యాతి పొందిన కోనాయిపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని రాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ముఖ్యమంత్రి హోదాలో రెండు సార్లు 2018, 2023 సంవత్సరాల్లో సందర్శించి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన తర్వాత గజ్వేల్ నియోజకవర్గ అభ్యర్థిగా నామినేషన్ వేశారు. కేసీఆర్ ఆకాంక్షల మేరకు ఆగమ శాస్త్ర నియమాలకు అనుగుణంగా పాత ఆలయం స్థానంలో విశాలమైన దేవాలయాన్ని నిర్మించారు. రాజగోపురం విశాలమైన ఆలయ మండపం, స్వామి వారి గర్భగుడి, పద్మావతి అమ్మవారు, గోదాదేవి ఆలయాలను నిర్మించారు. స్వామివారి గర్భగుడికి ఎదురుగా గరుత్మంతుడి ఆలయాన్ని నిర్మించారు. ఆలయంలో ప్రత్యేకంగా ఆంజనేయుడిని ప్రతిష్టించారు. మండపానికి రాజగోపురానికి మధ్య ఎత్తయిన ధ్వజ స్తంభాన్ని ప్రతిష్ఠించారు. ప్రత్యేకంగా హోమగుండం నిర్మించారు. ఆలయం వెనుక వైపు గ్రామంలో ఆలయానికి సంబంధించిన రెండెకరాల స్థలంలో స్వామివారి కళ్యాణమండపాన్ని నిర్మించారు. ఇందుకోసం రూ.నాలుగు కోట్లను వెచ్చించారు.

ఈ నెల 30 వ తేదీ నుంచి బ్రహ్మోత్సవాలు

పునర్నిర్మితమైన ఈ ఆలయంలో శ్రీ పద్మావతి గోదా సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి చతుర్థ బ్రహ్మోత్సవాలు ఈనెల 30వ తేదీ నుండి ఫిబ్రవరి ఒకటవ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. ఈనెల 30వ తేదీన ఉదయం ఎనిమిది గంటల నుండి విశ్వక్సేనారాధన, వాసుదేవ పుణ్యహవాచనం, అంకురార్పణ, రక్షాబంధనం, ధ్వజారోహణం, దేవత ఆహ్వానం, నిత్య హోమం నిర్వహిస్తారు అనంతరం మధ్యహ్నం 12 గంటలకి శ్రీభూనీళా సమేత వెంకటేశ్వర స్వామి కళ్యాణం నిర్వహిస్తారు. సాయంత్రం ఆరు గంటల నుండి ద్వారతోరణ ధ్వజకుంభారాధన నిత్య హోమం తీర్థ ప్రసాద వితరణ వంటి కార్యక్రమాలు చేపడతారు. ఈనెల 31వ తేదీన ఉదయం ఎనిమిది గంటల నుండి అభిషేకం ద్వారతోరణ ధ్వజ కుంభారాధన, సుదర్శన హోమం పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహిస్తారు. సాయంత్రం ఏడు గంటల నుండి నిత్యహోమం, మంగళ శాసనం, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు చేపడతారు. ఫిబ్రవరి ఒకటవ తేదీన ఉదయం ఆరు గంటల నుండి స్వామివారికి అభిషేకం, నిత్య హోమం, మహాపూర్ణాహుతి, బలిహరణం, చక్రస్నానం, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహిస్తారు. సాయంత్రం 6 గంటల నుంచి ద్వాదశారాధన, సప్తవర్ణాలు ఏకాంత సేవ ఆశీర్వచనం ఉత్సవ సమాప్తి వంటి కార్యక్రమాలు నిర్వహిస్తారు. మూడు రోజులపాటు ప్రతిరోజు మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు చేపడతారు.

-కత్తుల లక్ష్మారెడ్డి, సిద్ధన్నపేట

భారత్–ఈయూ ఒప్పందంపై

అమెరికా ఆగ్రహం

భారత్, యురోపియన్ యూనియన్‌ల మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కొలిక్కి వచ్చిన వేళ.. అమెరికా ఆర్థికశాఖ మంత్రి స్కాట్ బెసెంట్ కీలక వ్యాఖ్యలు చేశారు. ''రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నందుకు భారత్ పై 25 శాతం సుంకాలను విధించాం. కానీ.. ఏం జరిగిందో చూశారా? యురోపియన్లు భారత్‌తో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకున్నారు. రష్యన్ చమురు తొలుత భారత్‌కు వెళ్తోంది. అక్కడి నుంచి శుద్ధి చేసిన చమురు ఉత్పత్తులు బయటకు వస్తున్నాయి. వాటిని ఐరోపావాసులు కొనుగోలు చేస్తున్నారు. తద్వారా తమపై యుద్ధానికి తామే నిధులు సమకూరుస్తున్నారు'' అని బెసెంట్ పేర్కొన్నారు.దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నాయకత్వంలో ఉక్రెయిన్ రష్యా యుద్ధానికి తెరపడుతుందని బెసెంట్ ధీమా వ్యక్తం చేశారు. దీనికి పరిష్కారం చూపేందుకు ట్రంప్ కృషి చేస్తున్నారని, ఈ వ్యవహారంలో ఐరోపా దేశాల కంటే అమెరికానే చాలా పెద్ద త్యాగాలు చేసిందని చెప్పారు. అయితే, ఆ త్యాగాలేంటో ఆయన వెల్లడించలేదు.భారత్‌పై అమెరికా విధించిన సుంకాలు సగానికి తగ్గే అవకాశం ఉన్నట్లు బెసెంట్ ఇటీవల సూచనప్రాయంగా వెల్లడించిన విషయం తెలిసిందే. ''రష్యా చమురు కొనుగోళ్లను భారత్ తగ్గించుకుంది. అది భారీ విజయం. చమురు విషయంలో ఇప్పటికీ టారిఫ్‌లు అమల్లో ఉన్నాయి. వాటిని తొలగించడానికి ఒక మార్గం ఉందని అనుకుంటున్నాను'' అని సుంకాల తొలగింపు గురించి పరోక్షంగా వెల్లడించారు.ఈయూతో ప్రతిపాదిత వాణిజ్య ఒప్పందంపై చర్చలు విజయవంతంగా ముగిసినట్లు వాణిజ్య కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ తెలిపారు. ఈమేరకు ఒప్పందం ఖరారైనట్లు ఆదివారం వెల్లడించారు. ఇరువైపులా వాణిజ్యాన్ని మరింత పెంచేందుకు, ఆర్థిక సంబంధాల బలోపేతానికి ఇది దోహదపడుతుందన్నారు. భారత్ కోణం నుంచి ఈ ఒప్పందం సమతుల్యంగా, దూరదృష్టితో కూడి ఉందని చెప్పారు.

ప్రతి 20 నిమిషాలకు ఓ భారతీయుడి అరెస్ట్

అమెరికాలోకి అక్రమంగా ప్రవేశిస్తూ అక్కడి సరిహద్దుల్లో ప్రతి 20 నిమిషాలకు ఓ భారతీయుడు అరెస్ట్ అవుతున్నట్టు అమెరికా కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ విభాగం వెల్లడించింది. రోజుకు 65 మంది భారతీయులు అరెస్ట్ అవుతున్నట్టు తెలిపింది. అయితే 2024తో పోలిస్తే 2025లో ఈ సంఖ్య కాస్త తగ్గినట్టు పేర్కొన్నది. 2024లో 85,119 మంఅక్రమ వలసలకు భారత్ ప్రధాన దేశంగా నిలుస్తున్నదని ఈ నివేదిక ఆరోపించింది. అడ్డుకున్న భారతీయుల్లో అత్యధికులు ఉద్యోగం, మెరుగైన వేతనాల కోసం వచ్చిన వాళ్లే ఉన్నారని, కఠినమైన విధానాలు అక్రమ చొరబాట్లను గణనీయంగా తగ్గించగలిగినట్టు పేర్కొన్నది. దీంతో చొరబాటుదారులు అత్యంత ప్రమాదకరమైన మార్గాల్ని ఎంచుకుంటున్నారని నివేదిక తెలిపింది.



దేశవ్యాప్తంగా ఘనంగా

గణతంత్ర వేడుకలు

దేశవ్యాప్తంగా 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. న్యూఢిల్లీలో నిర్వహించిన గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో భారత్ తన సాంస్కృతిక వైభవాన్ని, ఆర్థిక ప్రగతిని, యుద్ధ విమానాలు, స్వదేశీ తయారీ క్షిపణులు, కొత్తగా స్థాపించిన రెజిమెంట్లు, ఆపరేషన్ సిందూర్‌లో ఉపయోగించిన అస్త్రశస్త్రాలతోసహా తన పూర్తి సైనిక పాటవాన్ని ప్రపంచానికి చాటిచూపింది. యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా, యూరోపియన్ కమిషన్ ఉర్సులా వాన్ డెర్ లేయెన్ ముఖ్య అతిథులుగా ఈ వేడుకలకు హాజరుకావడంతో ఈ సందర్భం సైనిక ప్రదర్శనతోపాటు కీలక దౌత్యపరమైన ఘటనగా కూడా మారింది. ఏటా జరిగే ఈ సైనిక కవాతు భారతదేశ వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని, రష్యా, అమెరికా నుంచి సమీకరించుకున్న ఆయుధ సంపత్తిని ప్రతిబింబించింది. వందేమాతరం గేయం 150 వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆ ఇతివృత్తంతో జరిగిన గణతంత్ర వేడుక ఆపరేషన్ సిందూర్‌కు కూడా కర్తవ్య పథ్‌లో ప్రాధాన్యత లభించింది. కోస్టా, లేయెన్‌తో కలసి సంప్రదాయ బగ్గీలో కర్తవ్య పథ్‌కు చేరుకున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సైనిక వందనం స్వీకరించిన వెంటనే కవాతు ప్రారంభమైంది. ప్రధాని నరేంద్ర మోదీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, పలువురు ఇతర కేంద్ర మంత్రులు, త్రివిధ దళాల ప్రధానాధికారులు, విదేశీ దౌత్యవేత్తలు, సీనియర్ అధికారులు తదితరులు గణతంత్ర కవాతును వీక్షించారు.

తిలక్ వర్మ వచ్చేస్తున్నాడు!

భారత టాప్ఆర్డర్ బ్యాట్స్‌మన్, తెలుగు ఆటగాడు తిలక్ వర్మ న్యూజిలాండ్‌తో ఐదో టీ20 మ్యాచ్ కు (జనవరి 31) అందుబాటులోకి వచ్చే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. అంతేకాదు 2026 టీ20 వరల్డ్ కప్‌కు కూడా అతడు పూర్తిగా ఫిట్ గా ఉంటాడని సమాచారం. ఈ న్యూస్ అటు టీమిండియా, ఇటు అభిమానుల్లో ఆనందాన్ని రేకెత్తిస్తోంది. తిలక్ పూర్తి ఫిట్‌నెస్ సాధించడం భారత జట్టుకు పెద్ద బూస్ట్‌గా మారనుంది. ఎదుకంటే ఇటీవలి కాలంలో తిలక్ కీలక ఇన్నింగ్స్‌లు ఆడుతూ.. టీమిండియాకు అద్భుత విజయాలు అందిస్తున్నాడు.ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్ కథనం ప్రకారం.. ప్రస్తుతం న్యూజిలాండ్‌తో జరుగుతున్న టీ20 సిరీస్‌లో తొందరపాటుతో తిలక్ వర్మను ఆడించడం లేదట. వరల్డ్ కప్‌ను దృష్టిలో పెట్టుకొని తిలక్ పూర్తిగా కోలుకోవాలని టీమ్ మేనేజ్‌మెంట్ భావిస్తోంది. బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో తిలక్ తీవ్రంగా శ్రమిస్తూ.. రీహాబిలిటేషన్ పూర్తి చేసే ప్రయత్నంలో ఉన్నాడు. విజయ్ హజారే ట్రోఫీ సమయంలో తిలక్ వర్మకు అబ్డొమినల్ సర్జరీ జరిగింది. కనీసం రెండు వారాల విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించారు. దీంతో న్యూజిలాండ్‌తో తొలి మూడు టీ20 మ్యాచ్‌లకు దూరమయ్యారు.అప్పట్లో బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా మాట్లాడుతూ... 'తిలక్ వర్మ తొలి మూడు టీ20లకు అందుబాటులో ఉండరు. మిగిలిన రెండు మ్యాచ్‌లకు అతని ఫిట్‌నెస్‌ను బట్టి పరిగణలోకి తీసుకుంటాం' అని తెలిపారు. తిలక్ గైర్హాజరీతో నాలుగో టీ20లో సైతం సంజూ శాంసన్, ఇషాన్ కిషన్‌లకు మరో అవకాశం దక్కనుంది. గాయానికి ముందు 2025 ఆసియా కప్‌లో తిలక్ మ్యాచ్ విన్నింగ్ ప్రదర్శన చేశాడు.

చరిత్ర సృష్టించిన ముంబై హిట్టర్..!

మహిళల ప్రీమియర్ లీగ్‌లో ముంబై ఇండియన్స్ బ్యాటర్ నాట్‌సీవర్ బ్రంట్ చరిత్ర సృష్టించింది. డబ్ల్యూపీఎల్‌లో మొట్టమొదటి శతకంతో బ్రంట్ రికార్డు నెలకొల్పింది. చావోరేవో పోరులో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు బౌలర్లపై బౌండరీల మోతతో విరుచుకుపడిన ఆమె.. సెంచరీతో భారీ స్కోర్ అందించింది. తనమార్క్ విధ్వంసంతో ఆర్సీబీకి చుక్కలు చూపించిన తను.. 19వ ఓవర్లో సింగిల్ తీసి వంద పూర్తి చేసుకుంది. టీ20ల్లో దూకుడైన ఆటతో చెలరేగే నాట్ సీవర్ బ్రంట్ ఈసారి మహిళల ప్రీమియర్ లీగ్‌లో రెచ్చిపోయింది. గత మూడు సీజన్లుగా ముంబై విజయాల్లో కీలకమవుతున్న ఆమె గెలిచి తీరాల్సిన మ్యాచ్‌లో శతకంతో గర్జించింది. తద్వారా ఈ లీగ్ చరిత్రలో మూడంకెల స్కోర్ సాధించిన తొలి బ్యాటర్‌గా రికార్డు పుస్తకాల్లో చేరింది.ఇప్పటివరకూ జార్జియా వోల్(యూపీ వారియర్స్ తరఫున) 99 నాటౌట్ అత్యధిక వ్యక్తిగత స్కోర్‌గా ఉండేది. కానీ.. బ్రంట్ 59 బంతుల్లో 16 ఫోర్లు, ఒక సిక్సర్‌తో అజేయంగా నిలిచి ముంబైకి భారీ స్కోర్ కట్టబెట్టింది. తన శతకాన్ని భాగస్వామి క్యాథరీన్ సీవర్ బ్రంట్, కుమారుడికి అంకితం చేసిందీ ఇంగ్లండ్ స్టార్.

కీస్‌కు పెగులా షాక్..

ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో సంచలనం నమోదైంది. ఉమెన్స్ సింగిల్స్ డిఫెండింగ్ చాంపియన్ మాడిసన్ కీస్ పోరాటం ముగిసింది. ప్రీక్వార్టర్స్‌లో ఈ అమెరికా క్రీడాకారిణికి మరో అమెరికా అమ్మాయే అయిన పెగులా షాకిచ్చింది. సోమవారం జరిగిన నాలుగో రౌండ్‌లో కీస్‌ను 36, 46 తేడాతో పెగులా మట్టికరిపించింది. గంటా 18 నిమిషాలపాటు జరిగిన మ్యాచ్‌లో పెగులాదే స్పష్టమైన ఆధిపత్యం. తొలి సెట్‌లో వరుసగా మూడు గేములు నెగ్గి పట్టు బిగించిన ఆమె అదే జోరులో తొలి సెట్‌ను అలవోకగానే నెగ్గింది. రెండు సెట్‌లో అదే దూకుడు కొనసాగించిన పెగులా 41తో లీడ్‌లో నిలిచింది. ఆ తర్వాత కీస్ వరుసగా రెండు గేములు నెగ్గి పోటీలోకి వచ్చేలా కనిపించినా పెగులా ముందు నిలువలేకపోయింది. కీస్ 6 డబుల్ ఫాల్ట్స్, 28 అనవసర తప్పిదాలు చేసి మూల్యం చెల్లించుకుంది. ఆమె తప్పిదాలను సద్వినియోగం చేసుకుంటూ ముందుకు సాగిన పెగులా నాలుగు సార్లు బ్రేక్ పాయింట్ సాధించడం ఆమె గెలుపు సులభతరం చేసింది.మరో టైటిల్ ఫేవరెట్ క్రీడాకారిణి స్వైటెక్ కూడా క్వార్టర్ ఫైనల్స్‌లో అడుగుపెట్టింది. నాలుగో రౌండ్‌లో ఆస్ట్రేలియాకు చెందిన ఇంగ్లిస్‌ను 06, 36 తేడాతో ఓడించింది. 22 విన్నర్లతో విరుచుకపడిన స్వైటెక్ మ్యాచ్‌లో హవా ప్రదర్శించింది.

భారత్ మ్యాచ్‌కు పాక్ షాక్!

టీ20 వరల్డ్ కప్ 2026 ముందు అంతర్జాతీయ క్రికెట్‌లో మరోసారి రాజకీయాలు తెరపైకి వచ్చాయి. బంగ్లాదేశ్ జట్టును టోర్నమెంట్ నుంచి తొలగించిన ఐసీసీ నిర్ణయాన్ని నిరసిస్తూ పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (PCB) కొత్త డ్రామాకు తెరలేపింది. ఈ క్రమంలో టీ20 వరల్డ్ కప్‌లో భారత్‌తో జరిగే మ్యాచ్‌ను బహిష్కరించే అంశాన్ని పాకిస్తాన్ పరిశీలిస్తున్నట్టు వార్తలు వస్తున్నాయి.2026 ఐసీసీ పురుషుల టీ20 వరల్డ్ కప్ కోసం బంగ్లాదేశ్ జట్టు భారత్‌కు వెళ్లేందుకు నిరాకరించింది. తమ మ్యాచ్‌లను శ్రీలంకకు మార్చాలని బంగ్లాదేశ్ డిమాండ్ చేయగా, ఐసీసీ ఆ అభ్యర్థనను తిరస్కరించింది. 24 గంటల అల్టిమేటం జారీ చేసినప్పటికీ బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు నుంచి స్పందన రాకపోవడంతో, ఐసీసీ కఠిన నిర్ణయం తీసుకుని బంగ్లాదేశ్‌ను టోర్నమెంట్ నుంచి తొలగించింది. వారి స్థానంలో స్కాట్లాండ్ జట్టుకు అవకాశం కల్పించింది.బంగ్లాదేశ్ తొలగింపుపై పాకిస్తాన్ క్రికెట్ బోర్డు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. గతంలోనే టోర్నమెంట్‌ను బహిష్కరిస్తామని పీసీబీ బెదిరించిన విషయం తెలిసిందే. ఐసీసీ హెచ్చరికల నేపథ్యంలో వెనక్కి తగ్గిన పాకిస్తాన్, నిశ్శబ్దంగా టీ20 వరల్డ్ కప్ జట్టును ప్రకటించింది.

అయితే పాకిస్తాన్ డ్రామా ఇక్కడితో ముగియలేదు. జియో సూపర్ కథనం ప్రకారం, ఫిబ్రవరి 15న కొలంబోలోని ఆర్. ప్రేమదాస స్టేడియంలో భారత్‌తో జరిగే గ్రూప్ మ్యాచ్‌ను బహిష్కరించే అంశాన్ని పాకిస్తాన్ తీవ్రంగా పరిశీలిస్తోంది. బంగ్లాదేశ్‌ను తప్పించి స్కాట్లాండ్‌కు అవకాశం ఇవ్వడాన్ని నిరసిస్తూ ఈ నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని వర్గాలు చెబుతున్నాయి. పాకిస్తాన్.. భారత్‌తో మ్యాచ్ ఆడకపోతే రెండు పాయింట్లు కోల్పోవాల్సి ఉంటుంది. అయితే, ఐసీసీ ఆర్థికంగా భారీ నష్టాన్ని ఎదుర్కొనే అవకాశం ఉందని విశ్లేషకులు అంటున్నారు.పీసీబీ ఛైర్మన్ మొహ్సిన్ నఖ్వీ జట్టుతో సమావేశం నిర్వహించి వ్యూహం, భవిష్యత్ ప్రణాళికలపై చర్చించనున్నారు. సమాఖ్య ప్రభుత్వంతో సంప్రదించిన తర్వాతే తుది నిర్ణయం తీసుకుంటామని ఆయన తెలిపారు. ప్రధానమంత్రి షాబాజ్ షరీఫ్ ప్రస్తుతం దేశంలో లేరు. ఆయన తిరిగివచ్చిన తర్వాతే తుది నిర్ణయం ప్రకటిస్తాం అని నఖ్వీ చెప్పారు. బంగ్లాదేశ్‌కు అన్యాయం జరిగిందని, ఐసీసీ ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తోందని ఆయన ఆరోపించారు. ఐసీసీ నిర్ణయంలో బీసీసీఐ ప్రభావం ఉందా అనే అంశాన్ని కూడా ప్రశ్నించారు.

షెడ్యూల్ ప్రకారం, పాకిస్తాన్ టీ20 వరల్డ్ కప్‌లో

ఫిబ్రవరి 7: నెదర్లాండ్స్,ఫిబ్రవరి 10: అమెరికా.ఫిబ్రవరి 15: భారత్,ఫిబ్రవరి 18: నమీబియాతో తలపడనున్నాయి..

గ్రూప్ మ్యాచ్‌లన్నీ కొలంబోలో జరగనున్నాయి. సూపర్ 8 మ్యాచ్‌లు ఫిబ్రవరి 21 నుంచి మార్చి 1 వరకు, సెమీ ఫైనల్స్ మార్చి 3, 5 తేదీల్లో జరగనుండగా, ఫైనల్ మార్చి 8న అహ్మదాబాద్ లేదా కొలంబోలో నిర్వహించనున్నారు. ఇక, టీ20 వరల్డ్ కప్‌లో పాకిస్తాన్ జట్టుకు సల్మాన్ అలీ అఘా కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడు. పేలవమైన ఫామ్‌లో ఉన్న బాబర్ ఆజం కూడా జట్టులో చోటు దక్కించుకున్నాడు. షాదాబ్ ఖాన్, ఖవాజా నఫాయ్, ఉస్మాన్ తారిక్ వంటి ఆటగాళ్లు జట్టులో ఉన్నారు. అయితే హారిస్ రౌఫ్, మహ్మద్ రిజ్వాన్ వంటి అనుభవజ్ఞులు ఈసారి జట్టుకు దూరమయ్యారు.



బ్రిటిష్‌వారిపై డేవిడ్‌రెడ్డి పోరాటం

హీరో మంచు మనోజ్ 'డేవిడ్ రెడ్డి'గా రానున్నారు. హనుమరెడ్డి యక్కంటి దర్శకత్వంలో నల్లగంగుల వెంకట్ రెడ్డి, భరత్ మోటుకూరి ఈ పానిండియా చిత్రాన్ని నిర్మిస్తున్నారు. బ్రిటిష్ కాలం నాటి నేపథ్యంతో ఉద్రేకపూరితమైన యాక్షన్ డ్రామాగా ఈ సినిమా రూపొందుతున్నది. ఇందులో క్రూరులైన బ్రిటిష్ పాలకులపై ఎదురు నిలిచి పోరాడిన యోధుడిగా మనోజ్ కనిపిస్తారు. మారియా ర్యబోషప్క ఇందులో కథానాయిక. తెలుగుతోపాటు తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో సినిమా విడుదల కానున్నది. రిపబ్లిక్ డే సందర్భంగా ఈ సినిమా ఫస్ట్‌లుక్ పోస్టర్లని మేకర్స్ విడుదల చేశారు.రూత్ లెస్‌గా బ్రూటల్‌గా ఇంటెన్స్ లుక్‌లో కనిపిస్తున్న మంచు మనోజ్‌ని ఈ పోస్టర్లలో చూడొచ్చు. ఈ సినిమా ఆద్యంతం యాక్షన్ అంశాలతో రూపొందుతున్నదని ఈ రెండు పోస్టర్‌లు చెబుతున్నాయి. 'డేవిడ్ రెడ్డి'గా మనోజ్ విశ్వరూపం చూపిస్తున్నారని, ఈ పాత్ర కోసం ఆయన పూర్తిగా మేకోవర్ అయ్యారని, మనోజ్ బాడీ లాంగ్వేజ్, లుక్స్, నటన ఇవన్నీ ఇందులో కొత్తగా ఉంటాయని మేకర్స్ చెబుతున్నారు. హీరోగా ఆయనకు ఈ సినిమా బెస్ట్ కంబ్యాక్ అవుతుందని వారు నమ్మకం వ్యక్తం చేస్తున్నారు. ఆర్.పార్తీబన్, కాంచన తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: ఆచార్య వేణు, సంగీతం: రవి బస్రూర్.

పొట్టి నిక్కర్లో హీట్ పుట్టిస్తున్న సోనాల్!

సాధారణంగా హీరోయిన్స్ ఇండస్ట్రీలోకి రావాలనే కోరికలో భాగంగా మోడల్ గా కెరియర్ మొదలు పెట్టి.. ఆ తర్వాత హీరోయిన్ గా ఇండస్ట్రీలోకి అడుగు పెడుతున్నారు. అయితే ఇండస్ట్రీలోకి వచ్చిన తర్వాత వరుసగా అవకాశాలు అందుకుంటున్నారా అంటే చెప్పలేని పరిస్థితి. కొంతమంది దశాబ్దాల తరబడి ఇండస్ట్రీలోనే కొనసాగితే.. మరికొంతమంది ఒకటి రెండు చిత్రాలకే దూరమవుతున్నారు. ఇంకొంతమంది తెలుగులో సినిమాలు చేసి ఇక్కడ మళ్ళీ అవకాశాలు లభించక.. పక్క భాష ఇండస్ట్రీలో అవకాశాలు అందుకుంటున్న విషయం తెలిసిందే. ఇక అలా అవకాశాలు వెతుక్కునే పనిలో మరోవైపు సోషల్ మీడియాలో ఫాలోవర్స్‌ను పెంచుకొని దర్శకనిర్మాతల దృష్టిలో పడే ప్రయత్నం చేస్తున్నారు. ఇక్కడ తమ అందంతో గ్లామర్ తో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న ఈ సెలబ్రిటీస్ వారు షేర్ చేసే ఫోటోలు అభిమానులను మరింత ఖుషీ చేస్తున్నాయని చెప్పాలి. కొంతమంది అందాలు ఆరబోస్తుంటే మరి కొంతమంది చీర కట్టులో సాంప్రదాయంగా కనిపించి అభిమానులకు దగ్గరవుతున్నారు. అలాంటి వారిలో సోనాల్ చౌహాన్ కూడా ఒకరు. తాజాగా ఇంస్టాగ్రామ్ ద్వారా కొన్ని ఫోటోలు పంచుకున్న ఈ ముద్దుగుమ్మ.. పొట్టి నిక్కర్లో తన అందాలతో అభిమానులను ఆకట్టుకుంది.వైట్ టాప్ ,డెనిమ్ షాట్ లో అందాలు ఆరబోసిన ఈ ముద్దుగుమ్మ భిన్నమైన ఫోజులతో ఫోటోలకు ఫోజులిచ్చింది. ఇక అమ్మడి అందానికి అభిమానులు సైతం ఫిదా అవుతున్నారు. ఇక సోనాల్ చౌహాన్ విషయానికి వస్తే.. మలేషియాలోని సారవాక్ రాష్ట్రంలోని మిరిలో 2005లో మిస్ వరల్డ్ టూరిజం కిరీటాన్ని సొంతం చేసుకుంది . ఈ కిరీటాన్ని అందుకున్న తొలి భారతీయురాలు కూడా ఈమె కావడం గమనార్హం. ఆ తర్వాత ప్రముఖ కవర్ పేజీలపై కూడా సందడి చేసింది ఈ ముద్దుగుమ్మ.ఇక తొలిసారి హిమేష్ రేహమ్మియా తీసిన ఆప్ కా సురూర్ అనే చిత్రం ద్వారా వెండితెరకు తొలిసారి పరిచయమైంది. ఇందులో ఇమ్రాన్ హష్మీ సరసన నటించిన ఈమె తొలిసారి తెలుగులో 2008లో ఇంద్రధనస్సు అనే సినిమాలో నటించి తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకుంది. అయితే ఈ సినిమా సమయంలో ఈమెకు పెద్దగా గుర్తింపు రాలేదు కానీ నటసింహ బాలకృష్ణ హీరోగా నటించిన లెజెండ్ సినిమా ద్వారా ఈమెకు మరింత పాపులారిటీ లభించింది. ఈ సినిమా తర్వాత వరుసగా అవకాశాలు లభించాయి. అలా పండగ చేస్కో, షేర్ , సైజ్ జీరో వంటి తెలుగు చిత్రాలలో నటించి తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఇకపోతే తెలుగులోనే కాదు తమిళ్ వంటి భాషా చిత్రాలలో కూడా నటించింది సోనాల్ చౌహాన్. ఇకపోతే ఒకవైపు తెలుగులో మరొకవైపు హిందీలో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న ఈమె 2023లో ప్రభాస్ హీరోగా నటించిన ఆది పురుష్ సినిమాలో మండోదరి పాత్రలో నటించి ఆకట్టుకుంది. ప్రస్తుతం హిందీలోనే సినిమాలు చేస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న ఈమె అటు టెలివిజన్ సిరీస్లలో కూడా నటిస్తోంది. ఇక ప్రస్తుతం సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటే ఇలా గ్లామర్ ఫోటోలు పంచుకుంటోంది.

క్లైమాక్స్‌పై తరుణ్ భాస్కర్ ఓపెన్ టాక్

డైరెక్టర్ నుంచి యాక్టర్‌గా మారిన తరుణ్ భాస్కర్ అందాల భామ ఈషా రెబ్బా ప్రధాన పాత్రల్లో నటించిన 'ఓం శాంతి శాంతి శాంతిః' చిత్రం ఈ నెల 30న థియేటర్లలో విడుదలకు సిద్ధంగా ఉంది. మలయాళంలో సంచలన విజయం సాధించిన 'జయ జయ జయ జయ హే' చిత్రానికి రీమేక్‌గా వస్తున్న ఈ సినిమాకు ఏఆర్ సజీవ్ దర్శకత్వం వహించారు. ఈ చిత్ర ప్రీరిలీజ్ ఈవెంట్‌ను మేకర్స్ ఘనంగా నిర్వహించారు. ఈ క్రమంలో తరుణ్ భాస్కర్ ఒక ఆసక్తికరమైన విషయాన్ని వెల్లడించారు.మలయాళ వెర్షన్‌తో పోలిస్తే తెలుగు వెర్షన్‌లో క్లైమాక్స్‌ను మార్చినట్లు తరుణ్ తెలిపారు. "మేము క్లైమాక్స్‌ను మార్చాం. ఇది చాలా చర్చనీయాంశంగా ఉంటుంది. వ్యక్తిగతంగా ఆ క్లైమాక్స్ నాకు నచ్చకపోయినా, దర్శకుడి ఆలోచనను గౌరవిస్తూ ఆ సన్నివేశాల్లో నటించాను" అని తరుణ్ భాస్కర్ పేర్కొన్నారు. రీమేక్ చిత్రమైనప్పటికీ తెలుగు ప్రేక్షకులకు తగ్గట్టుగా చేసిన ఈ మార్పు ఎలాంటి ఫలితాన్ని ఇస్తుందో చూడాలి.ఈ చిత్రంలో విలక్షణ నటుడు బ్రహ్మాజీ ఒక కీలక పాత్రలో కనిపించనున్నారు. సృజన్ ఎరబోలు, ఆదిత్య పిట్టి, వివేక్ కృష్ణాని, అనుప్ చంద్రశేఖరన్, సాదిక్ షేక్ మరియు నవీన్ శనివారపు సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించారు. జై క్రిష్ సంగీతాన్ని అందించిన ఈ సినిమాపై ప్రేక్షకుల్లో మంచి అంచనాలు క్రియేట్ అయ్యాయి.

కొరటాలకు.. ఆ ఛాన్స్ ఉంటుందా?

ఎన్టీఆర్ తో దేవర సినిమా చేసిన కొరటాల శివ ఆ సినిమా సీక్వెల్ స్క్రిప్ట్ వర్క్ లో ఉన్నాడని తెలుస్తుంది. దేవర విషయంలో ఎన్టీఆర్ ఫైనల్ కాల్ ఏంటన్నది తెలియాల్సి ఉంది. కొన్నాళ్లు సీక్వెల్ ఉంటుందని అంటుంటే.. తారక్ అంత సాటిస్ఫైడ్ గా లేడు సినిమా ఆగిపోతుందని అంటున్నారు. దేవర 2 విషయంలో ఏదో ఒక క్లారిటీ రావాల్సి ఉంది. ఐతే కొరటాల శివ దేవర ని పక్కన పెట్టి నెక్స్ట్ ప్రాజెక్ట్ కి షిఫ్ట్ అవ్వాలని చూస్తున్నాడు.ఎన్టీఆర్ ప్రశాంత్ నీల్ ప్రాజెక్ట్ పూర్తయ్యాక దేవర 2 ఉంటే దాన్ని చేస్తాడు. ఈలోగా కొరటాల శివ దేవర 2 కి సంబంధించిన వర్క్ చేయాల్సి ఉంది. ఐతే ఈలోగా కొరటాల శివ సీనియర్ స్టార్ హీరో వెంకటేష్ తో సినిమా చేస్తాడంటూ వార్తలు వస్తున్నాయి. విక్టరీ వెంకటేష్ సంక్రాంతికి వస్తున్నాం తో సూపర్ హిట్ అందుకున్నాడు. ఈ సంక్రాంతికి వచ్చిన మన శంకర వర ప్రసాద్ లో కూడా తన రోల్ లో ఆడియన్స్ ని ఆకట్టుకున్నాడు వెంకటేష్. ప్రస్తుతం వెంకటేష్ త్రివిక్రమ్ తో ఆదర్శ కుటుంబం సినిమా చేస్తున్నాడు. ఆ మూవీ సమ్మర్ రిలీజ్ టార్గెట్ పెట్టుకున్నారు. ఇక ఈ ప్రాజెక్ట్ తర్వాత మళ్లీ అనిల్ రావిపూడి డైరెక్షన్ లోనే వెంకటేష్ సినిమా చేస్తాడని టాక్. వెంకటేష్, రానా మల్టీస్టారర్ గా అనిల్ రావిపూడి నెక్స్ట్ సినిమా ఉంటుందని చెబుతున్నారు. ఐతే వెంకటేష్ ఆ సినిమా కమిటైతే కొరటాల శివ సినిమా లేట్ అయ్యే ఛాన్స్ ఉంటుంది.రైటర్ నుంచి డైరెక్టర్ గా మారిన కొరటాల శివ ఆచార్య ముందు వరకు హిట్లు కొట్టిన కొరటాల శివ ఆచార్య డిజాస్టర్ ఇవ్వగా దేవర జస్ట్ యావరేజ్ అనిపించుకుంది. ఐతే దేవర 2 కోసమే రెండేళ్లుగా టైం కేటాయిస్తున్న కొరటాల శివ ఆ సినిమా అప్డేట్ మాత్రం ఇవ్వట్లేదు. దేవర 2 లేకపోతే మాత్రం కొరటాల శివ నెక్స్ట్ ప్రాజెక్ట్ లతో బిజీ అవ్వాలని చూస్తున్నాడు. వెంకటేష్ ఇప్పుడు వరుస సినిమాలతో ఫుల్ స్వింగ్ లో ఉన్నాడు. కథ నచ్చితే కొరటాల శివ ఫ్లాప్ ల గురించి వెంకటేష్ పట్టించుకునే ఛాన్స్ లేదు. డైరెక్టర్ గా తన మార్క్ చూపించిన కొరటాల మళ్లీ బౌన్స్ బ్యాక్ అయితే చూడాలని ఆడియన్స్ కోరుతున్నారు. మరి అది ఏ సినిమాతో అవుతుందో చూడాలి. వెంకటేష్, ఎన్టీఆర్ తో పాటు కొరటాల మరో ఇద్దరు హీరోలతో కూడా టచ్ లో ఉన్నాడని టాక్. మొత్తానికి కొరటాల శివ ఈ ఇయర్ ఏదో ఒక ప్రాజెక్ట్ మొదలు పెట్టి తన సత్తా చాటాలని ఫిక్స్ అయ్యాడని తెలుస్తుంది.

'ఓ! సుకుమారీ' ఫస్ట్‌లుక్ వైరల్

తిరువీర్, ఐశ్వర్య రాజేష్ జంటగా నటిస్తున్న విలేజ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'ఓ! సుకుమారీ'. భరత్ దర్శన్ దర్శకుడు. మహేశ్వరరెడ్డి మూలి నిర్మాత. ప్రస్తుతం ఈ సినిమా నిర్మాణ దశలో ఉన్నది. ప్రమోషన్‌లో భాగంగా ఇప్పటికే విడుదల చేసిన ఈ సినిమాలోని ఐశ్వర్య రాజేష్ ఫస్ట్‌లుక్‌కి మంచి స్పందన వచ్చిందని మేకర్స్ చెబుతున్నారు. ఈ క్రమంలో సోమవారం తిరువీర్ ఫస్ట్‌లుక్‌ని రిలీజ్ చేశారు. రగ్గ్‌డ్, మాసీ లుక్‌లో వీధిలో నడుచుకుంటూ వస్తున్న తిరువీర్‌ని ఈ స్టిల్‌లో చూడొచ్చు.. స్లీవ్ లెస్ బనియన్, లుంగీ, భుజాలపై వేసుకున్న తువ్వాలు, కర్లీ హెయిర్, గడ్డం, నోట్లో టూత్‌బ్రష్ మొత్తంగా పక్కా రూరల్ గెటప్పులో ఆయన ఈ పోస్టర్‌లో కనిపిస్తున్నారు. ఇందులో ఆయన 'యాదగిరి' అనే పల్లెటూరి కుర్రాడిగా నటిస్తున్నారు. తెలుగుతోపాటు తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో విడుదల కానున్న ఈ చిత్రానికి కెమెరా: సీహెచ్ కుషేందర్, సంగీతం: భరత్ మంచిరాజు.



Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana - 500013.
Published at h.no. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana - 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200